



...:::: మన్నె సత్యనారాయణ & ప్రియదర్శిని చాగంటి

## ఆలోచన-సమాలోచన

నిండు పున్నమి నాటి పండువెన్నెల ప్రకృతిని పరవశింపజేస్తోంది. చందమామ నుండి ప్రసరించే చల్లని తెల్లని కిరణాలు. భూమి మీద పుచ్చపువ్వులాంటి తెల్లని దుప్పటిని పరుస్తున్నాయి. వెన్నెలను మేసే చకోరాలు ఆకాశంలో ఆనందంగా విహరిస్తున్నాయి. ఎంత అందమైన ప్రకృతి అనే ఆనంద భావనతో ఆ దంపతుల మనసులు పరవశించాయి. ఆ రాత్రి డాబామీద మంచం మీద పడుకుని ఆకాశం వంక చూస్తూ వారు పొందుతున్న అనుభూతి అదే! అతని అరచేతితో ఆమె అరచేతిని నొక్కాడు. ఆమె తన చేయినతని గుండెలమీద వేసింది. ఇద్దరి నోటినుండి ఒకేసారి "ఈ వెన్నెల.." అనే మాట వెలువడింది. ఇద్దరూ ఆగారు. వారు చెప్పదలుచుకున్నది పైకి అనలేదు. అతనేదో చెబుతున్నాడని ఆమె ఆగింది. ఆమేదో చెబుతుంది కాబోలుననుకొని అతను ఆగాడు. ఇద్దరిమధ్య మళ్ళీ కొంతసేపు మౌనం? నిశ్శబ్దంగా ఉన్న ఆ రాత్రివేళ ఆ మౌనం కూడా ఒక ఆనందహేలగా అనిపించింది.

"ఏదో చెప్పబోయావు" అంది అనూష.

"అదే, ఇలాంటి వెన్నెల్లో చిన్నప్పుడొక పాట పాడుకునే వాళ్ళం..అదే, 'చందమామా రావే...' అని పాట నీకు గుర్తుందా" అన్నాడు దీపక్.

"గుర్తుంది" అందామె.

"ఒకసారి పాడు! నీ కంఠం నుంచా పాటను వింటే మరింత హాయిగా ఉంటుంది" అన్నాడు.

"చందమామ రావె..జాబిల్లి రావె! బండెక్కి రావే..బంతి పూలు తేవే!" అనే పాటను నెమ్మదిగా పాడింది అనూష. ఆమెకు సంగీత శిక్షణ లేదు కానీ ఆమె కంఠం శ్రావ్యంగా ఉంటుంది. పాటలోని మాటలను పొందికగా విడదీసి భావయుక్తంగా పాడుతుంది. జానపదాలు, జావళీలు పాడుతుంది. ఆమెపాట వింటే హాయిగా ఉంటుంది.

అందుకే, దీపక్ భార్యను అప్పుడప్పుడూ పాడమని అడుగుతాడు.

"చాలా బావుంది అనూ! చిన్నతనమెంత అమాయకంగా, ఆనందంగా గడిచింది. అన్నీ కూడా అద్భుతంగా అనిపించేవి. 'చందమామ, చంద్రుడు' అనేవారు. ప్రేమికులకు ప్రేరకుడు చందమామ. ఇది ఆనాటి జనపథాల్లోని భావన."

"అవును దీపక్! ఈనాడు ఖగోళశాస్త్ర పరిజ్ఞానంతో చంద్రుడు కూడా భూమిలాగే ఈ విశ్వంలో ఒక గ్రహం అని తెలుసుకున్నాం. అయినా కూడా, ఆ చిన్ననాటి పాటలు, కథలూ విన్నప్పుడు ఆనందకరమైన అనుభూతి కలుగుతూనే ఉంటుంది. దాని నెవరూ కాదనలేరు. వాటిని వింటున్నప్పుడు ఆధునికమైన సైన్సు పరిజ్ఞానాన్ని కాసేపు మరచిపోతాం. అవునా?" అంది ఆమె.

"అవును అనూ! ఒకసారి మనం ఆ చంద్రగ్రహం మీదకు వెళ్దామా?" అన్నాడతను.

అతని వంక ఆశ్చర్యంగా చూసింది.

**కల్పనా జగత్తులో విహరింపజేసే సైన్స్ ఫిక్షన్**

"ఏమిటి నీ వనేది? పొరుగూరుకోసారి వెళ్ళొద్దామా అన్నంత తేలికగా అంటున్నావు. చంద్రగ్రహానికి మనమెలా వెళ్ళగలం? మన లాంటి వాళ్ళకది సాధ్యమా?" అంది.

"ఒకోసారి అసాధ్యమనుకున్నది సాధ్యమవు తుంది"

"నీకేదో ఆలోచనుందనుకుంటాను, కాస్త వివరంగా చెప్పు"

" ఈ రోజు 'ది హిందూ' పత్రికలో ఒక వార్త! అమెరికాలోని 'నాసా'కు మనదేశంలోని 'ఇస్రో'కు మధ్య ఒక ఒప్పందం కుదరబో తోంది."

"ఏవిటది"

"నాసా వారి సాంకేతిక పరిజ్ఞాన సహకా రంతో మన 'ఇస్రో'వారు మేన్డ్ స్పేస్ షిప్పును (మనుషులతో కూడిన అంతరిక్ష నౌక) చంద్రుని మీదకు పంపబోతున్నారు."

"అదేంటి, నాసా వాళ్ళు ఇదివరకే మనుష లతో అంతరిక్షనౌకలను చంద్రగ్రహం మీదకు పంపించారు కదా! ఇప్పుడు మనకెందుకు సహ కరిస్తున్నారు?"

"వాళ్ళు **1969**లో మొదటిసారిగా చంద్ర గ్రహం మీదకు మనుష్యులను దింపడానికి ముందు, చంద్రుని గురించి చాలా అధ్యయనం చేసారు. కొన్ని స్పేస్ క్రాఫ్టలను (అంతరిక్ష నౌకలు) ప్రయోగించి చంద్రగ్రహం చుట్టూ తిప్పారు. మనుషులతో కూడిన ఒక నౌకను చంద్రుని 'ఆర్బిట్'లో తిప్పి చంద్రగహం యొక్క అవలివైపు ఫోటోలు కూడా తీసారు. ఎన్నో ఫోటోల ద్వారా ఆ గ్రహం స్వరూపాన్ని తెలుసు కున్నారు. కొన్ని యంత్ర నౌకలను షంపి, అక్కడి ఉపరితల మట్టి శాంపిల్స్ కూడా తెప్పిం చారు."

"అవును. అన్ని జాగ్రత్తలు తీసుకుని అధ్య యనం చేసారని విన్నాను" అంటే చివరిగా **1969** జూలై **16** న హూస్టన్ (టెక్సాస్ రాష్ట్రం) లిండన్ బి. జాన్సన్ స్పేస్ సెంటర్ నుంచి ముగ్గురు ఏస్ట్రోనాట్స్‌తో (అంతరిక్ష యాత్రి కులు) అపోలో ॥ అనే అంతరిక్ష నౌక బైలుదేరి చంద్రగ్రహం వైపు దూసుకుపోయింది."

"ముగ్గురు వెళ్ళారా?" అనడిగిందామె.

"అవును, ముగ్గురే. వారు నీల్ ఆమ్‌స్ట్రాంగ్, ఎడ్విన్ బజ్ ఆల్ద్రిన్, మైఖేల్ కాలిన్స్ అనేవారు. స్పేస్ క్రాఫ్ట్ 'లూనార్ ఆర్బిట్' చేరుకున్నాకా, ఆమ్‌స్ట్రాంగ్, అడ్విన్‌లు లూనార్ మాడ్యూల్లో చంద్రగ్రహం ఉపరితలంపై దిగారు. ఆ రోజు జూలై **20, 1969**వ తేదీ. మొదటిగా నీల్ ఆమ్ స్ట్రాంగ్ దిగాడు. ఆ తర్వాత **19** నిమిషాలకు ఆల్డ్రిన్ దిగాడు. చంద్రగ్రహం మీద అడుగుపె ట్టిన తర్వాత ఆమ్‌స్ట్రాంగ్ అన్నాడు. "ఇది మని షికి చిన్న అడుగు, మానవాళికి గొప్ప ముంద డుగు" అని.

"అంతేకాదు! భూమి చరిత్రలో, మానవప్ర స్థానంలో ఇతర గ్రహం మీద వేసిన మొదటి అడుగు అది" అనూష సంతోషంగా అంది.

"వారక్కడనుండి భూమిమీదున్న 'నాసా' శాస్త్రవేత్తలతో మాట్లాడారు. అమెరికన్ జాతీయ జెండాను చంద్రగ్రహం ఉపరితలంపై వారిద్దరూ పాతారు. వారుదిగిన ప్రాంతానికి నాసా శాస్త్రవే త్తలు "ది సీ ఆఫ్ ట్రాంక్విలిటీ" అని పేరు



## ఒక మాట

అనంత విశ్వంలో, కోటానుకోట్ల గ్రహాల్లో, ఎక్కడైనా ఈ భూమి మీదున్నలాంటి జీవరాశి, బుద్ధిజీవులూ వున్నారా అని ప్రాచీనకాలం నుండీ మనిషి శోధన చేస్తూనే వున్నాడు. ప్లేటో, అరిస్టాటిల్ వంటి మేధావులు, వరాహమిహిరుడు, ఆర్యభట్టు వంటి ఖగోళ శాస్త్రజ్ఞులూ గ్రహాంతర రహస్యాలను తెలుసుకోవడానికి ప్రయత్నాలు చేసారు. అయితే, అప్పట్లో వారికి ఇప్పుడు లభిస్తున్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం యొక్క సహాయం, భారీ టెలిస్కోపులు వంటి సైంటిఫిక్ ఎక్విప్‌మెంటూ లేవు. వారు మేధస్సుతో ఊహాత్మకమైన పరిశీలన చేసి తెలుసుకునేవారు.

అనంతరకాలంలో ఐజాక్ న్యూటన్ యొక్క 'గురుత్వాకర్షణ సిద్ధాంతము', తరువాత అల్బర్టు ఐన్‌స్టీన్ యొక్క 'సాపేక్ష సిద్ధాంతము' భౌతిక శాస్త్రంలోను, గ్రహాల అధ్యయనంలోనూ అద్భుతమైన ప్రగతికి దోహదం చేసాయి. రష్యావారు మొదటి స్పుత్నిక్ సహాయంతో ఉపగ్రహాన్ని ఆకాశంలోకి పంపి భూమిచుట్టూ పరిభ్రమింపచేసారు. అప్పట్నుంచీ, రష్యాతోపాటు ఇతర దేశాలు తమ ప్రయత్నాలు చేస్తూనే వున్నాయి. అయితే, గ్రహాంతరయానం, పరిశోధనల్లో అమెరికాలోని 'నాసా' చాలా ముందడుగులు వేసింది.

'నాసా' వారు ముందుగా చంద్రగ్రహ అధ్యయనానికి ప్రాధాన్యతనిచ్చారు. అనేక అధ్యయన ప్రయత్నాల తరువాత, వారు 1969లో ఇద్దరు మనుషులను చంద్రగ్రహం మీద దింపి, గ్రహాంతరయానంలో మొదటి అద్భుతాన్ని సాధించారు. అలా 1972 వరకూ మరో 5 సార్లు మనుషులను పంపి పరిశోధన సాగించారు. ఆ తరువాత వారి పరిశోధనలను అంగారక గ్రహం మీద చేయడం ప్రారంభించారు.

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ అయిన 'ఇస్రో' (ISRO) అతి తక్కువ కాలంలో అంతరిక్ష పదిశోధనలో అద్భుతమైన ప్రగతిని సాధించింది.

'నాసా' వారు కూడా ఆశ్చర్యపడేంత ప్రగతిని మన శాస్త్రవేత్తలు సాధించారు. వారు అత్యంత ప్రతిష్టాత్మకమైన 'చంద్రయాన్' ప్రారంభించారు. త్వరలోనే మానవ సహితమైన లూనార్ వాహనాన్ని చంద్రునిమీదకు పంపించడానికి కృషిచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ ఫిక్షన్ నవల వ్రాయడం జరిగింది.

'చంద్రునితో ఒక రోజు' అనే ఈ నవల మన 'ఇస్రో' శాస్త్రజ్ఞుల విజయాలకి శుభాకాంక్షలు తెలుపుతోంది.

**-రచయితలు**

---

పెట్టారు. ఆ పరిసరాలలో వారు కాసేపు తిరిగి ఫోటోలు తీసారు. కొన్ని చంద్రశిలలను సేకరించారు. తరువాత వారు దిగిన మాడ్యూక్‌లోనికి తిరిగి వచ్చేసారు. తలుపు మూసేసారు."

"మరి మూడవ వ్యక్తి మైఖేల్ కాలిన్స్ ఎక్కడున్నాడప్పుడు?"

"అతను లూనార్ ఆర్బిట్‌లో కమాండ్ మాడ్యూల్‌లో ఉన్నాడు. వారిద్దరూ మాడ్యూల్‌లోకి ప్రవేశించాకా కొంతసేపు నిద్రించారు. తర్వాత వారిని తీసుకువచ్చిన 'ఈగల్ మాడ్యూల్' పైకి ఎగసి కమాండ్ మాడ్యూలులోకి ప్రవేశించింది. ఆ విధంగా వారు కాలిన్‌ను మళ్ళీ కలిసారు"

"అంటే, అంతా ముందస్తు ప్రణాళికతో శాస్త్రబద్ధంగా జరిగిందన్నమాట" అంది అనూష.

"అవును. తరువాత జూలై 22వ తేదీన అపోలో 11 దిగడం ప్రారంభించింది. 24వ తేదీన పసిఫిక్ సముద్రంలో దిగింది. ముందుగా చేసిన ఏర్పాట్లతో వారిని నేలమీదకు తీసుకువచ్చారు."

"హమ్మయ్య! చివరకు వీరు భూమ్మీద మనుషలను చేరారన్నమాట" అంది.

"అప్పుడే కాదు. వారికి అనేక ఆరోగ్యపరమైన పరీక్షలు చేసారు. వారితోపాటు ఏవైనా కొత్తబ్యాక్టీరియా వచ్చిందేమోనని పరీక్షలు నిర్వహించారు. ఏమీ లేదని, అంతా బాగానే ఉందని నిర్ధారించుకున్నాక, వారిని జనబాహుళ్యంలోకి తీసుకువచ్చారు" అని చెప్పాడు.

"మరి, ఇప్పుడు ఇస్రోతో ఒప్పందమేమిటి?" అనడిగింది.

"ఆ తర్వాత మరో అయిదుసార్లు మానవసహితమైన అంతరిక్ష నౌకలను చంద్రుని మీదకు పంపారు. చాలా సమాచారాన్ని సేకరించారు. అక్కడి వాతావరణము, ఖనిజాలు, జీవరాశి ఉనికి, నీరు, గాలి మొదలైన వాటిని గురించి అధ్యయనం చేసారు. ఇలా 1972 వరకు కొన సాగింది. ఆ తర్వాత చంద్రుని గురించి వారి ఈ ప్రయత్నాలు తాత్కాలికంగా ఆగాయి."

"అంత అతికష్టమైన, ఖర్చుతో కూడిన పరిశోధనలు చేసాకా ఎందుకు ఆగారు వాళ్ళు?"

"వారికుండే కారణాలు వారికున్నాయి. ఆ తర్వాత 'మార్స్' అంగారకగ్రహం - పరిశోధనలు ప్రారంభించారు. ఆ ప్రయత్నం కూడా బాగా ముందుకు సాగింది. సాగుతున్నది కూడా! ఈ లోగా మన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో అంతరిక్షపరిశోధనలో చాలా విజయాలు సాధించింది. రాకెట్లలో ఎన్నో ఉపగ్రహాలను తీసుకెళ్ళి అంతరిక్షంలో ఉంచింది. ప్రపంచదేశాలు - ముఖ్యంగా 'నాసా' కూడా ఆశ్చర్యపడేలాంటి విజయాలతో ముందుకు సాగుతోంది. 2019లో చంద్రగ్రహం మీదకు అంతరిక్ష నౌకను పంపడానికి ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నది కదా! ఈ పరిస్థితులలో 'నాసా' ఒక ఆలోచనకొచ్చింది. తామేలాగూ చంద్రునిపై ప్రయోగాలు ప్రస్తుతానికి చేయడం లేదు. అంగారకుని మీద, ఇతర అంతరిక్ష పరిశోధనలూ చేస్తున్నది. 'ఇస్రో' ఇప్పుడు ప్రారంభిస్తే మనిషిని చంద్రగ్రహం మీద దింపడానికి మరికొంతకాలం పడుతుంది. తాము దాటిన అంచెలన్నీ వారు కూడా దాటాలి. అందుచేత, చంద్రయానం గురించి తామింతవరకూ సాధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇస్రోతో

## ఇది విన్నారా?



★ నక్షత్రాల పరిమాణంలో మార్పు ఉండదు.

★ నక్షత్రాల మధ్య దూరాన్ని కొలవడానికి ప్రామాణికం 'పార్‌సెక్'.




★ అత్యధికంగా ఆమ్లవర్షాలు కురిసే దేశం నార్వే.

పంచుకుంటే, వారు మొదటి ప్రయత్నంలోనే మనిషిని చంద్రునిపై దింపగలుగుతారు. అందు వలన చంద్రగ్రహం మీద జరిగే పరిశోధనలు బాగా ముందుకు సాగుతాయి. తమ ఈ ప్రతిపాదనను నాసా వారు ఇస్రోకు చేసారు. ఇస్రో అందుకంగీకరించింది.

"అయితే ఇప్పుడు మనుషులను చంద్రగ్రహం మీదకు పంపిస్తోంది"

"అవును. అందుకవసరమైన రాకెట్ల నిర్మాణం, మాడ్యూల్సు మొదలైన వాహక యంత్రాలను ఇస్రో తయారుచేసుకుంటోంది. చంద్రగ్రహం మీదకు పంపించవలసిన ఆస్ట్రోనాట్స్‌ను కూడా ఇస్రో ఎంపిక చేసుకుంటుంది. అలా ఎంపికైన వారికి నాసా శిక్షణనిస్తుంది.

అందుకు మిలటరీలో అనుభవమున్న ఇంజనీర్లనో, లేకపోతే మంచి శాస్త్రజ్ఞానమున్న వారినో ఎంపిక చేసుకుంటారు కదా?"

"అలాకాదు. ఈసారి ముగ్గురు సాధారణ పౌరులని పంపించాలని నిర్ణయించారు. (మొట్టమొదట చంద్రునిమీద దిగిన నీల్ ఆమ్‌స్ట్రాంగ్ సివిలియన్ పైలట్) అంతేకాదు, ఈ ముగ్గురిలో ఒకరు స్త్రీ కూడా వుంటారు. ఒక పురుషుడిని, ఒక స్త్రీని చంద్రగ్రహం మీద దింపుతారు."

"అలా అయితే చాలామంది ముందుకొస్తారు కదా!"

"రానివ్వు. ఒకోసారి చివరున్నవాడికి కూడా అవకాశమొస్తుంది. వాళ్ళకు కావాల్సింది. అభ్యర్థులు ఆరోగ్యంగా, దృఢంగా ఉండాలి. 40 ఏళ్ళ లోపు వారై ఉండాలి. సాంకేతిక విషయాలనర్థం చేసుకునే విద్య ఉంటే చాలు. పరిస్థితులనెదుర్కొనగలిగే ధైర్యం, ఓర్పు ఉండాలి. మనిద్దరం ఆరోగ్యం ఉన్నాం. మొన్నటివరకూ నీవుబ్యాట్‌మింటన్ ఆడేదానివి. నేనిప్పటికీ హాకీ ఆడతాను. ఇద్దరం దృఢంగానే ఉంటాం కదా! నీవు ఎమ్ఎస్సీ, నేను ఎమ్‌టెక్. నాకు 32 సంవత్సరాల వయసు. నీకు 30. వారడిగిన అర్హతలన్నీ మనకున్నాయి. మనం ఎంపిక అయితే మంచిదే. కాకపోయినా ఫర్వాలేదు. ఇలాగే ఉంటాం. నీవు ధైర్యంగా రాగలిగితే అప్లై చేద్దాం" అన్నాడు దీపక్.

"నాకే అధైర్యమూ లేదు. అసలవకాశం రావాలే కాని, వస్తే నీ కన్నా ముందుంటాను" అంది అనూష ఉత్సాహంగా.

"అయితే, రేపువెబ్‌సైట్ చూద్దాం. తర్వాత ఇస్రో ఆఫీసుతో కూడా మాట్లాతాను. దాన్నిబట్టి అప్లై చేద్దాం" అన్నాడు దీపక్.

అనుకోకుండా ఇలాంటి ప్రకటన పత్రికల్లో రావడం, ఆ సమాచారం తనకు తెలియడం బాగానే ఉందనిపించింది వారిద్దరికీ. ఇద్దరూ ఉత్సాహవంతులే! తాము చేయబోయే సాహసాలను ఊహించుకుంటూ ఇద్దరూ ఆ రాత్రి సుఖంగా నిద్రపోయారు.

★ ★ ★

దీపక్, అనూషలది ప్రేమవివాహం కాదు కాని, వివాహానికి ముందే కాస్తదూరపు బంధుత్వముంది. అందుకే, ముందే వారొకరికొకరు తెలుసు. అతనొక ప్రభుత్వ టెక్నాలజీ కంపెనీలో ఇంజనీరుగా చేస్తున్నాడు. ఆమె కొంత కాలం లెక్చరర్‌గా చేసి, తర్వాత విరమించుకుంది. ఇద్దరి ఆలోచనలూ, అభిరుచులూ కలుస్తాయి. అందుకే వారిది అన్యోన్య దాంపత్యం.

ఆ మర్నాడు వెబ్‌సైట్‌లో చూసారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన సమాచారము చాలావరకు అందులో ఉంది. అప్లికేషన్సు డౌన్‌లోడ్ చేసారు. అర్హతలు, నియమ, నిబంధనలు (టెరమ్స్ అండ్ కండిషన్స్)ను కూడా దాని నుండే తీసుకున్నారు. అవన్నీ కూడా చాలా పకడ్బందీగా ఉన్నాయి. తరువాత దీపక్ శ్రీహరికోటలోని 'ఇస్రో' ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసుకు ఫోను చేసి, అక్కడి ఆఫీసరుతోమాట్లాడాడు. ఆయన మరికొన్ని వివరాలు చెప్పాడు.

"మీకు మేం నిర్ణయించిన అన్ని అర్హతలు ఉంటేనే దరఖాస్తు చేయండి. ఇంటర్వ్యూ చాలా కఠినంగా ఉంటుంది. నియమనిబంధనలు చాలా కఠినంగా ఉంటాయి. తు.చ. తప్పకుండా అనుసరించగలగాలి. ఆలోచించుకుని చేయండి" అని చెప్పాడతను.

ఆ అప్లికేషన్లు రెండూ పూర్తిచేయడానికే వారికి రెండురోజులు టైం పట్టింది. ఇద్దరూ కలసికాకుండా ఎవరికి వారే అప్లికేషన్లు పంపాలి. ఇంటర్వ్యూలో కూడా ఎవరి అర్హతల నుబట్టి వారిని ఎంపిక చేస్తారు. వారడిగిన సమాచారం కోసం కొన్ని సర్టిఫికెట్లను వారు సమకూర్చుకోవలసి వచ్చింది. అవికాక, వివిధ రకాల సర్టిఫికేట్లను దరఖాస్తులకు జత చేయవలసి వచ్చింది.

అప్లికేషన్సు ఇస్రోవారికి పంపేముందు దీపక్, అనూషతో అన్నాడు.

"మన ప్రయత్నం గురించి మరోసారి ఆలోచించవలసిన అవసరముందా? నిర్ణయానికి కట్టుబడి ఉన్నామా?"

"సందేహమేమీ అక్కర్లేదు. నేను దృఢంగా

నిర్ణయించుకున్నాను. నీకు కూడా అలాంటి దృఢచిత్తముంటే పంపించు" అంది అనూష.

దీపక్ రెండు అప్లికేషన్లను ఇస్రోకు పంపించాడు.

"ఒక విషయం. అంతా బాగా జరిగి మనం ఎంపికైతే మంచిదే! అంతవరకూ ఈ విషయం మన పెద్దవాళ్ళతో సహా, ఎవ్వరికీ చెప్పొద్దు. పెద్దవాళ్ళు భయపడతారు. వద్దంటారు. కొందరు స్నేహితులు నిరుత్సాహపరచవచ్చు. కొందరు గేలి చేయవచ్చును. అందువలన సెలెక్షను పూర్తయ్యేవరకూ ఎవరితోనూ అనొద్దు. సెలెక్ట్ అయితే అపుడు ఎలాగూ చెప్పక తప్పదు" అన్నాడు దీపక్.

"అవును, నిజమే! ఎవరితోనూ అనొద్దు" అంది అనూష.

"ఇస్రో నుంచి సమాచారం అందేవరకూ మనం దీన్ని గురించి ఆలోచించొద్దు. మన పనులు మనం చూసుకుందాం" అన్నాడు దీపక్.

"అలాగే" అంది అనూష.

★ ★ ★

ఒక నెల గడిచింది. ఇస్రో నుండి సమాచారమేమీ రాలేదు. అయితే, దీపక్ ఉద్యోగం చేస్తున్న సంస్థ అతన్ని ఉద్యోగరీత్యా అమెరికా పంపడానికి నిర్ణయించింది. అతనక్కడ రెండు నెలలుండవలసి వస్తుంది. అయితే, అతనక్కడుండగా ఇంటర్వ్యూ వస్తే మిస్ అయ్యే అవకాశముంది. అనూష కూడా అలాగే అంది. దీపక్ కంపెనీ బాస్‌తో ఏదో ఒక సాకు చెప్పి ఈసారికి అమెరికా వెళ్ళలేనని, అందుకనుమతించవలసినదిగా కోరాడు. అతనలా రెండు, మూడు సార్లు అభ్యర్థించాకా వాళ్ళు అంగీకరించారు. దీపక్ స్థానంలో మరొక ఇంజనీరును అమెరికా పంపారు.

దీపక్‌కు, అనూషకు చంద్రగ్రహ యాత్ర గురించి ఆలోచనలొస్తూ ఉన్నాయి. అసలు తాము ఎంపికవుతామా లేదా అనిపించేది. ఎందుకంటే, దేశవ్యాప్తంగా చాలామంది అందుకర్హత కలిగిన వాళ్ళుంటారు. వాళ్ళంతా అప్లై చేస్తే తమకవకాశమొస్తుందా అని వారి సందేహం.

రెండు నెలలు పూర్తయ్యేలోగా ఇద్దరికీ కూడా ఇస్రో నుండి ఇంటర్వ్యూ లేఖలు వచ్చాయి. ఒకరికే కాకుండా, ఇద్దరికీ ఇంటర్వ్యూలు వచ్చినందుకు సంతోషించారు.

ఇంటర్వ్యూలో ఎలాంటి విషయాలడుగుతారో ముందుగా కొంత ఊహించి చర్చించుకున్నారిద్దరూ.

ఇంటర్వ్యూ తేదీనాటికిద్దరూ, శ్రీహరికోటలోని ఇస్రో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసుకు వెళ్ళారు.

ఇస్రో శాస్త్రజ్ఞులు, అధికారులు ఊహించిన విధంగా కాని, ఇతరులనుకున్న విధంగా గాని బాగా ఎక్కువ అప్లికేషన్లు రాలేదు. దేశవ్యాప్తంగా 100 మంది అప్లై చేశారు. వారిలో 75మంది పురుషులు, 25 మంది స్త్రీలు.

అయితే వారు ప్రకటించిన అర్హతలు కలిగినవారు దేశంలో చాలామందే ఉంటారు కాని, ఇస్రోకు చంద్రగ్రహయానం మొదటి ప్రయత్నం కనుక, వారెంత సమర్ధంగా నిర్వహించగలరో అనే అనుమానం కొందరికుంది. అనవసరంగా రిస్కు తీసుకోవడమెందుకని కొందరు వెనకకు తగ్గారు.

ఆ వంద అప్లికేషన్సునూ, ఇస్రో వారు వడపోసి, 20మందిని మాత్రం ఇంటర్వ్యూకు పిలిచారు. వారిలో 15 మంది పురుషులు, 5 మంది స్త్రీలు. వారిలో దీపక్, అనూష ఉన్నారు.

అక్కడున్న అతిథి గృహంలో వారందరికీ మకాం ఏర్పాటుచేశారు. ఆంధ్ర, కేరళ, పంజాబ్, గుజరాత్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు చెందినవారు ఆ 20 మంది. వారు ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. అందరూ ఉత్సాహంగా ఉన్నారు.

తమలో ఎవరు ఎంపికైనా, మిగిలినవారు వారికి అభినందనలు తెలపాలనుకున్నారు. అందుకోసం వారందరూ అడ్రస్సులు, ఫోన్ నెంబర్లూ ఇచ్చుకున్నారు. దీపక్, అనూషలు భార్యాభర్తలని తెలిసి మిగిలినవారు వారిద్దర్నీ సరదాగా ఆటపట్టించారు. అనూషతోపాటు వచ్చిన మిగిలిన నలుగురూ స్త్రీలూ, అవివాహితలే!

ఇంటర్వ్యూలు మొదలయ్యాయి. ఒక్కొక్కర్ని పిలుస్తున్నారు. చాలా విషయాలు అడుగుతున్నారు. వారందరూ అనుకున్నదానికంటే ఇంటర్వ్యూ కష్టంగా ఉంది.

ముందుగా స్త్రీలను ఇంటర్వ్యూ చేసారు. వేరే వ్యక్తులతో కలిసి అంతరిక్షనౌకలోనూ, తర్వాత చంద్రగ్రహం మీద ఉండడానికి మీకేమభ్యంతరం ఉండదు కదా అనడిగారు. తమకెలాంటి అభ్యంతరము లేదని, మిగిలిన నలుగురు స్త్రీలూ చెప్పారు. మీ కుటుంబ సభ్యులిందుకు అంగీకరిస్తారా అనడిగారు. వారి అంగీకారంతోనే తాము వచ్చామని వీరు చెప్పారు.

## ఇది విన్నారా?



★ పచ్చ ఆకులున్న మొక్కను ఎర్రకాంతిలో ఉంచితే అది నల్లగా కనిపిస్తుంది.

★ మూత్రం పసుపు రంగులో ఉండడానికి కారణం 'థైయామిన్'.

★ అతి తేలికైన పదార్థం 'హైడ్రోజన్'.



★ గ్రీకు పదం ఎర్త్‌కు అర్థం 'పొడి నేల' అని.

★ 'సోలారిస్' అనేది ఒక నక్షత్రం.

అనూషను ఇంటర్వ్యూ చేస్తున్నపుడామె వివాహితని వారికర్థమైంది.

"మీరీ ఎక్స్‌పెడిషన్‌లో పాల్గోడానికి మీ భర్త అంగీకరిస్తారా?" అని ఆమెనడిగారు.

"నా భర్త కిష్టమే. అతను కూడా ఇంటర్వ్యూ కొచ్చారు" అందామె.

"ఆయన కూడా వారిలో ఉన్నారా? అతని పేరు?"

"దీపక్" అని అతని అప్లికేషను వివరాలు చెప్పింది.

అతని అప్లికేషన్ను తీసి వారు పరిశీలించారు. అయితే ఆమె ముందేమీ వ్యాఖ్యానించలేదు.

స్త్రీల తర్వాత, పురుష అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసారు.

దీపక్ ఇంటర్వ్యూ అయిన తరువాత వారడిగారు.

"మీ భార్య అనూష కూడా ఈ ఇంటర్వ్యూలో ఉన్నారు. మీ కిద్దరికీ ఆమోదమేనా?"

"మేమిద్దరం పరస్పరం ఇష్టపడే అప్లై చేసాము. ఇద్దరమీవిషయంలో ఒకేరకమైన ఉత్సాహంతో ఉన్నాము" అని చెప్పాడు దీపక్.

అందరి ఇంటర్వ్యూలూ అయ్యాయి. ఆ తరువాత అందరికీ వైద్య పరీక్షలు జరిపారు. అవయ్యాకా ఫిట్‌నెస్ పరీక్షలు జరిపారు. మొత్తం మీద వారు ప్రకటించిన నిబంధనలన్నీ చాలా స్ట్రిక్ట్‌గా అమలుజరిపారు.

అయితే వారిలో ఎవ్వరికీ తాము సెలెక్ట్ అవుతామా లేదా అనే సూచనను అందనివ్వలేదు. ఎవరుమటుకు వారు ఎదురుచూడాల్సిందే. వచ్చిన వారందరికీ టి.ఎ. మొదలైన బెనిఫిట్స్‌ని బాగానే ఇచ్చారు. రిజల్ట్సు తొందరలో తెలియచేస్తామని చెప్పారు.

ఆ ఇరవైమంది అభ్యర్థులూ ఎవరి ఊళ్ళకు వాళ్ళు సంతృప్తితోనే వెళ్ళిపోయారు.

★ ★ ★

అనూష, దీపక్ ఆ ప్రయత్నం గురించి కాని, ఇంటర్వ్యూల గురించి కానీ ఎవరితోనూ అనలేదు. దీపక్ మళ్లీ తన ఉద్యోగ బాధ్యతలోకి వెళ్ళాడు. ఈలోగా అనూష తల్లీ తండ్రీ వచ్చి కూతురి దగ్గర రెండురోజులుండి వెళ్ళారు. ఆమె సూచనగా కూడా వాళ్ళతో అనలేదు.

ఈ లోగా దీపక్ చేస్తున్న కంపెనీ ఇంజనీరింగు సౌలభ్యం కోసం మెషినరీపరంగా కొన్ని మార్పులు చేయవలసి వచ్చింది. విదేశాల నుండి కూడా కొందరు ఎక్స్‌పర్ట్స్‌ను రప్పించింది యాజమాన్యం. అందువలన దీపక్ ఆ పనుల్లో బిజీ అయిపోయాడు. పగలే కాదు, ఒక్కోరోజు రాత్రులు కూడా ప్లాంటులోనే ఉండిపోవలసి వస్తోంది. అందులో అతను చేస్తున్నది బాధ్యతాయుతమైన ఉద్యోగం కనుక తప్పడం లేదు.

ఈ కారణం వలన అతను ఇంటర్వ్యూ ఫలితాల గురించి ఆలోచించలేకపోయాడు. ఎప్పుడైనా మధ్యలో గుర్తొచ్చినా, వాళ్ళే తెలియచేస్తారులే అనుకునేవాడు. అనూష కూడా, అతనికంత పనిఒత్తిడి ఉన్నందువలన, ఈ విషయం ప్రస్తావించడం లేదు.

కంపెనీలో జరుగుతున్న ఆ పనుల మీదనే అతను మధ్యలో ఒకసారి జర్మనీ వెళ్ళి రావల్సి వచ్చింది. అక్కడి కెళితే ఎన్నిరోజులు పడుతుందో అనిపించిందతనికి కాని, వారం రోజుల తర్వాత తిరిగి వచ్చే పని అని అర్థమైంది. అందువలన ఫర్వాలేదనుకొని నలుగురు టీమ్‌తో కలిసి వెళ్ళాడు.

అతను తిరిగి వచ్చేలోగా సెలెక్షను గురించి ఏదైనా తెలిస్తే ఎలాగ అనుకుంది అనూష. ఒక వేళ అక్కడ నుంచి సెలెక్షను సమాచారం వచ్చినా కూడా, చేరడానికి వారు టైమిస్తారు కనుక ఫరవాలేదనుకున్నారు వాళ్ళిద్దరూ కాని వాళ్ళు వారం తర్వాత జర్మనీ నుండి తిరిగొచ్చారు. అప్పటికీ ఏ సమాచారమూ రాలేదు.

ఇంటర్వ్యూ చేయబడిన అభ్యర్థులందరి గురించి ఇస్రో సెలెక్షన్ బోర్డు క్షుణ్ణంగా పరిశీలించింది. సమర్థత, ఫిట్‌నెస్, ఇంటెలిజెన్స్, ధైర్యము, ప్రాతిపదికలుగా అభ్యర్థులను ఎంపిక చేసారు.


రెండు జట్టులను ఎంపిక చేసారు. ఒకొక్క జట్టులో ఒక స్త్రీ, ఇద్దరు పురుషులు ఉంటారు.


మొదటిజట్టు వారినే ముందుగా చంద్రగ్రహం మీదకు లాంచ్ చేస్తారు. చంద్రుని 'అర్బిట్' లోనికి రాకెట్ వెళ్ళాకా దాని నుండి లూనార్ మాడ్యూల్ ను చంద్రుని ఉపరితలం మీదకు దింపుతారు. దానిలో ఒక స్త్రీ, పురుషుడూ ఉంటారు. మాడ్యూల్ చంద్రుని మీద దిగాకా, అందులోని స్త్రీ, పురుషుడూ చంద్రుని మీద దిగుతారు. మూడవ వ్యక్తి, ఆర్బిట్‌లో ఉన్న రాకెట్‌లో కమాండ్ మాడ్యూల్‌లో ఉంటాడు. రాకెట్ అతని పర్యవేక్షణలో ఉంటుంది. చంద్రుని నేలమీద దిగిన ఇద్దరికీ అవసరమైన సహాయాన్ని అందచేస్తూ ఉంటాడు.

మొదటి జట్టులోనే దీపక్, అనూష ఎంపికయ్యారు. మూడవ వ్యక్తిగా తమిళనాడు నుండి ఒక అతను ఎన్నికయ్యాడు.

సెలెక్షను ప్రక్రియలో దీపక్, అనూషలకు ఒక అంశం కలిసివచ్చింది. ఇదివరలో 'నాసా' చంద్రుని మీదకు పంపిన 'ఎక్స్‌పెడిషన్సు'లోనూ పురుషులే కనుక, ఈసారి ఒక స్త్రీని, పురుషుడిని దింపాలని ఇస్రో, నాసా వారనుకున్నారు కదా! ఇప్పుడు ఒక జంట భార్యభర్తలు వచ్చారు. వారిద్దరూ అన్ని అర్హతలకు సరిపోయారు. అందువలన వారిద్దర్నీ చంద్రునిమీదకు దింపితే, మొదటిసారిగా ఒక స్త్రీని దింపడమే కాకుండా, ఒక సివిలియన్ దంపతుల జంటను మొదటిసారిగా అక్కడకు చేర్చడం జరుగుతుంది. ఇది కూడా అపూర్వంగానే ఉంటుంది అనుకున్నారు. అందుకే వారిరువురినీ ఎంపిక చేసారు. ఈ విషయాన్ని నాసాకు తెలిపారు. వారు కూడా ఇది బాగానే ఉంటుందని తమ అంగీకారాన్ని తెలిపారు.

-ఇంకా వుంది






...:::: మన్నె సత్యనారాయణ & ప్రియదర్శిని చాగంటి

## వ్యోమగామి ఎంపిక

దీపక్, అనూషలు తాము సెలెక్ట్ అయ్యామనే వార్త మెయిల్ ద్వారా తెలిసాక చాలా సంతోషపడ్డారు. తాము ఆశించినదీ, కోరుకున్నదీ జరగబోతోందనిపించింది వారికి.

ఇస్రోవారు తమ మెయిల్ సందేశంలో ఇలా పేర్కొన్నారు.

"చంద్రగ్రహ యాత్రకు మీరు ఎంపికయ్యారు. ఈ నెల 14వ తేదీన మీరు ఇస్రో ఆఫీసులో ఉదయం 10 గంటలకు హాజరు కావాలి. ఇస్రో వారు నిర్ణయించిన నియమనిబంధనలతో కూడిన అగ్రిమెంటుపై మీరు సంతకం చేయాలి. అప్పటినుండి, ఇస్రో స్టేషన్ పరిశోధనా కేంద్రంలో, రెండు నెలలు మీకు శిక్షణ ఇవ్వబడుతుంది. ఈ ప్రాథమిక శిక్షణ పూర్తైన తరువాత మిమ్మల్ని అమెరికాలోని హూస్టన్ లిండన్ బి.జాన్సన్ రాకెట్ కేంద్రానికి పంపిస్తారు. అక్కడ వారు సుమారు రెండు సంవత్సరాలపాటు సంపూర్ణ శిక్షణ ఇస్తారు. ఆ శిక్షణ తరువాత మీరు ఇండియాలోని ఇస్రోకు వస్తారు. తరువాత రాకెట్ లాంచింగు తేదీ నిర్ణయించబడుతుంది" ఇవి వారి సందేశంలోని ముఖ్యాంశాలు.

ఇప్పుడు వారిద్దరూ అన్ని ఏర్పాట్లూ చేసుకోవాలి. ముందుగా తమ పెద్దవాళ్ళకీ విషయము చెప్పి వాళ్ళను ఒప్పించాలి. ఇదంత తేలిక కాదని వారికి తెలుసు.

దీపక్, అనూషలు ముందుగా ఆమె తల్లిదండ్రులుంటున్న ఊరు వెళ్ళారు. అక్కడ వారికి తమ చంద్రగ్రహ యాత్ర గురించి వివరంగా

**జరిగిన కథ 2**

ఓ టెక్నాలజీ కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్న దీపక్ భార్య అనూష కొంత కాలం లెక్చరర్‌గా ఉద్యోగం చేసి మానేస్తుంది. ఇద్దరి ఆలోచనలూ, అభిరుచులూ బాగా కలిశాయి గనక వారిది అన్యోన్య దాంపత్యం అయింది. అమెరికాలో నాసావారు భారత్‌లోని ఇస్రోతో కలిసి చంద్రుని మీదకు పరిశోధనలకోసం మానవసహిత అంతరిక్షనౌకను పంపించేందుకు సన్నాహాలు చేస్తుంటారు. ఈసారి ముగ్గురు సాధారణ పౌరులను ఎంపిక చేసి పంపాలనుకుంటున్న సంగతి తెలుసుకున్న దీపక్, అనూష అందుకు సిద్ధమై అప్లయ్ చేయాలనుకుంటారు. తాము అన్ని పరీక్షలకూ నిల్చి ఎంపికయ్యే వరకూ ఆ సంగతి ఎవరికీ చెప్పవద్దని అనుకుంటారిద్దరూ. కొంత కాలం గడిచాక ఊహించని విధంగా అంతరిక్ష యాత్రకు దీపక్-అనూష ఇద్దరూ ఎంపిక కావడం వారికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వీరిద్దరితోపాటు తమిళనాడుకు చెందిన మరో వ్యక్తి కూడా ఎంపిక అవుతాడు.

**కల్పనా జగత్తులో విహరింపజేసే సైన్స్ ఫిక్షన్**


చెప్పారు. వారికి భయం కలగకుండా ఉండేందుకు, రాకెట్ ప్రయోగము, చంద్రుని మీద దిగడము, తిరిగి రావడమూ మొదలైనవి తేలిక చేసి చెప్పారు. వారెంత తేలిక చేసి చెప్పినా కూడా, ఆ తల్లిదండ్రులిద్దరూ అది వినగానే దిగ్భ్రాంతులయ్యారు.

"చూడు బాబూ! ఏదో ఉద్యోగం చేసుకుంటూ మీరు బాగా ఉన్నారని మేం సంతోషిస్తున్నాం. ఇప్పుడిలాంటి సాహసానికి ఎందుకు దిగారు? ఇందులో ఎలాంటి ప్రమాదాలుంటాయో? అయినా ఎందుకు మీకీ ప్రయత్నం? వద్దు. ఎంతమాత్రం వద్దు" అన్నారు అనూష తండ్రి. ఆయన గవర్నమెంట్ కాలేజ్‌లో లెక్చరర్‌గా చేసి రిటైరయ్యారు. తరువాత తమ సొంత ప్రాంతం తెనాలిలో స్థిరపడ్డారు. అక్కడ వారికి ఇల్లు ఉంది.

"ఏమే, నీకిదేం ఆలోచనా? ప్రపంచంలో ఎవరూ చేయనిది మీక్కావల్సి వచ్చిందా? మేం బెంగతో ఏమవుతామో ఆలోచించారా?" అని బాధతో అన్నారు అనూష తల్లి. ఆవిడ ఎక్కువగా చదువుకోలేదు. గృహిణి.

"మావయ్యగారూ! మీరిద్దరూ ఇంతగా ఆందోళన చెందవలసిందేవీ లేదు ఇందులో. ఇప్పటికే, గతంలో 'నాసా' వారు 6సార్లు చంద్రగ్రహం మీదకు మనుషులను పంపి, పరిశోధనలు చేసి వారందరినీ క్షేమంగా భూమి మీదకు తీసుకొచ్చారు. మన ఇస్రో కూడా అంతరిక్షయానంలోనూ, పరిశోధనల్లోనూ ఇటీవల చాలా విజయాలు సాధించారు. ఇప్పుడీ రెండు సంస్థలూ కలిసి చంద్రగ్రహప్రయాణాన్ని నిర్వహిస్తున్నాయి. అప్పటికీ, ఇప్పటికీ సైన్సు, టెక్నాలజీ బాగా అభివృద్ధిచెందాయి. అందుచేత, వారు పంపిన వారిని చాలా సురక్షితంగా తీసుకురాగలరు. ఇలాంటి అవకాశం అందరికీ రాదు. మనకైనా ఎప్పుడూ రాదు. మమ్మల్ని ఆశీర్వదించి పంపండి. మేం క్షేమంగా తిరిగొస్తాం" అని దీపక్ చాలా వివరంగా చెప్పి వారిని ఒప్పించడానికి ప్రయత్నం చేసాడు. ఎలాగైతేనేం, అలా రెండురోజులు నచ్చచెప్పాకా వారొప్పుకున్నారు.

అలాగే దీపక్ తల్లిదండ్రులకు కూడా అనేక విధాలా నచ్చజెప్పి ఒప్పించారు. అతని తండ్రి చదువుకున్నా వ్యవసాయం చేస్తాడు. వారిది పల్లెటూరు. అలాంటి గ్రామాల్లో ఇలాంటి విషయాలను చాలా గొప్పగా చెప్పుకుంటూ ఉంటారు. దీపక్ తండ్రి ఎక్కువ చదువుకోకపోయినా,



విజ్ఞత కలవాడు, ధైర్యవంతుడు.

ఇస్రో సెలెక్షన్స్ లెటర్స్ పంపించాక, ఈ విషయం మీడియా ద్వారా అందరికీ తెలిసింది. చంద్రగ్రహానికి పంపుతున్న వారి ఫోటోలు, పేర్లు కూడా పత్రికల్లో ప్రచురించారు. ఇది భారతదేశం చేస్తున్న అత్యంత సాహసమైన వైజ్ఞానిక ప్రయోగం అని మీడియాలో ప్రచారమవుతున్నది.

ఆ ఊళ్ళోనివాళ్ళు పత్రికల్లోనూ, టీవీల్లో, ఈ వార్తలను చూసి, దీపక్-అనూషలను చూద్దానికొచ్చారు. వారడిగే అన్ని ప్రశ్నలకూ దీపక్-అనూషలు ఓపిగ్గా సమాధానం చెప్పేవారు.

ఆ ఊళ్ళోనే దీపక్ మేనమామ ఉన్నారు. అతను కూడా వ్యవసాయదారుడే! కాస్త అమాయకుడాయన. అతనొచ్చాడు.

"ఏరా దీపక్కు! చందురిడి దగ్గరకెల్తన్నావంటన్నారేంటి అందరూ?" అనడిగాడు.

"అవును మావయ్యా, చంద్రగ్రహం మీదకు మమ్మల్ని పంపిస్తున్నారు" అన్నాడు.

"గెహమేంట్రా! ఆకాశంలో ఉన్నోడు చందమామ కదా! ఆయన దేవతల్లో ఒకడు, అవునా?" అన్నాడతను అమాయకంగా.

"కథల్లో అలాగే చెబుతారు కాని, చంద్రగ్రహం కూడా, మన భూమిలాగే పెద్దగోళం. ఇక్కడలాగే అక్కడా మట్టి, నేల, పర్వతాలు ఉంటాయి."

"ఆ కాతంత చందమామలో అన్నుంటాయా! ఎవరు చెప్పార్రా?"

"శాస్త్రజ్ఞులు పరిశోధనలు చేసి తెలుసుకున్నారు"

"ఏంటో, మీ సదువుకున్నోళ్ళకందరికీ వేపకాయంత 'ఎర్రి' వుంటదిరా! చందమామ పట్టుకుని భూమిలాంటిదంటున్నారు. నీవు చెప్పేది నిజమైతే, ఎలాగా వెలతన్నావు కనక, అక్కడ మంచి నేల చూసి వందెకరాలు కొనేసిరా. తర్వాతెల్లి మీ నాన్నా నేను యవసాయము చేసుకుంటాం" అన్నాడతను.

దీపక్-అనూష, తల్లిదండ్రులు నవ్వారతని అమాయకత్వానికి.

"అక్కడ అమ్మేవాళ్ళెవ్వరూ ఉండరు మావయ్య. మనకు కావలసింది పోగుచేసుకోవడమే."

"అయితే మరీ మంచిది. కొనక్కర్లేదు కాబట్టి రెండొందలఎకరాలు మంచి భూమి చూసి సరిహద్దుల్లో రాళ్ళేయించిరా. మీ నాన్నా, నేనూ చెరో వందా చేసుకుంటాం. నీటి వనరున్న భూమి చూడు" అన్నాడు.

"అనలక్కడ నీరుందో లేదో ఇప్పటికీ తెలియదు. అవన్నీ చూసి తెలుసుకోవడానికే మాలాంటి వాళ్ళనక్కడకు పంపుతున్నారు."

"భూముంటే నీరు లేకుండా ఎలా ఉంటుందిరా? ఇక్కడ లేదేంటి నీరు? - నన్ను కూడా రమ్మంటావా? టిక్కెట్టు ఎంతుంటది?" అన్నాడు అమాయకంగా.

అతనికేం చెప్పినా అర్థం కాదని దీపక్‌కు తెలుసు. అందుకే అన్నాడు-

"మేము మళ్ళీ వెళ్ళినప్పుడు తీసుకెళతాంలే నిన్ను. టిక్కెట్టేమీ ఉండదు. ఊరకనే తీసుకెళతారు"

"ఇదేదో బాగానే వుందిరా! అక్కడ భూమిని డబ్బెట్టి కొనక్కర్లేదు. అక్కడకెళ్ళడానికి టిక్కెట్టు డబ్బక్కర్లేదు. భూమికన్నా చందమామే నయంలాగుంది" అన్నాడు.

వాళ్ళంతా నవ్వారు.

దీపక్ వాళ్ళూ మళ్ళీ వెళ్ళినప్పుడు చందమామ మీదకు తనను కూడా తీసుకెళతానన్నారని ఆయన ఊళ్ళో చాలామందికి చెప్పాడు. అక్కడ పొలాల విషయం చెప్పలేదు. ఎందుకంటే, ఇపుడేచెబితే తనకెవరైనా పోటీ వస్తారేమోనని అతని భయం.

★ ★ ★

దీపక్ తను ఉద్యోగం చేస్తున్న కంపెనీకి వెళ్ళారు. అప్పటికే అక్కడందరికీ అతనూ, భార్యా చంద్రగ్రహానికి వెళ్ళడానికి సెలక్ట్ అయ్యారని తెలిసింది. సహచర ఇంజనీర్లు, టెక్నీషియన్లు అందరూ అతని చుట్టూ చేరారు. అతన్ని అభినందించారు.


అతను కంపెనీ యం.డి ని, డైరక్టర్లునూ కలిసాడు. వారతన్ని సాదరంగా ఆహ్వానించారు. తమ సంస్థకు చెందిన దీపక్ చంద్రయానం చేయడానికి ఎంపికైనందుకు కంపెనీకి గర్వకారణమని అభినందించారు.

"సార్! మీ అభినందనలకు ధన్యవాదాలు. నేను ఉద్యోగానికి రాజీనామా చేస్తాను."

"ఎందుకు రాజీనామా చేయడం? సెలవు పెట్టు" అన్నారు.

"ఈ ప్రాజెక్ట్ పూర్తి అయ్యేసరికి రెండు సంవత్సరాలపైన పడుతుంది. అంతకన్నా ఎక్కువే పట్టవచ్చునేమో! అంతకాలం లీవు ఎలా పెట్టను?" అన్నాడు.

## ఇది విన్నారా?



★ ఇళ్ళల్లో ఉపయోగించే బల్బులోని ఫిలమెంట్ (తంతువు)ను 'టంగ్స్టన్'తో తయారుచేస్తారు.

★ ఎరువుల ద్వారా మొక్కలకందే మూడు మూలకాలు 'నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం'.



★ సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించినది 'నికోలస్ కోపర్నికస్'.

"ఆ విషయం మాకొదిలేయ్. నీకెంతకాలం పట్టినా, నీకు లీవు మంజూరు చేయడానికి మా డైరక్టర్సు మీటింగులో నిర్ణయం తీసుకుంటాం. నీవు మన కంపెనీకి గర్వకారణం" అన్నారు.

దీపక్ కొద్దిగా ఆలోచించాడు. వారంతగా అభిమానంతో చెబుతున్నప్పుడు, కాదనడం భావ్యంగా ఉండదనుకున్నాడు.

"నా మీద మీ అభిమానానికి కృతజ్ఞుడిని సార్. మీ సూచన ప్రకారమే చేస్తాను" అన్నాడు.

ఆ కంపెనీ యాజమాన్యం, అక్కడి స్టాఫ్, వర్కర్స్ అంతా కలిసి అతనికి వీడ్కోలుసభ ఏర్పాటుచేసారు. కంపెనీ డైరక్టర్సుబోర్డు దీపక్‌కు రెండు సంవత్సరాల జీతంతో కూడిన సెలవు శాంక్షన్ చేసిందని ఎమ్.డి ప్రకటించారు.

ఆ సభలో దీపక్, అనూష ధైర్యాన్ని, ఉత్సాహాన్ని వారంతా ప్రశంసించారు. వారిద్దర్నీ ఘనంగా సన్మానించారు. దీపక్, అనూషలు కంపెనీ డైరెక్టర్సుకూ, సహ ఉద్యోగులకూ కృతజ్ఞతలు తెలిపారు.

★ ★ ★

## అంతరిక్ష శిక్షణ

దీపక్, అనూషలు ఇస్రో ఆఫీసుకు వారు సూచించిన తేదీ నాటికి వెళ్ళారు. తమిళనాడు నుండి సెలెక్టయిన స్వామినాథన్ అనే అతను కూడా వచ్చాడు. రెండవ బ్యాచ్ కోసం ఎంపికైన ముగ్గురూ కూడా వచ్చారు. వారికి కూడా ప్రాథమిక శిక్షణ వీరితోపాటే ఇస్తారు. ఇక్కడ రెండు నెలలు ట్రైనింగయ్యాక మొదటి బ్యాచ్ వారిని 'నాసా'కు పూర్తిశిక్షణ కోసం పంపిస్తారు. రెండవ బ్యాచ్ వారిని, తర్వాత కొంతకాలానికి నాసాకు పంపిస్తారు.

రెండవ బ్యాచ్‌లో కేరళ యువతిని ఎంపిక చేసారు. మిగిలిన ఇద్దరూ పురుషులనూ గుజరాత్ నుండీ, పశ్చిమబెంగాల్ నుండీ ఎంపికచేసారు.

వారందరికీ అతిథి గృహంలో మకాం ఏర్పాటుచేసారు.

మొదటగా 15 రోజులు ఎకడమిక్ శిక్షణ ఇచ్చారు. ఖగోళశాస్త్రం కొంత చెప్పారు. అతి ప్రాచీనకాలం నుంచీ మనిషి ఆకాశం వంక ఆశ్చర్యంగా చూస్తూనే వున్నాడు. ఆకాశంలో అతి ఎత్తైన ప్రాంతంలో కనిపిస్తూన్న ఆ చుక్కలు వారిని ఆశ్చర్యపరిచేవి. ఆనందపరిచేవి. మెరుస్తున్న ఆ అసంఖ్యాకమైన చుక్కలేంటో వారికి తెలియదు. అవెందుకు మెరుస్తాయో, ఎప్పుడూ ఒకేచోట ఎందుకు కనిపిస్తాయో తెలియదు. గుర్తుపెట్టుకున్న ఒక చుక్క ఎంతదూరమెళ్ళి చూసినా, అక్కడే ఎందుకు కనిపిస్తుందోనని ఆశ్చర్యపడేవారు.

మనిషి బుద్ధి పరిణతి చెందింది. వారిలో కొందరు ఆలోచనాపరులకేదో అర్థమవుతున్నది. అవి కేవలం మెరిసే చుక్కలు మాత్రమే కావు. అంతకుమించి వాటికేవో రూపాలున్నాయి. అవి కాంతితో మెరవడానికేదో కారణముంది అనిపించిందివారికి. ఆ తరువాత కొంతకాలానికి, కొందరు పరిశీలకులకు అవి కనిపిస్తున్నంత చిన్న చిన్న చుక్కలు కావు. అవి వాస్తవానికి చాలా పెద్దవి. వాటికి వేరు వేరు పరిమాణాలు వున్నవి. గుండ్రటి రూపాలున్నాయి అనిపించింది.

కాలక్రమంలో, కొందరు మేధావులైన గోళ పరిశీలకులు వాటిలో కొన్నింటిని గ్రహాలుగా, కొన్నింటిని స్టార్స్‌గా గుర్తించారు. వాటిలో కొన్ని తమచుట్టూ తాము పరిభ్రమిస్తూ వుంటాయి. అలా తమచుట్టూ తాము తిరుగుతూనే, స్టార్ చుట్టూ తిరుగుతుంటాయి! వాటి వాటి స్థానాలను కూడా ఇంచుమించుగా గుర్తించారు.

క్రీస్తుపూర్వం సోక్రటీస్, అరిస్టాటిల్ వంటి మేధావులు, విశ్వపరిశీలకులూ కొంతమేరకు ఊహాత్మకమైన పరిశీలన చేసారు. అయితే, వారి కాలంనాటికి ఖగోళ అధ్యయనం తాత్విక అంశాలలో ఒక భాగంగానే వుంది.

క్రీస్తుశకం 4వ శతాబ్దం చివర, 5వ శతాబ్దం ప్రారంభంలోనివారూ అయిన, భారతీయ శాస్త్రజ్ఞులైన ఆర్యభట్టు, వరాహమిహిరుడూ ఖగోళశాస్త్రాన్ని శాస్త్రీయంగా పరిశీలించి అధ్యయనం చేసారు. వారు గణితశాస్త్రాన్ని వృద్ధిచేసి, గణితం సహాయంతో గ్రహాల ఉనికిని, గమనాన్ని, విశ్వశాస్త్ర విషయాలనూ సిద్ధాంతీకరించారు. ఖగోళ విజ్ఞానానికి సంబంధించిన వారి సిద్ధాంతాలనూ, సూత్రాలనూ ఇప్పటి శాస్త్రవేత్తలు పరిగణలోకి తీసుకుంటున్నారు. అవన్నీ పాతమాటలు, ఇప్పుడు వాటికి ప్రాధాన్యత లేదని అనే వారి మాటలను లెక్కచేయకూడదు. వారి తరువాత కూడా, భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోని శాస్త్రజ్ఞులూ చేసిన కృషి, పరిశోధనలూ ఖగోళశాస్త్రానికి మరింత విజ్ఞానాన్ని అందించాయి.

మధ్యయుగాలనాటికి ఖగోళశాస్త్రం

### ఇది విన్నారా?



★ అప్పుడే జన్మించిన శిశువుల్లో నిమిషానికి 32సార్లు శ్వాసక్రియ జరుగుతుంది.

★ 'క్లోరోఫామ్'ను మత్తుమందులా వాడతారు.



★ పాలపుంతలో అతి పెద్ద నక్షత్రం 'బెటిల్ గ్లేక్స్'.

మరింత శాస్త్రీయతను పెంచుకుంది. ఐజాక్ న్యూటన్ యొక్క గురుత్వాకర్షణ సిద్ధాంతం (థియరీ గ్రావిటేషన్ అండ్ మోషన్) ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ యొక్క సాపేక్షసిద్ధాంతం (థియరీ ఆఫ్ రెలెటివిటీ) భౌతికశాస్త్ర అధ్యయనం, పరిశోధనల్లోనూ, గ్రహాల స్థానాలు, చలనం యొక్క అవగాహనకూ అద్భుతంగా దోహదం చేసాయి. తరువాత ఖగోళ, గ్రహాల అధ్యయనం ఒక సంపూర్ణశాస్త్రంగా అభివృద్ధి చెందింది" ఇవీ వారు చెప్పిన ముఖ్యాంశాలు. అందులో సూర్య కుటుంబం గురించి చెప్పారు. సూర్య కుటుంబంలో భూమి, చంద్రుడు గ్రహాల స్థానాల గురించి చెప్పారు. భూగర్భశాస్త్రం కొంత చెప్పారు. చంద్రగ్రహం మీదింతవరకూ నాసా మొదలైన సంస్థలు జరిపిన పరిశోధనల ద్వారా తెలుసుకున్న నేల, మట్టి, పర్వతాలు గురించి తెలిసినదంతా చెప్పారు. అక్కడ గాలి, నీరు ఉనికి గురించి పూర్తిగా అస్పష్టంగానే ఉందని చెప్పారు.

ఆ విధంగా, 15 రోజుల్లో ఎకడమిక్ శిక్షణ పూర్తిచేసారు. అభ్యర్థులు కూడా ఎంతో కొంత శాస్త్రజ్ఞానం ఉన్నవారు కనుక బాగా అర్థంచేసుకున్నారు. మొత్తమంతా నోట్సు తీసుకున్నారు.

ఆ తరువాత ప్రాక్టికల్ శిక్షణ మొదలైంది.

ముందుగా వారికి రాకెట్టును పరిచయం చేసారు. రాకెట్ నిర్మాణం గురించి చూపించారు. దానిలోని వివిధ భాగాలను చూపించి, అవి ఎలా పనిచేస్తాయో, వాటి ప్రయోజనమేమిటో చూపించారు. రాకెట్ వేగం, వేగ నియంత్రణల గురించి చెప్పారు. వీటన్నింటినీ కూడా ఫీల్డులో వారికి ఆపరేట్ చేసి చూపించారు. కొన్ని విభాగాలను వారిచేత ఆపరేట్ చేయించారు.

'భార రహిత స్థితి' గురించి చెప్పారు. భార రహిత స్థితిలో రాకెట్‌లో ఉన్న ఆస్ట్రోనాట్స్‌కు ఎలాంటి అనుభవం కలుగుతుందో చూపించారు. అక్కడున్న కొందరు టెక్నీషియన్నులతో ఇవన్నీ చేయించి తరువాత వారి చేత చేయించారు. అయితే భారరహిత స్థితిని ప్రాక్టికల్‌గా నాసా శిక్షణలో అనుభవంలోకి తీసుకువస్తారు కనుక, ఇక్కడ వారి చేత ప్రయోగం చేయించలేదు.

రాకెట్‌లో తీసుకెళ్ళే మాడ్యూల్స్ గురించి కూడా ఫీల్డులో చూపించారు.

కొన్ని శారీరకమైన ఎక్సర్‌సైజులు చేయించారందరిచేతా. శారీరకమైన దృఢత్వం కూడా చాలా ముఖ్యంవారికి. శారీరక శ్రమకు ఓర్చుకునేలా ఉండాలి.

వారు తినవలసిన ఆహారంలో కూడా కొన్ని మార్పులు చేసారు.

ఈవిధంగా వారికి శిక్షణనిస్తూ, మధ్యలో కొన్ని రోజులు విశ్రాంతినిస్తూ, రెండు నెలల్లో పూర్తిచేసారు.

దీపక్, అనూష మరియు స్వామినాధన్‌లను 15 రోజుల్లో హ్యూస్టన్‌లోని జాన్సన్ రాకెట్ కేంద్రానికి పంపించడానికి నిర్ణయమైంది. అక్కడ వారికి 'నాసా' ప్రాక్టికల్‌గా ఫైనల్ శిక్షణ ఇస్తుంది.

రెండవ బ్యాచ్‌లోని ముగ్గురూ ప్రస్తుతానికి వారి వారి ఊళ్ళకు వెళ్ళవచ్చును. వారినెపుడు ఫైనల్ ట్రైనింగు కోసం నాసాకు పంపేదీ తరువాత తెలియచేస్తారు. వారేవైనా ప్రస్తుతానికి ఉద్యోగాలు చేస్తున్నా, ఇతర వృత్తులలో ఉన్నా వాటినపుడే మానక్కర్లేదని చెప్పారు. వారిని నాసాకు ట్రైనింగుకు పంపే ముందు తెలియచేస్తారు. అపుడే వారు తగిన నిర్ణయాలు తీసుకుని అన్నీ సర్దుబాటు చేసుకుని రావచ్చును. ఈ వెసులుబాటు వారికి కూడా బాగానే ఉందనిపించింది.

రెండవ బ్యాచ్‌లోని కేరళ యువతి సరోజినీ మీనన్, అనూషతో అన్నది.

"అనూషా! మీ దంపతులిరువురూ కలిసి చంద్రగ్రహానికి వెళుతున్నారు కదా! అక్కడే బావుందని చంద్రుని మీదే ఉండిపోకండి. తొందరగా వచ్చేయండి. తర్వాత మేం కూడా వెళ్ళాలి కదా!" అంది సరదాగా.

అందరూ నవ్వుకున్నారు.

★ ★ ★

దీపక్, అనూష ఇంటికి తిరిగొచ్చాకా తమ వ్యక్తిగత పనులు పూర్తిచేసుకున్నారు. మళ్ళీ ఒక సారి వారి తల్లిదండ్రులను చూడడానికని వెళ్ళారు.

ఈ సారి పెద్దవాళ్ళు కాస్త ధైర్యంగానే కనిపించారు.

అనూష నాయనమ్మ ఉంది. ఆవిడది పెద్దవయసు.

"ఏమే, నీవు మీ ఆయనా చంద్రుడి దగ్గరకెళుతున్నారంటగా" అనడిగింది. అనూష,

"అవును మామ్మా! కొన్నాళ్ళ తర్వాత పంపిస్తారు మమ్మల్ని" అంది అనూష.

"చంద్రుడ్ని నేనడిగానని చెప్పు. ఆయన్నీ

## ఇది విన్నారా?



★ భూకేంద్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది 'టాలమీ'.

★ 'సూపర్‌నోవా' అంటే డైయింగ్ స్టార్ (అంతరించిపోయే నక్షత్రం)

★ నక్షత్రాలు స్వయంప్రకాశ శక్తి కలిగినవి.



★ మానవుడి శరీరంలోకి సగటున నిమిషానికి 1.5 లీటర్ల గాలి ప్రవేశిస్తుంది.

ఆయన భార్యనూ మనింటికోసారి రమ్మను. నాలుగు రోజులు వారికి పూజలు చేసి పంపిం చుదాం" అందావిడ.

"చంద్రుడిక్కడికెలా వస్తాడు?"

"మీరక్కడకెళ్ళగా లేనిది, ఆయనిక్కడకు రాలేడా? ఆయన దేవతల్లో ఒకడు కదా! రమ్మను" అందావిడ.

ఆవిడకేం చెప్పినా అర్థంకాదనుకుంది అనూష.

"అలాగే చెబుతాలే" అంది.

"మీరు భోజనాలెక్కడ చేస్తారు? చంద్రుడు గారింట్లోనేనా?"

అందరూ నవ్వారు.

"పోనీ వాళ్ళతోపాటు మీరు కూడా వెళ్ళం డత్తయ్యా" అంది అనూష తల్లి సరదాగా.

"ఈ వయసులో అంత దూరమెళ్ళగలనా? వాళ్ళను వెళ్ళిరానివ్వండి" అందావిడ.

"అలాంటి అమాయకత్వంతో ఆ తరాల వారు పెరిగారు" అనుకున్నారు దీపక్, అనూష.

★ ★ ★

ఇస్రోవారు చేసిన ఏర్పాట్లతో దీపక్, అనూష హైదరాబాద్‌లో అమెరికా వెళ్ళడానికి ఫ్లైట్ ఎక్కారు. వారిద్దరూ ప్రక్క ప్రక్క సీట్లలో కూర్చున్నారు. వారికి ముందున్న వరుసలోని సీట్లలో, కాస్త పెద్ద వయసువారు, ఒక పురుషుడు, స్త్రీ కూర్చున్నారు. వారి బట్టలూ, తీరునూ బట్టి గ్రామప్రాంతంవారై ఉంటారని అనుకున్నారు.

దీపక్ వారి దగ్గరకెళ్ళి పరిచయం చేసుకున్నారు.

"మీరెక్కడికెళుతున్నారు? న్యూయార్క్‌కా" అనడిగాడు.

"అవునుబాబూ, మీరెక్కడికి?"అన్నారాయన.

"మేము కూడా అక్కడికెళ్ళి అక్కడినుంచి హ్యూస్టన్ వెడతాము"

"పోనీలే! తెలుగువాళ్ళూ చదువుకున్నోళ్ళూ మీరిద్దరూ. మాకు జత దొరికారు. మా భయంపోతుంది. మా అబ్బాయి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. కోడలికి ప్రసవ సమయం. తోడుకోసం మమ్మల్ని రమ్మన్నారు" అని చెప్పారాయన.

"అలాగే మీకు మేము తోడుంటాం" అన్నారు వారితో.

"ఈ మధ్యన తెలుగువాళ్ళు చాలామంది అమెరికాలోనూ, ఆస్ట్రేలియాలోను, ఇతర చోట్లా ఉద్యోగాలు చేస్తున్నారు. అందుచేత పల్లెటూళ్లలో ఉన్నవారి తల్లిదండ్రులు కూడా ఆయా దేశాలకు వెళ్ళగలుగుతున్నారు" అనుకున్నారు దీపక్, అనూష.

ఫ్లైట్ టేక్ ఆఫ్ అయ్యింది. అందరూ సీటు బెల్టులు పెట్టుకున్నారు. ఆ సీటు బెల్టు ఎలా పెట్టుకోవాలో ఆ పెద్దవాళ్ళకు ప్రదీప్ చెప్పాడు.

ఒక అరగంట తర్వాత ఎయిర్‌హోస్టెస్ ట్రేతో వచ్చింది. కొన్ని బిస్కట్లు, పళ్ళరసం గ్లాసులూ వారికందించింది. ఆ పెద్దవాళ్ళిద్దరూ అటూ ఇటూ చూస్తున్నారు తీసుకోవాలా వద్దా అని.

"తీసుకోండి" అంది అనూష. వారిద్దరూ తీసుకున్నారు.

కొంతసేపయ్యాకా మళ్ళీ ఎయిర్‌హోస్టస్ అలా వెళుతుంటే, ఆ పెద్దాయన జేబులోంచి రెండువందలు తీసి ఆమెకివ్వబోయాడు. ఆమె అర్థంకాక, ఏవిటనే విధంగా చూసింది. ఆయన అభిప్రాయాన్ని దీపక్ గ్రహించాడు.

"వాటికి మనమేమీ ఇవ్వక్కర్లేదు బాబాయ్ గారు! అవన్నీ మన ప్రయాణంలో భాగమే. భోజనం కూడా వారే ఇస్తారు" అని చెప్పాడు.

ఆమెకర్థమైందో లేదో కొద్దిగా నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

కొద్దిక్షణాలయ్యాకా, ప్రక్కనున్న భార్యతో నెమ్మదిగా అన్నాడాయన.

"మన పెళ్ళైన కొత్తలో మీ అమ్మగారు వాళ్ళూ నాకు (అల్లుడికి) మనుగుడుపు పెట్టేవారు చూడు. అలాగే, ఈ విమానం ప్రయాణం బాగానే ఉంది. డబ్బులడక్కుండా అన్నీ తెచ్చి పెడుతున్నారు" నవ్వుతూ అన్నాడు.

"గట్టిగా అనకండి. ఆ అబ్బాయి వాళ్ళూ వింటారు" అందావిడ.

కొంత ప్రయాణం అయ్యాక విమాన పరిచారిక, వారికి తినడానికి, ట్రేలో తెచ్చిపెట్టింది. వారు తిన్నాక, ఆ పెద్దావిడ, తన ప్లేటుతోబాటు భర్తప్లేటు కూడా తీసుకుంది చేతిలోకి.

"అనుషా! ఇది ఎక్కడ కడిగిపెట్టాలి?" అడిగిందావిడ.

"మీరు కడగక్కరలేదు. మీకు ఎవరు ప్లేటు ఇచ్చారో, వాళ్ళే వచ్చి తీసుకెడతారు. మీరు కూర్చోండి" అంది అనూష నవ్వు ఆపుకుంటూ.

'పాపం! మొదటిసారి విమానంలో ప్రయాణం చేస్తున్నారులా ఉంది! ఇలాంటి వారు వంటరిగా వెళ్ళాలంటే కష్టమే' అనుకుంది అనూష మనసులో.

లండన్‌లో విమానం మారారు.


"బాబూ! మా సామానెక్కడుంది? ఈ విమానంలోకి తెచ్చుకోవాలి కదా!" అన్నారా పెద్దాయన.


"మనమేం చేయక్కర్లేదు. అదంతా వాళ్ళే చేస్తారు"

"మరి, సామానులు మారిపోతాయేమో?" అన్నారు అమాయకంగా.

"అలాంటిదేమీ జరగదు. ఎవరి సామాన్లు వారికే అప్పచెబుతారు, రండి" "మీ సాయం లేకపోతే ఇవన్నీ మాకు తెలియవు బాబూ. ఏదో వాళ్ళు రమ్మన్నారని వెళుతున్నాం గానీ, అక్కడకెళ్ళినా మాకేదీ అర్థంకాదేమో" అన్నారాయన.

**-ఇంకా వుంది**






...::: మన్నె సత్యనారాయణ & ప్రియదర్శిని చాగంటి

ఆ విమానం అమెరికాలోని న్యూయార్క్ విమానాశ్రయంలో లాండ్ అయ్యింది.

ఇమిగ్రేషన్ చెకింగ్ మొదలైనవన్నీ పూర్తయ్యాకా వారంతా బైటకొచ్చారు.

అప్పటికే వారబ్బాయి, కోడలూ ఎయిర్‌పోర్టుకు వచ్చారు. తల్లిదండ్రులను చూసి దగ్గరకొచ్చారు.

"ఒరే అబ్బాయ్! వీళ్ళద్దరే మాకు విమానంలో సాయం చేసారు. లేకపోతే మాకేమీ అర్థంకాకపోవును" అని ఆయన తన కొడుకుకు వారిని పరిచయం చేసాడు.

"మీరు కూడా ఇక్కడ జాబ్ చేస్తున్నారా?" అనడిగాడా పెద్దాయన కొడుకు.

"లేదండి. ఇక్కడ నాసాలో ట్రైనింగ్‌కొచ్చాం" అన్నాడు దీపక్.

"నాసాలో ట్రైనింగా! అంటే..?"

"మన ఇస్రో మేన్డ్ ఎక్స్‌పెడిషన్ టు మూన్ తలపెట్టింది."

"అంటే మీ పేరు దీపక్, ఈవిడ అనూష గారు. అవునా?" అన్నాడతను ఆశ్చర్యంగా.

"అవును" అన్నాడు దీపక్.

"ఇక్కడ నెట్‌లో వచ్చే తెలుగు పేపర్లలోనూ, ఇంగ్లీషు పేపర్లలోనూ మీ పేర్లతో సహా ఇదంతా చదివాం. మీరు మా అమ్మనాన్నకూ ప్రయాణంలో తోడుగా రావడం మాకు చాలా సంతోషం. మీరిక్కడుండగా, ఒకసారి మా ఇంటికి రండి. మన తెలుగువాళ్ళం దర్నీ రమ్మని మీకు అభినందనలు తెలుపుతాం" అన్నాడతను.

"మాకు ట్రైనింగులో ఎప్పుడు ఖాళీ ఉంటుందో తెలియదు. చూద్దాంలెండి" అన్నాడు దీపక్.

**జరిగిన కథ**

**3**

ఓ టెక్నాలజీ కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్న దీపక్ భార్య అనూష కొంత కాలం లెక్చరర్‌గా ఉద్యోగం చేసి మానేస్తుంది. ఇద్దరి ఆలోచనలూ, అభిరుచులూ బాగా కలిశాయి గనక వారిది అన్యోన్య దాంపత్యం అయింది. అమెరికాలో నాసావారు భారత్‌లోని ఇస్రోతో కలిసి చంద్రుని మీదకు పరిశోధనలకోసం మానవసహిత అంతరిక్షనౌకను పంపించేందుకు సన్నాహాలు చేస్తుంటారు. ఈసారి ముగ్గురు సాధారణ పౌరులను ఎంపిక చేసి పంపాలనుకుంటున్న సంగతి తెలుసుకున్న దీపక్, అనూష అందుకు సిద్ధమై అప్లయ్ చేయాలనుకుంటారు. తాము అన్ని పరీక్షలకూ నిల్చి ఎంపికయ్యే వరకూ ఆ సంగతి ఎవరికీ చెప్పవద్దని అనుకుంటారిద్దరూ. కొంత కాలం గడిచాక ఊహించని విధంగా అంతరిక్ష యాత్రకు దీపక్-అనూష ఇద్దరూ ఎంపిక కావడం వారికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వీరిద్దరితోపాటు తమిళనాడుకు చెందిన మరో వ్యక్తి కూడా ఎంపిక అవుతాడు. చంద్రునిపైకి వెళ్లేందుకు ఎంపికైన దీపక్-అనూష అమెరికా పయనమవుతారు.

**కల్పనా జగత్తులో విహరింపజేసే సైన్స్ ఫిక్షన్**

వారి దగ్గర సెలవు తీసుకుని దీపక్, అనూష హ్యూస్టన్ వెళ్ళడానికి అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం ఎక్కారు. హ్యూస్టన్ చేరేసరికి అలసట గానే అనిపించింది. ఆ కేంద్రము, ఫ్లొరిడాలో ఉన్న జాన్.ఎఫ్.కెన్నెడీ అంతరిక్ష పరిశోధనా కేంద్రమూ 'నాసా' పరిశోధనా సంస్థ యొక్క శాఖలే!

నాసాలోని అధికారులు, వారుండడానికన్ని సదుపాయాలు కల్పించారు.

తమిళనాడు నుంచి ఎంపికైన స్వామినాథన్ కూడా అప్పటికే వచ్చాడు. ఒక రాకెట్ కన్‌స్ట్ర క్షన్ ఇంజనీరుకు వారి బాధ్యతలనప్పజెప్పారు. అతను ఆ కేంద్రమంతా వారిని తిప్పి అన్నీ చూపించాడు.


ఆ కేంద్రంలోనికి బైటవారినెవ్వరీ రానివ్వరనీ, అంతా రహస్యంగా ఉంటుందని చాలా మంది అనుకుంటారు. దీపక్ వాళ్ళూ కూడా అలాగే మొదట్లో అనుకున్నారు కాని, ఎవ్వరైనా పది డాలర్ల టికెట్టు కొని, ఆ కేంద్రంలోనికి వెళ్ళ వచ్చును. పాతవి, కొత్తవీ చాలా రాకెట్లు ఉన్నా యక్కడ. వాటికి సంబంధించినే అనేక భాగాలు కూడా ఉన్నాయి.

ఒక నాసా ఉద్యోగి గైడుగా ఉండి అలా చూడ్డానికి వచ్చేవారికి వివరించి చెబుతున్నాడు. వాటినెలాంటి మెటీరియల్‌తో తయారుచేస్తారో, ఎలా పనిచేస్తాయో కూడా చెబుతున్నాడు. అందువలనక్కడ చూడ్డానికొచ్చిన వాళ్ళకు కొన్ని విషయాలర్థమవుతున్నాయి. ఇంగ్లీషు రాని వాళ్ళు తమ భాష తెలిసిన వాళ్ళనడిగి తెలుసు కుంటున్నారు.

ఆ సెంటర్ ప్రాంగణం చాలా పెద్దది, విశాల మైనది కావడం వలన, అంతా కూడా నడిచివెళ్ళి చూడడం కష్టం. అందువల్లనక్కడ చిన్న నేరో గేజ్ రైలును నడుపుతున్నారు. అది బొమ్మరైలు లాగా ఉంటుంది. దాని మీద ఎక్కి తిరగడం కూడా సరదాగానే ఉంటుంది. అందుచేత అక్క డికొచ్చిన విజిటర్సు దాని మీద తప్పనిసరిగా ఎక్కి ఒకసారి ప్రయాణిస్తారు. దానికి కొద్దిగా టికెట్ ఉంది.

దీపక్, అనూష, స్వామినాథన్‌ను గైడుగా ఉన్న ఇంజనీరు వాళ్ళను కూడా ఆ రైలు ఎక్కించి తిప్పాడు. ఆ ప్రయాణం వారికి చాలా సరదాగా అనిపించింది.

ఆ ఇంజనీరు వారికి ముందుగా వివిధ కాలాలలో తయారుచేసిన రాకెట్లను చూపిం చాడు. వివిధ ప్రయోగాల కోసం తయారైన రాకెట్లను చూపించాడు. వాటిలోని విడి భాగాల గురించి చెప్పాడు. అవి ఏ విధంగా పనిచే స్తాయో కూడా వివరించాడు.



అలా అతను రెండురోజులు అంతావారికి చూపించాడు. ఆ తరు వాత ఇస్రోలో వలెనే, వారికి ఎకడ మిక్ శిక్షణ ఇచ్చారు.

మొదటిరోజు శిక్షణ తరగతిలో చెప్పారు.

"ఇంతవరకూ మేం అంతరిక్షం లోకి, చంద్రగ్రహం మీదకు పంపిన వారంతా కూడా సాంకేతిక విజ్ఞా నమూ, అనుభవమూ ఉన్నవారే. చంద్రుని నేల మీద మొదటగా దిగిన నీల్ ఆమ్‌స్ట్రాంగ్ ఒక్కడు మాత్రం సివి లియన్ పైలట్! ఇపుడు మేము ఇస్రో వారితో కలిసి చేస్తున్న ఈ ప్రయ త్నంలో సివిలియన్స్‌ను పంపించాలని అనుకున్నాం. అందులో ఒక స్త్రీ కూడా ఉండాలనుకున్నాం. మొదటి సారిగా ఒక స్త్రీని చంద్రుని ఉపరితలం మీద దింపబోతున్నాం."

"నాసా గతంలో 6 బేచెస్ మనుషు లను చంద్రుని మీదకు దింపి, వారిని క్షేమంగా భూమికి తీసుకొచ్చింది. అంతటి అనుభవంతోపాటు, ఇటీవల సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా పెంచు కున్నారు. మీ దేశంలో ఇస్రో కూడా అద్భుతమైన విజయాలను ఇటీవలకా

లంలో సాధించింది. అందువలన వారూ, మేమూ మిమ్మల్ని చంద్రుని మీదకు పంపి క్షేమంగా భూమిమీదకు చేర్చగలం. మీరేమీ సందేహాలు పెట్టుకోనవసరం లేదు. ధైర్యంగా ప్రయాణించండి.

ఇస్రోలోనూ, నాసాలోనూ మీకిచ్చిన శిక్షణను మీరు చాలా సునిశితంగా అవగాహన చేసుకోవాలి. ఒకసారి మిమ్మల్ని రాకెట్‌లో లాంచ్ చేసాకా, లోపల ఆపరేషనంతా మీరే చేయాలి. అందువలన, రాకెట్లు, మాడ్యూల్సు మొదలైన అన్నింటి యాంత్రిక విషయాలు మీకు కరతలామలకంగా తెలిసి ఉండాలి. అన్నింటికంటే ముఖ్యం టైమ్! ప్రతి సెకను కచ్చితంగా అన్నీ ఆపరేట్ చెయ్యాలి. అందువలన శిక్షణలో మీరు అప్రమత్తంగా ఉండాలి. మిగిలిన విషయాలన్నీ ప్రస్తుతానికి మరచిపోండి. పూర్తిగా శిక్షణ మీదనే కేంద్రీకరించండి. సంశయాలను మిగుల్చుకోవద్దు. అన్నీ అడిగి తెలుసుకోండి" అని చాలా వివరంగా చెప్పారు వారికి.

ఎకడెమిక్ శిక్షణ తర్వాత, రాకెట్ల నిర్మాణ షెడ్ల వద్దకు తీసుకెళ్ళి అక్కడ కొన్ని రోజులు శిక్షణ నిచ్చారు.

రాకెట్లో అంతరిక్షంలో ప్రయాణిస్తున్నపుడు ఎలాంటి అనుభవం వారు పొందుతూ ఉంటారో చూపించారు. అక్కడే, ఆ కేంద్రంలోనే కృత్రిమంగా ఏర్పాటుచేసిన కొన్ని యాంత్రిక విధానాల ద్వారా ఆ అనుభవాన్ని వారికి కలిగించారు.

శిక్షణలోని ఒక్కో అంశమూ పూర్తయిన తరువాత, వారికి కొన్ని రోజులు విశ్రాంతి కలిగిస్తున్నారు.

ఆ శిక్షణలోని ఒక ముఖ్యమైన అంశం, భారరహిత స్థితిని వారికి అలవాటు చేయడం. రాకెట్ ఆకాశంలోకి లాంచ్ చేయబడ్డాకా, కొంత సమయానికది భూమి ఆకర్షణ జోన్‌ను దాటిపోతుంది. ఆకాశంలో ఆ జోన్‌ను దాటాకా, వస్తువులు, మనుషులూ తమ బరువును కోల్పోతారు. బరువును కోల్పోయిన స్థితిలో మనిషి ఎప్పటిలాగా నిలబడలేడు. పైకి తేలిపోతాడు. అలా తేలిపోయే స్థితిలో, ఎలాగ నిలద్రొక్కుకోవాలో అలవాటు చేస్తారు.

చంద్రగ్రహం యొక్క ఆకర్షణ శక్తి, భూమి ఆకర్షణ కన్నా తక్కువ. అందువలన అక్కడకు వెళ్ళాకే, మనుషులు తమ బరువును కొంత కోల్పోతారు. అలాంటి స్థితిలోనూ నిలదొక్కుకోవాలి. ఇలాంటిస్థితిని అలవాటుచేసుకోవడం అంత తేలిక కాదు. అందుకే భారరహితస్థితిని అంతరిక్ష యాత్రికులకు అలవాటు చేయడంలో ఎక్కువ శ్రద్ధ తీసుకుంటారు.

వారిని కొన్ని యాంత్రిక కేబిన్స్‌లో నిలబెట్టి అక్కడ భారరాహిత్యాన్ని కలిగించి అలవాటు చేస్తారు. ఇది కొంత ఇబ్బందికరమైనదే.

మొత్తం మీద వారిచ్చిన వేరు వేరు శిక్షణలు కొంచెం కఠినంగానే అనిపించాయి వారికి.

కొత్తరకం ఆహార అలవాట్లను చేసుకోవలసి వచ్చింది. శారీరక శిక్షణ కూడా ఇచ్చారు. ఎందుకంటే, వారు లాంచ్ చేయబడ్డాకా, తిరిగి భూమిమీద కొచ్చేవరకూ ఎలాంటి అనారోగ్యానికి గురికాకూడదు. అందువలనీవిషయంలో అన్ని జాగ్రత్తలూ సూచించారు. శిక్షణలో వారు చెపుతున్న, చూపుతున్న అన్ని క్రియా ప్రక్రియలనూ వారు జాగ్రత్తగా అర్థం చేసుకుని నేర్చుకుంటున్నారు.

ఈవిధంగా, అంతరిక్ష యాత్రికులు భూమి నుండి లాంచ్ చేయబడి, తిరిగి వారు భూమి మీదకు వచ్చేవరకూ అన్ని కీలకమైన అంశాలలోనూ వారికి శిక్షణ ఇవ్వబడింది. ఇందుకు సుమారు రెండు సంవత్సరాలు పడుతుంది.

ప్రయాణంలోని ప్రోగ్రాం వారికి చెప్పారు.

"ముగ్గురు యాత్రికులూ రాకెట్‌లో కమాండ్ మాడ్యూల్‌లో ఉండి ప్రయాణం చేస్తారు. అందుకు తగిన సదుపాయాలక్కడుంటాయి. ఈ ప్రయత్నంలో వారు ఎవరు నిర్వర్తించవలసిన పనులు వారు నిర్వర్తిస్తారు. వారికేవైనా సంశయాలూ ఇబ్బందులు లాంటివి కలిగితే, భూమి మీద ఇస్రోలో ఉన్న కంట్రోల్ రూంను సంప్రదిస్తారు. అక్కడి శాస్త్రవేత్తలు వారికి కమాండ్స్ పంపిస్తూ ఉంటారు. 'నాసా' మానిటర్ చేస్తుంటుందే తప్ప వారికే కమాండ్స్ ఇవ్వదు. ఎందుకంటే రెండు కేంద్రాల నుంచి కమాండ్స్ వస్తే వారు కన్ఫ్యూజ్ అయ్యే అవకాశముంటుంది."


ఆస్ట్రోనాట్ ట్రైనీలు - దీపక్, అనూష, స్వామినాథన్‌లను ఇండియాకు తిరిగి వెళ్ళచ్చునని చెప్పారు. వారు లాంచ్ చేయబడేవరకూ సమావేశాల్లోనూ, సభల్లోనూ, సన్మానాల్లోనూ పాల్గొనవద్దని సూచన చేసారు.

★ ★ ★

## ఇది విన్నారా?



★ బస్సులు, రైళ్ళల్లో ఉండే రాడ్లపై బ్యాక్టీరియా, వైరస్ చేరతాయి. ప్రయాణం చేసొచ్చాక చేతులు యాంటీ బ్యాక్టీరియల్ లిక్విడ్ లేదా సబ్బుతో కడగాలి.



★ గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌లతో సుక్రోజ్ నిర్మితమవుతుంది.

## ఇది విన్నారా?



★ రెస్టారెంటు మెనూ కార్డులు, ఏటీఎం కేంద్రాలు, రైల్వే, మెట్రో స్టేషన్లలో ఉండే టికెట్ డిస్పెన్సర్ల తెరలను రోజూ చాలామంది తాకుతారు. వీటిలోనూ క్రిములు వ్యాపించవచ్చు.



★ మన దేశంలో ఉన్న అతి పెద్ద మంచినీటి సరస్సు జమ్మూ కాశ్మీర్‌లోని 'ఊలార్'.

ప్రదీప్, అనూష, స్వామినాథన్ ఫ్లైట్ దిగాకా నేరుగా శ్రీహరి కోటలోని ఇస్రోకు వెళ్ళారు. అక్కడ సైంటిస్టులకు రిపోర్టు చేసారు. వారు వీరిని చాలా ప్రశ్నలడిగారు. అంటే, వీరెలాంటి శిక్షణక్కడ పొందారనేది తెలుసుకోవడం కోసం అడిగారు. వీరు చెప్పిన దానినిబట్టి వారు సంతృప్తిచెందారు.

అప్పటికే రాకెట్ల నిర్మాణం పూర్తికావొచ్చింది. మాడ్యూల్స్ మొదలైన ఇతర వాహనాలను కన్‌స్ట్రక్షన్ చేస్తున్నారు. అన్నింటినీ కూడా ఇస్రో శాస్త్రవేత్తలే సొంతంగా డిజైన్ చేసుకున్నారు. చాలా కొద్దిసందర్భాల్లో మాత్రమే నాసా నుండి సలహాలు తీసుకున్నారు. ఇప్పటికే వారికి ఇలాంటి అంతరిక్ష నౌకల గురించి మంచి పరిజ్ఞానం అలవడింది.

దీపక్‌ను, అనూషను, స్వామినాథన్‌నూ ఒక ఇంజనీరు తీసుకెళ్ళి మూన్‌లాంచింగ్ కోసం తయారవుతున్న వాటిని చూపించారు. వాటిలోని విభాగాలనూ, ఇతర యంత్రాలనూ చూపించి వాటి పనితీరును గురించి చెప్పాడు వారికి.

వారు తమ తమ ఇళ్ళకు వెళ్ళవచ్చని చెప్పారు. లాంచింగ్ డేట్ నిర్ణయం కాగానే తెలియచేస్తామని చెప్పారు. సభల్లోనూ, సమావేశాల్లోనూ పాల్గొనవద్దని వారు కూడా, నాసాలో వలెనే సలహా చెప్పారు వారికి.

దీపక్, అనూష వారి ఊరెళ్ళిపోయారు. స్వామినాథన్ తమిళనాడుకి వెళ్ళాడు.

★ ★ ★

ఒకనాటి రాత్రి దీపక్, అనూష మంచం మీద పడుకుని ఉన్నారు.

"దీపక్! ఇంతవరకూ, మనకు పిల్లలు పుట్టలేదు కదా! మనం సంతకం చేసిన అగ్రిమెంట్ ప్రకారం ఈ రెండేళ్ళూ కుదరదు. ఒక వేళ మనం చంద్రగ్రహానికి వెళ్ళివచ్చాకా పుడతారేమో!" అంది అనూష ఉత్సాహంగా.

"పుట్టనీయి. మంచిదే కదా!" అన్నాడతను.

"పుడితే ఏం పేరు పెడదాం" అంది సరదాగా.

"ఏదో సామెత చెబుతారు. అలూ లేదు, చూలూ లేదు, కొడుకు పేరు సోమలింగం అన్నాడంట ఒకాయన. అలా వుంది నీవు అనేది?"

"అలి ఉంది కదా! చూలు అదే వస్తుంది" అందామె.

"సరే అయితే నీవే చెప్పు" అన్నాడు.

"మగపిల్లాడైతే చంద్రుడి పేరు పెడదాం- శశాంక్ అని" అంటే

"చంద్రుడు శృంగార పురుషుడంటారు. అప్పుడీ అత్తగారికి ఎందరు కోడళ్ళో! భరిస్తావా?"

"భరించడానికి నాదేం పోయింది?"

"ఆడపిల్లయితే?"

"చంద్రిక. చంద్రుని నుండి ప్రసరించే తెల్లని చల్లని కిరణం చంద్రిక" అందామె.

"అయితే, అప్పుడు వెన్నెల కోసం డాబా మీదకెళ్ళక్కర్లేదు. మనింట్లోనే వెన్నెల తిరుగుతూ ఉంటుంది" అన్నాడు దీపక్ ఆమెను దగ్గరకు తీసుకుంటూ.

★ ★ ★

### అంతరిక్ష ప్రయాణం

ఆ తరువాత కొన్ని రోజులు గడిచాయి.

ఇస్రో రాకెట్ లాంచింగ్ తారీఖును నిర్ణయించారు. వెంటనే వచ్చి రిపోర్ట్ కావాలని మెయిలిచ్చారు. ఫోన్‌లో కూడా చెప్పారు.

దీపక్, అనూషలు అన్నీ సర్దుకుని శ్రీహరి కోటకెళ్ళారు. అక్కడి సైంటిస్టులను కలిసారు. తమిళనాడు నుంచి స్వామినాథన్ కూడా వచ్చాడు. వారికి గెస్ట్‌హౌస్‌లో బస ఏర్పాటు చేసారు.

వారి ముగ్గురిచేత స్పేస్ సూట్ (వ్యోమగామి దుస్తులు) దరింపచేశారు. ఈ దుస్తులను ధరించడం వాటిలో ఉన్న వివిధ అంశాలు, అవి వారికి ఎలా ఉపయోగపడతాయో నాసా శిక్షణతోనే వివరంగా చెప్పారు. అంతేకాదు, స్పేస్ సూట్లను ధరింపచేసి కొంత శిక్షణను నాసాలో ఇచ్చారు.

అప్పటికే సిద్ధమై ఉన్న రాకెట్టు వద్దకు వారిని తీసుకెళ్ళారు. రాకెట్‌లోకెళ్లాకా లోపల ఉన్న కమాండ్ మాడ్యూల్, లూనార్ మాడ్యూల్‌లను వారికి చూపించారు. వాటిలో ఎవరు ఏ స్థానంలో కూర్చోవాలో చెప్పి కూర్చోమన్నారు. లోపల కొన్ని మెకానికల్ ఆపరేషన్స్ వారి చేత చేయించారు. అప్పటి నుంచి ప్రతి రోజూ కూడా వాటిని వారికి పరిచయం చేస్తూనే వున్నారు. వారి పనితీరు, సమర్థతల గురించి ఇస్రో శాస్త్రవేత్తలకు నమ్మకం కుదిరింది.

కౌంట్‌డౌన్ ప్రారంభమైంది.

రాకెట్‌ను లాంచ్ చేసే రోజుకు దీపక్, అనూష, స్వామినాథన్ తల్లిదండ్రులు శ్రీహరి కోటకు వచ్చారు. లాంచింగ్ సమయంలో బైట వారినెవర్నీ లోపలికి అనుమతించరు. అయితే, వీరి కోరికమీద, ఆరోజున వారి తల్లి దండ్రులను అనుమతించారు.

స్పేస్ సూట్లలో ఉన్న తమ పిల్లల్ని వారి తల్లిదండ్రులు వెంటనే గుర్తించలేకపోయారు.

ఆ ముగ్గురూ వారి వారి తల్లిదండ్రులకు నమస్కరించారు. తరువాత రాకెట్ దగ్గరకు నడిచారు. వారు రాకెట్‌లోకి ప్రవేశించారు. లోపల కమాండ్ మాడ్యూల్‌లో తమ స్థానాలలో కూర్చున్నారు. అన్నీ మూసివేశారు.

ఉదయం 9 గంటల 25 నిమిషాలకు లాంచింగ్ బటన్ నొక్కారు ఇస్రో డైరెక్టరు. రాకెట్ మంటలు గ్రక్కుతూ అంతరిక్షంలోకి దూసుకువెళ్లింది.

ఏస్ట్రోనాట్స్ (వ్యోమగాములు) శరీరాలు కొద్ది జల్లుమన్నాయి. రాకెట్ అంతరిక్షంలోకి అతివేగంగా దూసుకుపోతుంటే "హౌ సైన్స్ ఎడ్వాన్స్‌డ్" అనుకుంది అనూష.

అంతరిక్షంలో రాకెట్ అలా అతి వేగంగా దూసుకుపోతుంటే, వారికి నక్షత్రాలు కాస్త పెద్దవిగాను, ప్రకాశవంతంగాను కనిపించాయి.

ఇస్రోలోని కంట్రోల్‌రూం నుంచి శాస్త్రవేత్తలు, టెక్నికల్ ఎక్స్‌పర్టులు, మానిటర్ చేస్తున్నారు. అవసరమైన ఆదేశాలూ, సూచనలూ వారికిస్తున్నారు. ఆ ప్రకారం ఏస్ట్రోనాట్స్ అనుసరిస్తున్నారు. నాసా కంట్రోల్‌రూం నుంచి కూడా వారు మానిటర్ చేస్తున్నారు. కానీ వారేమీ ఆదేశాలివ్వడంలేదు.

కొంత టైము గడిచాకా వారికి తమలో ఏదో మార్పు కనిపించింది. అప్పటికి రాకెట్ భూమి ఆకర్షణ జోన్‌ను దాటింది. భారరహిత స్థితి ఏర్పడింది. వారు తమ బరువును కోల్పోతున్నారు. ఆ స్థితిలో ఎలా ఉండాలో, ఏం చేయాలో ముందే శిక్షణ తీసుకున్నారు గనక అందుకు సిద్ధమయ్యారు.

అలా జరిగిన సుదూర ప్రయాణం తరువాత, అంతరిక్షనౌక లూనార్ ఆర్బిట్‌లో (చంద్రుని కక్ష్యలో) చేరింది.

భూమి నుంచి చంద్రగ్రహానికి 2,40,000 మైళ్ళ దూరముంది. అంటే 3,86,400 కి.మీటర్లన్నమాట.

ఇస్రో నుంచి వారికి కమేండ్స్ అందాయి. దీపక్, అనూష కమాండ్ మాడ్యూల్ నుంచి లూనార్ మాడ్యూల్‌లోకి మారారు. దాని తలుపులు గట్టిగా మూసివేశారు.

కమాండ్ మాడ్యూల్లో ఉన్న స్వామినాథన్ లూనార్ మాడ్యూల్‌ను అంతరిక్ష నౌక నుంచి (స్పేస్‌క్రాఫ్ట్ నుంచి) నెమ్మదిగా బైటకు వదిలాడు. అది పూర్తిగా విడివడ్డాకా, స్వామినాథన్ కమాండ్ మాడ్యూల్ తలుపులు మూసివేశాడు.

లూనార్ మాడ్యూల్ చంద్రగ్రహం మీదకు దిగడం మొదలైంది. అలా దిగే సమయంలో ఏమి చేయాలో ముందే దీపక్, అనూషలు శిక్షణ పొంది ఉన్నారు.

లూనార్ మాడ్యూల్‌లో ఉన్న ప్రతి యాంత్రిక అంశం, పరికరమూ వారికంతకు ముందు బాగా పరిచయమై ఉన్నాయి. ముందే అనుకున్న విధంగా వాటిని ఆపరేట్




## ఇది విన్నారా?



★ జీబ్రా మీదున్న తెలుపు, నలుపు చారల వల్ల దాని శారీరక ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంచుతాయని ఇటీవల జంతుశాస్త్రజ్ఞులు కనుగొన్నారు.



★ విమానాలు కనిపెట్టక ముందు జెట్‌లాగ్‌ను 'బోట్‌లాగ్' అనేవారు.

చేస్తున్నారు. దిగేకొద్దీ పెరుగుతున్న మాడ్యూల్ వేగాన్ని బాగా నియంత్రించాడు దీపక్. అది చాలా నెమ్మదిగా చంద్రగ్రహం నేలమీద దిగింది.

భూకేంద్రం నుంచి వారికి ఆదేశాలు వచ్చాయి. వాటి ప్రకారం వారు కొద్ది నిమిషాలు మాడ్యూల్లోనే ఉన్నారు. తరువాత దాని నుంచి ఒక నిచ్చెన కిందకు వచ్చింది. ఆ నిచ్చెన మీదుగా ముందు అనూష దిగింది.

## చంద్రునిపై భారత పతాకం

ఆ విధంగా మొదటిసారిగా ఒక మానవ స్త్రీ చంద్రగ్రహం మీద దిగింది. అనూష సంతోషంతో గంతులు వేసింది. ఇస్రో, నాసా కేంద్రాల నుంచి అదంతా శ్రద్ధగా గమనిస్తున్నారు. అనూష పొంగిపొర్లే ఉత్సాహంతో శాస్త్రవేత్తలకు అక్కడి నుంచే అభివాదం చేసింది.

ఆమె దిగిన 16 నిమిషాల తరవాత, దీపక్ నిచ్చెన మీదుగా చంద్రుని నేలమీద దిగాడు.

వ్యోమగాములుగా వెళ్ళిన ఆ భార్యాభర్తలిరువురూ చేయీచేయి పట్టుకుని మరోసారి సంతోషంతో ఎగిరి గంతేశారు.

అప్పటికే చంద్రగ్రహం మీద బరువు తక్కువగా వుండే స్థితి వారి అనుభవంలోకి వచ్చింది. భూమి మీద లాగా కాకుండా వారు ఎగిరితే తేలిపోతున్నారు.

ఇస్రో, నాసా శాస్త్రవేత్తలు వారి గమనాలను భూకేంద్రాల నుంచి పరిశీలనతో చూస్తున్నారు.

మాడ్యూల్లో జెండాలు, ఇతర సామాగ్రి తీసుకువచ్చారు.

భారత జాతీయ జెండాను దీపక్, అనూష చంద్రగ్రహ ఉపరితలంపై ఎగరవేశారు. అత్యంత గౌరవంతో వారు జాతీయ జెండాకు శాల్యూట్ చేశారు. ఆ దృశ్యాలను టీవీ ముందు కూర్చుని చూస్తున్న భారత ప్రజలంతా హర్షధ్వానాలు చేశారు. కొందరు నిలబడి శాల్యూట్ చేశారు. కొందరు సంతోషంతో ఎగిరి గంతులు వేశారు. భారత ప్రజలకది విజయోత్సవ సమయం. విదేశాలలో ఉన్న భారతీయులు కూడా సంతోషంతో ఆ దృశ్యాలను వీక్షించారు.

తరువాత ప్రపంచ దేశాల ప్రజల తరపున దీపక్, అనూషలు ఐక్యరాజ్యసమితి జెండాను కూడా ఎగురవేశారు. టీవీలలో వీక్షిస్తున్న ప్రపంచదేశాల్లోని ప్రజలు హర్షధ్వానాలు చేశారు. ఇది భారతీయుల విశ్వమానవ సౌభ్రాతృత్వానికి చిహ్నం అని కొనియాడారు.

దీపక్-అనూష తమ చేతులు పైకెత్తి నమస్కారముద్రలో ఉంచారు. "భూగ్రహం మీదున్న ప్రజలందరికీ మా నమస్కారాలు, శుభాకాంక్షలు" అన్నారు.

లూనార్ మాడ్యూల్ చంద్రుని ఉపరితలంపై దిగినప్పటి నుంచి మానిటర్ చేస్తూ, ఆ దృశ్యాలను చూస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు విజయోత్సాహంతో హర్షధ్వానాలు చేస్తూ ఒకరినొకరు కౌగలించుకున్నారు. ఇస్రో డైరెక్టరు శాస్త్రవేత్తలనందరినీ అభినందించారు.

దీపక్ మాట్లాడాడు.

"విశ్వరహస్యాలను తెలుసుకోడానికి, ప్రాచీనకాలం నుంచీ మానవులు చేస్తున్న పరిశోధనాప్రస్థానంలో ఇది ముఖ్యమైన అడుగు. ఈ ప్రయత్నం, ఈ సాధన మానవాళికి శుభాన్ని, శాంతినీ కలుగచేయాలని కాంక్షిస్తున్నాం.

పరిణిత శాస్త్రపరిజ్ఞానంతో, ప్రతిభావంతమైన నిర్వహణతో భారతదేశ ఇస్రో శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. సాధారణ భారత పౌరదంపతులైన మా ఇద్దర్నీ ఈ చంద్రగ్రహం మీద నిలిపారు. వారికి మా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం. మా అభినందనలూ, శుభాకాంక్షలనూ తెలియచేస్తున్నాం.

ఈ మొత్తం మిషన్లో నాసా శాస్త్రవేత్తలు తమ శాస్త్రపరిజ్ఞానాన్ని సాంకేతిక సమాచారాన్ని ఇస్రోకు అందించి సహకరించారు. వారికి మా కృతజ్ఞతలు.

భారత రాష్ట్రపతి, ప్రధాన మంత్రి వారి ప్రభుత్వమూ, ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని మంజూరుచేసి ఇతరత్రా కూడా ప్రోత్సహించారు. వారికి మా ధన్యవాదాలు, కృతజ్ఞతలు, శుభాకాంక్షలు.


ప్రపంచ దేశాల ప్రజలందరికీ మా తరపునా, ఇస్రో తరపునా, భారత ప్రజల తరపునా శుభాకాంక్షలు తెలియచేస్తున్నాం.


మా సహ వ్యోమగామి, చంద్రకక్ష్యలో స్పేస్‌క్రాఫ్ట్‌లో ఉన్న స్వామినాథన్ తరపున కూడా ఇస్రో శాస్త్రవేత్తలకు, నాసా వారికి భారత ప్రభుత్వానికి, భారత ప్రజలకు, ప్రపంచ దేశాల ప్రజలకూ శుభాకాంక్షలు, కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం"

తరువాత అనూష మాట్లాడింది. "భూమి మీదున్న మానవాళి ప్రస్థానంలో, గ్రహాంతర యానంతో మరో గ్రహం అయిన చంద్రుని మీద ఒక స్త్రీని మొదటిసారిగా నిలిపిన ఘనత, విజయమూ ఇస్రో శాస్త్రవేత్తలదే! ఆ మొదటి స్త్రీని నేనే అయినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ మహత్తర కార్యాన్ని సాధించిన శాస్త్రవేత్తలకు, ఇతరులకు నా ధన్యవాదాలు. శుభాకాంక్షలు! అభినందనలు"

ఆ తరువాత అనూష ఇవే మాటలను తెలుగులో కూడా అన్నది. చంద్రగ్రహం నుంచి తెలుగువారి ఆడపడుచు తెలుగుభాషలో చెప్పిన కృతజ్ఞతాభినందనలను, ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వున్న తెలుగువారు విని తమ మాతృభాష యెడల ప్రేమతో పులకించారు.

-ఇంకా వుంది






...::: మన్నె సత్యనారాయణ & ప్రియదర్శిని చాగంటి

ఆ కార్యక్రమం తరువాత, దీపక్-అనూషలు శాస్త్రవేత్తలు తమకు నిర్దేశించిన ఇతర పనులకు ఉపక్రమించబోతున్నారు. ఇంతలో వారికొక పద్ధతిలో శబ్దం వినిపించసాగింది.

అదొక క్రమంగా సాగుతున్న శృతిబద్ధమైన శబ్దం! వింటున్న కొద్దీ అదొక ఇంపైన పాటలా సాగుతున్నది.

దీపక్-అనూషలు ఒకరినొకరు చూసుకున్నారా శబ్దం విని. చంద్రగ్రహం మీద ఏ వైపు నుంచి ఆ శబ్దం వినిపిస్తున్నదోనని, ఉపరితలం మీద నలుదిక్కులా చూశారు. కానీ వారికి అర్థం కాలేదు.

ఆకాశం వైపు చూశారు. అనంతమైన శూన్యాకాశంలో, అంతుపట్టని ఏ విశ్వతీరం నుంచో వినిపిస్తున్నదా అది అనే భావం వారికి కలిగింది. ఇది భావమా? అనుభూతా? వాస్తవమా? అనిపించింది వారికి.

వారు నాలుగడుగులు అటూ ఇటూ వేసి, చంద్రగ్రహం మీద మళ్ళీ నాలుగు దిక్కులా పరికించి చూశారు. శ్రద్ధగా వినడానికి ప్రయత్నించారు. వారికేమీ కొత్త కనిపించలేదు. అక్కడెవరూ లేరు.

"ఆశ్చర్యంగా వుంది. ఇక్కడెవరైనా అదృశ్యంగా వుండి మనకీ శబ్దాన్ని గానీ సంగీతాన్ని గానీ వినిపిస్తున్నారంటావా?" అంది అనూష.

"ఇప్పుడు మనమున్న పరిస్థితిని బట్టి అలాగనిపించవచ్చును గానీ అది నిజం కావడానికి అవకాశం లేదు" అన్నాడు దీపక్.

ఇద్దరూ మరో అయిదు నిమిషాలలాగే ఆకాశం వైపు చూస్తూ విన్నారు. ఆ శబ్దం అలాగే వినిపిస్తోంది. ఆ శబ్దాన్ని ఎలా అర్థం చేసుకోవాలో కూడా వారికి తెలియలేదు.

**జరిగిన కథ**

**4**

ఓ టెక్నాలజీ కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్న దీపక్ భార్య అనూష కొంత కాలం లెక్చరర్‌గా ఉద్యోగం చేసి మానేస్తుంది. అమెరికాలో నాసావారు భారత్‌లోని ఇస్రోతో కలిసి చంద్రుని మీదకు పరిశోధనలకోసం మానవసహిత అంతరిక్షనౌకను పంపించేందుకు సన్నాహాలు చేస్తుంటారు. ఈసారి ముగ్గురు సాధారణ పౌరులను ఎంపిక చేసి పంపాలనుకుంటున్న సంగతి తెలుసుకున్న దీపక్, అనూష అందుకు సిద్ధమై అప్లయ్ చేయాలనుకుంటారు. తాము అన్ని పరీక్షలకూ నిల్చి ఎంపికయ్యే వరకూ ఆ సంగతి ఎవరికీ చెప్పవద్దని అనుకుంటారిద్దరూ. కొంత కాలం గడిచాక ఊహించని విధంగా అంతరిక్ష యాత్రకు దీపక్-అనూష ఇద్దరూ ఎంపిక కావడం వారికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వీరిద్దరితోపాటు తమిళనాడుకు చెందిన మరో వ్యక్తి కూడా ఎంపిక అవుతాడు. చంద్రునిపైకి వెళ్లేందుకు ఎంపికైన దీపక్-అనూష అమెరికా పయనమవుతారు.దీపక్-అనూష విజయవంతంగా చంద్రగ్రహం మీద అడుగు పెడతారు.

**కల్పనా జగత్తులో విహరింపజేసే సైన్స్ ఫిక్షన్**



"ఇది మనకర్థం కానిది. ఆశ్చర్యకరమైనది. ఆలస్యం చేయకుండా మన సైంటిస్టులకు తెలియచేయడం మంచిది" అన్నాడు దీపక్.

"అలాగే చెబుదాం. వారేం చెబుతారో మనకూ తెలుస్తుంది" అంది అనూష.

దీపక్ భూమి మీదున్న ఇస్రో సైంటిస్టులను కాంటాక్ట్ చేశాడు.

"సర్, ఇక్కడేదో శబ్దం వినిపిస్తోంది. సంగీతంలాగా శృతిబద్ధంగా వుంది"

"అక్కడెవరైనా వున్నారని మీకు అనిపించిందా?" అనడిగారు సైంటిస్టులు.

"లేదు. అన్ని వైపులా చూశాం. ఎవరూ లేరు. ఎక్కడా ప్రత్యేకమైనదేదీ కనిపించలేదు"

"అక్కడ గాలిలాంటిదేదైనా వీస్తున్నదా?"

"లేదు సార్. అది గాలి శబ్దం కాదు"

"ఆ సంగీతంతోపాటు... అంటే మాటలు లాంటివి వున్నాయా? మీకర్థం కాకపోయినా ఏ భాషలోనైనా?"

"లేదు సార్. అది పాట కాదు. శృతిబద్ధమైన శబ్దమే. చంద్రగ్రహం మీద శబ్దం కాదనిపిస్తోంది. అనంతాకాశంలో ఎక్కడ నుంచో వస్తు

న్నదన్న అనుభూతి కలుగుతోంది"

"సరే అయితే, ఆ శబ్దాన్ని ఆడియోలో రికార్డు చేయండి" అన్నారు వారు.

అనూష రికార్డర్‌ను ఆన్ చేసింది. అయిదు నిమిషాలలా ఉంచారు. ఆ తరువాత ప్లే చేశారు. కానీ ఏ శబ్దమూ రాలేదు.

"శబ్దం రికార్డు అవలేదేంటి?" అంది అనూష.

"రికార్డర్‌లో ఏదైనా లోపముందేమో?"

"మన మాటల్ని రికార్డు చేసి చూద్దాం. లోపముంటే తెలుస్తుందిగా" అందామె.

వారిద్దరూ కొద్దిసేపు ఏవో మాట్లాడి రికార్డు చేశారు. తరువాత ప్లే చేశారు. వారి మాటలు అందులో స్వచ్ఛంగా వినిపించాయి.

దీపక్ మళ్ళీ సైంటిస్టులను కాంటాక్ట్ చేశాడు.

"సర్, ఆ శబ్దం రికార్డు కావడం లేదు" అని చెప్పాడు.

"రికార్డర్‌లో లోపం వుందేమో చూశారా?" అనడిగారు వారు.

"చూశాం. ఏ లోపమూ లేదు. కానీ ఆ శబ్దం రికార్డు కావడం లేదు"

"మళ్ళీ ఒకసారి చెయ్యండి. రికార్డయితే మాకు ఫార్వర్డు చేయండి" అన్నారు.

ఈసారి దీపక్ రికార్డర్ ఆన్ చేసి, దాన్ని పట్టుకున్న తన చేతిని పైకెత్తాడు. అలాగే అయిదు నిమిషాలుంచాడు. తరువాత తన చేతిని కిందకు దించి ప్లే చేశాడు. శబ్దం రాలేదు. అంటే రికార్డు కాలేదు.

వారిద్దరికీ, సైంటిస్టులకూ ఆశ్చర్యమే!

"మీరు ఎరిగిన ఏ మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్ శబ్దంలా వుందది?" అనడిగారు సైంటిస్టులు.

"మేమెరిగిన ఏ మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంటు నుంచీ అలాంటి శబ్దాన్ని ఇదివరలో మేం వినలేదు. అది సంగీత పరికరంలోంచి వచ్చిన శబ్దంలాగా లేదు. ఆకాశంలోని అతి సుదూర ప్రాంతాలనుంచి వస్తున్నదా అనే భావం కలుగుతోంది అది వింటోంటే" అన్నాడు దీపక్.

"అలాగా! అది బాగా నిశితంగా పరిశీలించవలసిన విషయమే! మీరు చంద్రగ్రహం మీద దిగినప్పటినుంచీ ఆ శబ్దం వింటున్నారా? లేక ఇపుడే వింటున్నారా?"

"ఇక్కడ మేము దిగాకా వెంటనే గ్రహించలేదు. కార్యక్రమం పూర్తయ్యాకా ఇప్పుడు మాత్రమే గ్రహించి వింటున్నాం"

"ప్రస్తుతానికి ఆ విషయమలా వుంచండి. మీకు నిర్దేశించిన మిగిలిన పనులు చూడండి" అని సైంటిస్టులు వారిని ఆదేశించారు.

"అలాగే సార్" అన్నాడు దీపక్.

"దీపక్! ఆ శబ్దం మనకు బాగానే వినిపిస్తున్నది కదా! రికార్డులోకి రాకపోవడమేమిటి?" అంది అనూష మళ్ళీ సంశయం తొలగక.

"అన్నీ మనకు తెలియవు కదా"

"అవును, అన్నీ మనకు తెలియవు కదా! శాస్త్రవేత్తలకే తెలియడం లేదు అన్నీ. ఈ శబ్దాన్ని మనమేం అనుకుందాం?"

"విశ్వ సంగీతం అనుకుందాం ప్రస్తుతానికి" అన్నాడు దీపక్ ఆలోచనగా.

"విశ్వసంగీతం! మంచి మాటన్నావు"

"మనకు నిర్దేశించిన మిగిలిన పనులు చూసుకుందాం" అన్నాడు.

"అలాగే! ఒక విషయం.. ఈ విశ్వంలోని గ్రహాలన్నీ పెర్‌ఫెక్ట్ ఆర్డర్‌లో పరిభ్రమిస్తున్నాయి. ఆశ్చర్యం కదూ" అంది అనూష.

'The Laws of nature are fine tuned' అన్నాడు ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త, ఖగోళశాస్త్రంలో మంచి అవగాహన కలిగిన ఆలోచనాపరుడూ అయిన స్టెఫెన్ హాకింగ్. అంటే- ప్రకృతి సూత్రాలు పరిపూర్ణ నైపుణ్యంతో నిర్దేశింపబడినాయి. ఆ అమరికలోను, పరిభ్రమణంలోనూ అంత పరిపూర్ణ నైపుణ్యమున్నది కనుకనే మన భూమి అనే గ్రహం మీద జీవరాశి ఉద్భవించి మనుగడ సాగించగలుగుతోంది అని ఆయన అభిప్రాయం చెప్పారు. విశ్వరహస్యాలు కొన్నింటినైనా తెలుసుకోడానికి శాస్త్రజ్ఞులు ప్రయత్నాలు చేస్తున్నారు" అన్నాడు దీపక్.

"అవును నిజమే. మన సైంటిస్టులు నిర్దేశించిన శిలల సేకరణ మొదలైన పనులు చూద్దాం" అంది అనూష.

ఇద్దరూ ఆ పని మీద కదిలారు.

★ ★ ★

## అపురూప ఆవిష్కరణ

ఆ తరువాత ఇస్రో శాస్త్రవేత్తల ఆదేశాల మేరకు దీపక్, అనూష చంద్రగ్రహ శిలలు కొన్నింటిని సేకరించారు. అక్కడి మట్టిని, ఇతరములనూ సేకరించారు. వారు చంద్రుని నేల మీద నడుస్తున్నప్పుడు అక్కడ గురుత్వాకర్షణ తక్కువైనందువలన, తేలికయ్యారు.

భూమి చుట్టూ చంద్రుడి కక్ష్య అండాకారంలో వుంటుంది. అందుకని, భూమికి చంద్రు

## ఇది విన్నారా?



★ వ్యాయామం చేస్తుంటే చెమట పట్టి చికాకు పరిచినప్పుడు, ఈ ఇబ్బందిని తొలగించడానికి, ఒక సూట్‌ను శాస్త్రవేత్తలు రూపొందించారు. ఇది ధరిస్తే వారిని తాజాగా వుంచుతుందని, ఇంట్లోకి గాలివెలుతురు రావడానికి వెంటిలేటర్లు పెట్టినట్లే, ఈ సూట్‌కు వెంటిలేటర్లు అమర్చారు. అయితే ఇవి అవసరమైనప్పుడే తెరుచుకుంటాయని తెలిపారు. దీని తయారీలో సజీవ కణాలను ఉపయోగించారు. ఇవి సెన్సర్లుగా పనిచేసి శరీర ఉష్ణోగ్రత, చెమటను గుర్తించి పనిచేస్తాయిట.

డికీ ఉన్న మధ్యదూరం 3,86,400 కి.మీ.నుంచి 4,05,000 కి.మీ.దాకా వుంటుంది. చంద్రుడి స్థానాన్నిబట్టి ఏ త్రోవలో భూమి నుంచి చంద్రుడి దగ్గరకు వెళ్ళాలని ఎంచుకుంటే దాన్నిబట్టి ప్రయాణకాలంలో తేడా వుంటుంది. అతి తక్కువ దూరం ఎంచుకుని, ఆ త్రోవలో అంతరిక్ష నౌక దూసుకుపోవటం వలన, దీపక్ అనూషాలు రెండున్నర 'భూమి రోజుల్లో'నే చంద్రతలం చేరారు.

చంద్రగ్రహం తన అక్షం మీద ఓసారి తిరగటానికి 27.3 రోజులు పడుతుంది. దీనిని 'సిడీరియల్ డే' అంటారు. సూర్యుడు యెక్కడ వున్నాడో అక్కడికి రావటానికి మాత్రం 29.5 రోజులు పడుతుంది. దీనిని 'సైనోడిక్ డే' అంటారు. అంటే చంద్రుడి మీద ఓరోజు మన భూమి మీద ఇంచుమించు 29.5 రోజులతో సమానం. చంద్రుడి మీద పగటి ఉష్ణోగ్రత 273 డిగ్రీల ఫారన్‌హీట్ లేదా 134 డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. రాత్రిపూట మైనస్ 243 డిగ్రీల ఫారన్‌హీట్ వుంటుంది. అంటే భూమి దక్షిణ ధృవం కంటే రెండింతలు చల్లగా వుంటుంది.

చంద్రుడు భూమి చుట్టూ ఓసారి తిరగటానికి 27.3 భూమిరోజులు లేదా 27 రోజుల 7 గంటల 43 నిమిషాల 11.5 సెకన్లు తీసుకుంటుంది. చంద్రుడు తన అక్షం మీద మెల్లగా తిరుగుతూ వుండడం వలన భూమి మీద వారికి చంద్రుడి ఒక వైపు మాత్రమే కనిపిస్తుంది. అవతలి భాగం చీకటిగా వుంటుంది. చంద్రుని నుంచి భూమిని చూస్తే ఎప్పుడూ ఒకే చోట కనిపిస్తుంది. కానీ సూర్యుడు, నక్షత్రాలు మాత్రం కదులుతున్నట్లే అనిపిస్తాయి.

దీపక్, అనూష ఈ అద్భుతాలను కళ్ళారా చూసి ఆనందించారు.

"చంద్రుడి మీద ఓ రోజంటే దాదాపు భూమి మీద ఓ నెల" అంది అనూష.

చంద్రగ్రహం మీద వాతావరణం లేకపోవటం వలన పగలు వేడి నిలవ ఉండదు. పగలు చంద్రగ్రహం మితిమీరిన ఉష్ణోగ్రత తాకిడికి గురి అవుతుంది. అందుకనే పగలు విపరీతమైన వేడి, రాత్రి మితిమీరిన చలి ఉంటుంది" అంది అనూష.

"ఇక్కడ గురుత్వాకర్షణ 1.625 మీ/సెకండ్2 వుంటుంది. భూమితో పోలిస్తే 16.6% లేదా -.160 గ్రాములు/సెకండ్2 మాత్రమే వుంటుంది. అందుకని చంద్రుడు మీద వస్తువులు వాటి వాస్తవిక బరువులో 16.6% మాత్రమే వుంటాయి" అన్నాడు దీపక్.

"అందుకనే మనం ఇంత బరువైన బూట్లు, వస్త్రాలు వేసుకున్నా తేలిపోతున్నట్టే ఉన్నాము" అంది అనూష నవ్వుతూ.

"ఇక్కడ వాతావరణం లేదు కనుక వర్షం పడదు" అన్నాడు దీపక్.

"వాన లేకపోతే నీళ్ళు ఉండవు. మరి ఈ గ్రహం మీద మానవ జీవనం ఎలా సాధ్యం?" ప్రశ్నించింది అనూష.

"ఆ విషయం మీద శాస్త్రజ్ఞులు పరిశోధన చేస్తున్నారు" అన్నాడు దీపక్.

చంద్రుడి మీద చాలా తక్కువ గురుత్వాకర్షణ ఉండడం వలన వాళ్ళకి నడవటం కష్టం అనిపించింది. ఎగురుతూ, గెంతుతూ నడవాల్సి వచ్చింది. అప్పటి వరకూ ఇస్రో, నాసా శాస్త్రవేత్తలు వారి కదలికలను గుర్తిస్తూనే ఉన్నారు. అయితే అక్కడ నుంచి వారు నడుస్తూ ముందుకు వెళ్ళారు. అక్కడి నుంచి వారి జాడ భూకేంద్రాల్లోని వారికి తెలియకుండా పోయింది. చంద్రగ్రహం మీద పగటి చివర దశలో వాళ్ళు నడవసాగారు. అలా నడుస్తుంటే ఒక గుహలాంటిది కనిపించింది వాళ్ళకి.

"అక్టోబర్ 19, 2017న జపాన్ వాళ్ళ స్పేస్ ఏజెన్సీ చంద్రతలం మీద అతి పెద్ద గుహని కనిపెట్టామని వార్త ఇచ్చారు. దీనిలో గ్రహాంతరవాసులు ఓ పరిశోధన కేంద్రాన్ని పెట్టారేమోననే ఆశని వ్యక్తం చేశారు. ఆ గుహల గోడలు శాస్త్రవేత్తలని చిన్న ఉల్కల నుంచి అతి వికరణం నుంచి (Intense radiation) తాపమానంలో తీవ్రమైన మార్పుల నుంచి (Temparatures suring) కాపాడగలవని అభిప్రాయపడ్డారు. కానీ ఈ గుహల లోపల ఎలా ఉంటుందనే వాళ్ళకి తెలీదు. ఇంకా పరిశోధనలు చేయవలసి ఉన్నాయి. "బహుశ ఈ గుహ అదేనేమో?" అన్నాడు దీపక్.

"అయి వుండవచ్చు. ఇది అగ్ని పర్వతాలు నశించిపోయాక ఏర్పడిన లావా గుహ" అంది అనూష పరీక్షగా చూస్తూ.

"లోపలికి వెళ్దామా?" అన్నాడు దీపక్ ఉత్సాహంగా.

"వద్దు, మనని చంద్రుడి మీదకు పంపినప్పుడు చంద్రతలం మీద నడిచి వివరాలు సేకరించమన్నారే కానీ గుహలలోకి వెళ్ళమని చెప్పలేదు కదా" అని వారించింది అనూష.

"అది నిజమే అయినా మనం గుహ లోపలికి వెళ్దాము" అన్నాడు దీపక్ మొండిగా.

## ఇది విన్నారా?



★ రోజుకి కనీసం 7 గంటలకంటే తక్కువ నిద్రపోయేవారికి గుండె జబ్బులు వచ్చే అవకాశం వుందని తాజా సర్వే హెచ్చరిస్తోంది. ఎక్స్‌పెరిమెంటల్ ఫిజియాలజి అనే జర్నల్‌లో దీన్ని ప్రచురించారు.



★ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పాదరక్షల జతను ఇటీవల దుబాయ్‌లో ఆవిష్కరించారు. మేలిమి బంగారం, మేలుజాతి వజ్రాలు పొదిగిన ఈ బూట్ల ఖరీదు రూ.123 కోట్లు.

"కానీ..." అని తన మాట పూర్తి అయ్యే లోపలే దీపక్ గుహవైపు వెళ్ళటం చూసింది అనూష.

"నువ్వురా లేకపోతే ఒంటరిగా ఉండిపోతావు. సుదూరాల వరకూ ఎవరూ వేరు" అని అనూషని నవ్వుతూ ప్రోత్సహించాడు దీపక్. అతనిని ఆపలేక, గెంతులాంటి నడకతో గుహ దగ్గరికి వచ్చింది అనూష. గుహ కప్పుకి దగ్గరలో సోలార్ ఫలకాలు కనిపించాయి వాళ్ళకి. వాటి కింద నుంచి మెల్లిగా పాకుతూ గుహలోకి వెళ్ళసాగారు దీపక్, అనూష. అవి దాటాక నిటారుగా నడుస్తూ మరికొంత దూరం వెళ్ళారు.

★ ★ ★

కంప్యూటర్లో నాసా నుంచి వచ్చిన సందేశాలని చూస్తూ భారతదేశంలోని శాస్త్రవేత్తలు ఉలిక్కిపడ్డారు.

"అంతరిక్ష నౌక నిర్ధారిత కాలంలో చంద్రతలాన్ని తాకింది. యాత్రికులు అనూష, దీపక్ చంద్రతలం మీద కాలుమోపి భారత జెండాని ఎగరవేశారు. ఆ తరువాత కొంతసేపు చంద్రతలం మీద నడిచారు. హఠాత్తుగా కెమెరాలలో వాళ్ళ ఫోటోలు రావటం ఆగిపోయాయి. వాళ్ళ ఆచూకీ తెలియటం లేదు. నాసా ఆశ వదులుకోకుండా అంతరిక్ష నౌకలో కానీ కెమెరాలలో కానీ అనివార్య కారణాల వలన లోపాలు సంభవించాయా అని పరిశీలిస్తున్నారు. ఈ పరిశీలన పూర్తయ్యేదాకా వ్యోమగాముల సమాచారం గోప్యంగా ఉంచాలని మనవి.

ఇది చదివి అక్కడున్న శాస్త్రవేత్తలు హతాసులయ్యారు. ఈ పరిస్థితులలో ఏం చేయాలో అర్థం కాలేదు వాళ్ళకి.

"ఈ వార్త బహిరంగం చేయకపోయినా మన పై అధికారులకు ఈ విషయం చెప్పటం మంచిది" అన్నాడు ఓ శాస్త్రవేత్త. తక్కిన శాస్త్రవేత్తలు కూడా దీనికి అంగీకరించారు. వెంటనే పై అధికారులకి నాసా సమాచారం అందించారు.

నాసావాళ్ళు చెప్పినట్లుగా ఈ విషయం గోప్యంగా ఉంచమని, వాళ్ళ పరిశోధనా ఫలితాల కోసం ఎదురుచూద్దామని పై అధికారులు శాస్త్రవేత్తలకు చెప్పారు.

★ ★ ★

మసక చీకటిలో మరికొంత దూరం వెళ్ళారు అనూష, దీపక్. ఇంతలో మిణుగురుల లాంటి కాంతి కనిపించింది వాళ్ళకి. వారు ఒకరినొకరు ప్రశ్నార్థకంగా చూసుకున్నారు. గ్రహాంతరవాసులు (Extra terrestrials) ఉన్నారేమో గుహలో అని కంగారు పడ్డారు.

"వెనక్కి వెళ్ళిపోదామా?" అడిగాడు దీపక్.


"వద్దు, ఎలాగూ ఇంత దూరం వచ్చాం గనక ఆ ముందు ఏముందో చూద్దాం" అంది అనూష.

అలసిపోవటం వల్ల నడక జోరు తగ్గింది. కానీ పట్టుదలగా నడిచి చివరికి ఓ సమతల ప్రాంతం చేరారు. ఆ గుహ ఉజ్జాయింపుగా రెండు కిలోమీటర్లు లేదా మూడు వందల అరవై మీటర్ల వెడల్పు, ముప్పయ్ మైళ్ళ లేదా నలభై ఎనిమిది కిలోమీటర్లు ఉన్నట్టనిపించింది వాళ్ళకి. వాళ్ళ శరీరం మీద అకస్మాత్తుగా నీలి రంగు కాంతి వలయాల్లాగా పడసాగింది. ఆ వలయాలు వారి తలని తాకగానే వారికి ఇరువైపులా పెరిగిన చెట్లతో బాటలు కనిపించాయి. ఆ చెట్లు అందమైన పూలతో, రసభరితమైన పండ్లతో ఉన్నట్టనిపించాయి.

దీపక్, అనూష ఆశ్చర్యంగా చూశారు నలువైపులా. కొంచెం దూరం నుంచి మనుషుల లాంటి వాళ్ళు తమవైపు వస్తూ కనిపించారు. వాళ్ళు దూరం నుంచే అనూషా, దీపక్‌ల మీద టార్చిలైటు లాంటి వెలుగు వేశారు. వెంటనే వారికి పరిసరాలు అతి స్పష్టంగా కనిపించసాగాయి. నేలంతా పట్టుకుచ్చులా పెరిగిన పచ్చగడ్డి, పూలచెట్లు ఎంతో అందంగా అనిపించాయి.

"ఆ వచ్చేవాళ్ళని మనం చంద్రవాసులని సంబోధిద్దాం" అన్నాడు దీపక్. ప్రతి చంద్రవాసి ఆరు అడుగుల పొడవు, ధృడమైన శరీరంతో ఆరోగ్యంగా అందంగా ఉన్నారు. మేని ఛాయ వేరువేరుగా ఉన్నా ఎంతో ఆకర్షణీయంగా ఉన్నారు.

అంతరిక్షయాత్రికులని చూసి వాళ్ళు తమ భాషలో ఏదో అన్నారు. ఆ వచ్చిన వాళ్ళల్లో ఒకరు లోని వస్త్రాలు ఉంచుకుని, పైబట్టలు తీసేసుకుని, అలా చేయమని దీపక్, అనూషలకు సైగ చేశారు. అంతరిక్షంలో తమకి అనుకూలమైన వస్త్రధారణలో ఉన్నవారు అవి తీస్తే వాళ్ళకి ఏమైనా హాని కలుగుతుందేమోనని భయపడ్డారు. వారి భయం అర్థం అయినట్టు తన చేతిలో ఉన్న ద్రవంతో నిండి ఉన్న ఓ సీసా వస్త్రాలు తీసేసిన వ్యక్తికి ఇచ్చాడు. ఆ సీసాలోని ద్రవం అతను రాసుకోగానే అతని శరీరం మీద ఓ పలుచని పొర ఏర్పడింది. తర్వాత అతను తిరిగి తన వస్త్రాలను ధరించాడు. ఆ ద్రవం రాసుకుంటే శరీరం మీద రక్షణ కవచంలా ఓ పొర ఏర్పడుతుందని అర్థం అయింది దీపక్, అనూషలకి. వాళ్ళూ అలాగే చేశారు. వాళ్ళ శరీరం చల్లగా, తాజాగా అయినట్టనిపించి, శరీరం మీద పల్చని పొర ఏర్పడిందని అర్థం అయింది. అప్పుడు ఓ చంద్రవాసి వాళ్ళకి వేరే పాదరక్షలు ఇచ్చాడు. ఆ వస్త్రాలు ధరించి తమ కాళ్ళకున్న బూట్లని తీసేసి చంద్రవాసి ఇచ్చిన పాదరక్షలు తొడుక్కున్నారు. ఆ పాదరక్షలు చల్లగా అరటిదొప్పలతో చేసినట్టనిపించాయి. చంద్రవాసుల చేతుల్లో గాజుపలకాల్లాంటివి గమనించారు అనూష, దీపక్. వీళ్ళు ఏం మాట్లాడినా ఆ గాజుపలక ఆ మాటలను అనువదించి చంద్రవాసుల భాషలో వినిపిస్తోంది. స్వరాన్ని గుర్తించి అనువదించే కంప్యూటర్‌లా



అనిపించింది ఆ గాజుపలక.

"వీళ్ళతో మాట్లాడడం ఎలా?" ప్రశ్నించింది అనూష. అనూష మాటలు వాళ్ళకి అర్థం అవగానే ఒక చంద్రవాసి అతని చేతిలో ఉన్న కంప్యూటర్ చూపించి చంద్రగ్రహం బొమ్మ చూపించాడు. ఆ చిత్రాన్ని తాకి, తన వైపు వేలు చూపించాడు చంద్రవాసి. అతడు చంద్రగ్రహం మీద ఉన్న చంద్రవాసి అని చెప్తున్నాడని వాళ్ళకి అర్థం అయింది. మళ్ళీ వాళ్ళకి సౌరమండలం చూపించి సైగ చేసి వాళ్ళు ఏ గ్రహం నుంచి వచ్చారో చూపించమని సైగ చేశాడు చంద్రవాసి.

దీపక్ తన వేళ్ళతో భూగ్రహాన్ని చూపించాడు.

చంద్రవాసులు ఓహో అన్నట్టు చూశారు.

కళ్ళు నిర్మలంగా, కనుపాపలు పెద్దవగా ఉన్నాయి వాళ్ళకి. వెంటనే చంద్రవాసి తన అరచేతిలోని కంప్యూటర్ మీద ఏవో మీటలు నొక్కి దీపక్‌ని మాట్లాడమని సైగ చేశాడు. మేము భూగ్రహం నుంచి రెండున్నర భూమి రోజుల క్రితం బయలుదేరి వచ్చాము. మేము వ్యోమగామి దిగి చంద్రతలం మీద నడుస్తూంటే అకస్మాత్తుగా ఈ గుహ కనిపించింది. మేం కేవలం లోపలి గుహ భాగం చూడడానికి వచ్చాం. మేము శత్రువులం కాదు. మీ స్నేహితులం" అన్నాడు దీపక్ నమ్రతగా. అర్థం అయినట్లు తలఊపి చంద్రవాసులు నవ్వసాగారు.

దీపక్ చేతిలోంచి కంప్యూటర్ తీసుకుని అనూష మాట్లాడసాగింది.

"మేము ఈ గుహ చూసిన తర్వాత మా అంతరిక్ష నౌకలో మా భూమీ్మదకు వెళ్ళిపోతాం. అంతదాకా ఇలాంటిది మాకు కూడా ఇస్తే మీతో సంభాషణ సులువుగా ఉంటుంది" అన్నది.

'సరే' అన్నట్టుగా బొటనవేలు పైకి చూపిస్తూ తన కంప్యూటర్ వెనక్కి తీసుకున్నాడు చంద్రవాసి.

అంతలోనే చిన్న అమ్మాయి రెండు తెల్ల రంగు పువ్వులు తీసుకవచ్చి దీపక్, అనూషలకు ఇచ్చింది. వాళ్ళ స్నేహం మరియు శాంతి కోరుకుంటున్నారని అర్థం అయింది వాళ్ళకి. ఓ చంద్రవాసి తన జేబులోంచి రెండు గాజుపలకల్లాంటి చేతి కంప్యూటర్లు తీసి కొన్ని మీటలు నొక్కి ఒకటి అనూషకి, ఒకటి దీపక్‌కి ఇచ్చాడు.

"ఇక నుంచి మీరు వీటిని చూసి మాట్లాడితే మాకు అర్థం అవుతుంది" అన్న చంద్రవాసి మాటలు, తమ కంప్యూటర్ల ద్వారా అనూష, దీపక్‌కి అర్థమయ్యే భాషలో వినిపించాయి. చీకటి పడుతున్నకొద్దీ గుహలో వెలుగు ఎక్కువ అయింది. అనూష, దీపక్‌లు చూసిన పువ్వులు, పళ్ళు నిజమైనవి కావని అవి సౌరబల్బులని గ్రహించుకుని ఆశ్చర్యపోయారు. ఆ వెలుగులో ఆ ప్రదేశం వల్ల వాళ్ళ శరీరాలు వణకసాగాయి. కళ్ళు మూతలు పడి, పెదవిలారిపోతున్నట్టనిపించాయి. వీళ్ళని తదేకంగా చూస్తున్న ఓ చంద్రవాసి, అన్నమాటలు 'మా వెనుక రండి' అని వినిపించాయి. విప్పిన బట్టలు, సూట్లు, హెల్మెట్లు తీసుకుని చంద్రవాసి వెనుక వాళ్ళిద్దరూ నడిచారు. ఆ చంద్రవాసి వాళ్ళని ఖాళీ గదిలోకి తీసుకుని వెళ్ళాడు. గోడకున్న గడియారం లాంటి పలకం మీద వివిధ మీటలు నొక్కాడు. గోడలోంచి కూర్చోడానికి కుర్చీలు, ఓ బల్ల, ఓ పెద్ద నల్ల కుర్చీ, మంచం పరుపూ దుప్పట్లు, ఓ బీరువా, అద్దం, ఒక పళ్ళెంలో ఫలాలు, నాలుగు టాబ్లెట్లు, 2 చిన్న మంచినీళ్ళ సీసాలు వచ్చి గదిని అలంకరించాయి. ఒక బాత్‌రూం కూడా వచ్చింది. దీపక్, అనూషలు ఆశ్చర్యంతో నోటిని తెరచుకుని వాటిని చూస్తూ నిలబడిపోయారు. గదిలోకి నీలిరంగు కాంతి రావటంతోపాటు గది చల్లబడింది కూడా.

"మీరు కాలకృత్యాలు తీర్చుకోదానికి, కమోడ్ మీద కూర్చుని మీ పని అయ్యాక మీ చేతిమీదున్న కంప్యూటర్‌లో నక్షత్రం బొమ్మ ఉన్న మీట నొక్కితే అదే మిమ్మల్ని శుభ్రపరుస్తుంది" అని వివరంగా చెప్పిన చంద్రవాసి మాటలు విని అనూష కొంచెం సిగ్గుపడింది.

"మాకు సిగ్గు, కోపం, సంతోషం, ప్రేమ లాంటి గుణాలు ఉండవు. ఏది చెప్పాలన్నా కచ్చితంగా చెప్తాము" అన్నాడు చంద్రవాసి సూటిగా.

ఇక మీరు స్నానం చేయాలంటే అక్కడున్న పూలతో ఒళ్ళుని తుడుచుకుంటే శుభ్రపడతారు. వాడుకకి నీళ్ళు ఉండవు ఇక్కడ అన్నాడు చంద్రవాసి. ఈ సంభాషణల్లాగే ముందు జరగబోయే సంభాషణలు కూడా తమ చేతి కంప్యూటర్ల ద్వారా జరపాల్సి ఉంటుందని అనూష, దీపక్‌లకి అర్థం అయింది.

"ఆ పళ్ళు తిని టాబ్లెట్లు వేసుకోండి. నీళ్ళు కొంచమే తాగండి. మా గ్రహం మీద నీళ్ళు చాలా తక్కువగా లభిస్తాయి. మీరు వేసుకున్న టాబ్లెట్లు నాలుగున్నర భూమి రోజులదాకా ఆకలి, దాహం లేకుండా శక్తినిస్తాయి. తరువాత మేం మళ్ళీ మీకు భోజనం, నీళ్ళు ఇస్తాం" అన్నాడు చంద్రవాసి.

"ఆ బీరువా దగ్గర నుంచుంటే అది దానంతట అదే తెరుచుకుంటుంది. అందులో మీకిద్దరికీ చెరో జత బట్టలున్నాయి. కింది అరల్లో మీరు భూ


గ్రహం నుంచి తెచ్చిన వస్తువులు ఉంచుకోండి" అన్నాడు చంద్రవాసి.


"మా బట్టలు బీరువాలో ఉన్నాయా?" ఆశ్చర్యపోతూ అడిగింది అనూష.

"మీరు గుహలోకి అడుగు పెట్టగానే మీ మీద ఓ కాంతి పడింది కదా! అదే సమయంలో మా స్కానర్లు మీ శరీర సౌష్టవం అంతా గుర్తించి ఆ వివరాలు మాకు పంపటం వలన మీకు వస్త్రాలు తయారుచేసి బీరువాలో ఉంచాం" అన్నాడు చంద్రవాసి.

"మీ పేరేమిటి?" అడిగాడు దీపక్.

**-ఇంకా వుంది**






# చంద్రునితో ఒకరోజు


...::: మన్నె సత్యనారాయణ & ప్రియదర్శిని చాగంటి


"మీరు విశ్రాంతి తీసుకోండి. మళ్లీ మనం కలిసినపుడు పరిచయాలు చేసుకుందాం. మరోమాట, చేతిలోని కంప్యూటర్‌ని ఆ బల్ల మీద బోర్లా వుంచండి. అవి నిద్రావస్థకి చేరుకుంటాయి. మళ్లీ వాటిని సరిగ్గా పెట్టినప్పుడు వాడుకోవడానికి తయారుగా వుంటాయి. ఇలా చేయటం వలన వాటి సౌరశక్తి నష్టం కాకుండా వుండి, పదమూడున్నర రోజుల దాకా పనిచేస్తాయి" అన్నాడు చంద్రవాసి.

"సరే, మిమ్మల్ని పిలవాలంటే ఏం చేయాలి?" అడిగింది అనూష.

"గోడ మీదున్న ఈ ఫలకం మీద మొదటి మీట నొక్కితే ఎవరో ఒకరు వెంటనే వస్తాం" అన్నాడు చంద్రవాసి. "ఇక వెళ్తాను" అని తలుపు దగ్గరకు వెళ్లాడు చంద్రవాసి.

తలుపులు తెరుచుకుని చంద్రవాసి బయటికి వెళ్లిపోగానే మళ్లీ మూసుకున్నాయి. ఒకరి వంక ఒకరు చూసుకున్నారు అనూష, దీపక్.

"నేను..." ఏదో చెప్పబోయిన అనూష నోటిని చేతితో మూశాడు దీపక్. ఇద్దరి కంప్యూటర్లను తీసుకుని బల్లమీద బోర్ల పెట్టాడు.

"ఈ కంప్యూటర్లు మన చేతిలో ఉన్నంతసేపు వీటి ద్వారా వాళ్లకి మన మాటలన్నీ వినిపిస్తూ అర్థం అవుతాయి. ఏదైనా ప్రత్యేకంగా మాట్లాడాలనుకుంటే మన కంప్యూటర్లని నిద్రావస్థకి పంపాలి. ఇప్పుడు చెప్పు" అన్నాడు దీపక్.

"నేను చెబితే వినలేదు. అనవసరంగా ఈ గుహలోకి వచ్చి ఎలా ఇరుక్కుపోయామో చూశావా? ఇలా రాకపోతే ఈపాటికి మనం తిరుగు ప్రయాణంలో వుండేవాళ్లం" అంది అనూష.

"అంత భయం దేనికి?" అడిగాడు దీపక్.

**జరిగిన కథ 5**

ఓ టెక్నాలజీ కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్న దీపక్ భార్య అనూష కొంతకాలం లెక్చరర్‌గా ఉద్యోగం చేసి మానేస్తుంది. అమెరికాలో నాసావారు భారత్‌లోని ఇస్రోతో కలిసి చంద్రుని మీదకు పరిశోధనలకోసం మానవసహిత అంతరిక్షనౌకను పంపించేందుకు సన్నాహాలు చేస్తుంటారు. ఈసారి ముగ్గురు సాధారణ పౌరులను ఎంపిక చేసి పంపాలనుకుంటున్న సంగతి తెలుసుకున్న దీపక్, అనూష అందుకు సిద్ధమై అప్లయ్ చేయాలనుకుంటారు. తాము అన్ని పరీక్షలకూ నిల్చి ఎంపికయ్యే వరకూ ఆ సంగతి ఎవరికీ చెప్పవద్దని అనుకుంటారిద్దరూ. కొంత కాలం గడిచాక ఊహించని విధంగా అంతరిక్ష యాత్రకు దీపక్-అనూష ఇద్దరూ ఎంపిక కావడం వారికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వీరిద్దరితోపాటు తమిళనాడుకు చెందిన మరో వ్యక్తి కూడా ఎంపిక అవుతాడు. చంద్రునిపైకి వెళ్లేందుకు ఎంపికైన దీపక్-అనూష అమెరికా పయనమవుతారు.దీపక్-అనూష విజయవంతంగా చంద్రగ్రహం మీద అడుగు పెడతారు. చంద్రునిపై తమకి కనిపించిన గుహలోకి వెళ్ళిన అనూష-దీపక్‌లకు చంద్రవాసులు ఎదురై తమతో వారిని తీసుకెళతారు.

కల్పనా జగత్తులో విహరింపజేసే సైన్స్ ఫిక్షన్

"వీళ్లు మనని తిరిగి భూగ్రహానికి వెళ్లనివ్వక పోతే?" కళ్లనీళ్ల పర్యంతం అయింది అనూష.

"మనల్నిక్కడ వుంచుకుంటే వాళ్లకి ఏం లాభం?" ఎదురుప్రశ్న వేశాడు దీపక్.

"ఇక్కడ వుండటం వలన మనకేమి లాభం?" కళ్లు తుడుచుకుంటూ ప్రశ్నించింది అనూష.

"పైగా మన శాస్త్రవేత్తలకి చెప్పకుండా ఈ గుహలోకి వచ్చాం. ఇలాంటి ప్రవర్తన వల్ల మనకి చాలా పెద్ద గొడవ రావొచ్చు" అంది అనూష నిష్టూరంగా.

"మనం వాళ్ల ఆజ్ఞను ధిక్కరించినట్లు కాదు. అనుకోకుండా ఈ గుహ మనకి తారసపడింది. మన ప్రాణాలని లెక్కచెయ్యకుండా, ఉత్సుకతతో దీనిలోకి వచ్చాం. ఈ గుహ కొంత చూసి వెనక్కి వెళ్లిపోదాం అనుకున్నాను" అన్నాడు దీపక్.

"కాని మనం వెనక్కి వెళ్లలేదు కదా!" అంది అనూష మళ్లీ నిట్టూర్పుగా.

"ఈ గుహలో ఇంత ఆశ్చర్యజనకమైన విషయాలుంటాయని, వీటిని చూస్తూ ఇంత దూరం వస్తామని నేననుకోలేదు."

"అదే నీకు చెప్పేది. అత్యుత్సాహంతో ముందూ వెనకా ఆలోచించకుండా వచ్చాం. మన లూనార్ మాడ్యూల్ చంద్ర ఉపరితలంలో వదిలేసి, ఇక్కడ ఎంతకాలం వుండాలో తెలీదు. చివరికి వీళ్లు మనల్ని వెనక్కు వెళ్లనిస్తారా అన్నదీ సందేహాస్పదమే. ఒకవేళ వెళ్లనిచ్చినా, చంద్ర ఉపరితలం మీద వుండే విపరీత వాతావరణ పరిణామాలకు మన మాడ్యూల్ పాడవకుండా వుంటుందా?" అంది అనూష సందేహంగా.

"మనం చూసిన ఈ అద్భుతాలు మన శాస్త్రవేత్తలకి తెలియజేస్తే మనకి ఎంత ఖ్యాతి వస్తుందో ఆలోచించటం లేదు నువ్వు. అనూషా, మనసు శాంతంగా వుంచుకో. ఆది మంచి అయినప్పుడు, అంతం కూడా మంచే అవుతుంది" అన్నాడు దీపక్, అనూష భుజం తడుతూ.

"ఖ్యాతి మాట పక్కన పెట్టండి. మాడ్యూల్ పాడైతే మనం వెనక్కి ఎలా వెళ్తామో నాకు చెప్పండి" అంది అనూష.

"వెనక్కి వెళ్లకపోతే నష్టం ఏముంది? భూమి మీద మితిమీరిన జనాభా, గతుకుల బాటలు, ఇరుకుల ఇళ్లు, ప్రతిదానికీ పోటీ, రాగద్వేషాలు తప్ప ఇంకేమున్నాయి? ఇక్కడ హాయిగా ఈ అందాలను అనుభవిస్తూ వుండిపోదాం?" అన్నాడు చిలిపిగా దీపక్.

"మీకు నవ్వులాటగానే వుంటుంది. మన ఆచూకీ తెలియక అందరూ ఎంత కంగారుపడుతూ వుంటారో ఆలోచించారా? అంతరిక్ష నౌక ఏం అయిందని రాజకీయవేత్తలు, మన ఆచూకీ కావాలని మనవాళ్లు శాస్త్రవేత్తలని ఎలా వేధిస్తారో వూహించండి."


"ఇక్కడి అత్యుత్తమ శాస్త్ర జ్ఞానాన్ని, వీళ్ల పనితనాన్ని చూశాక కూడ నీకిలాంటి భయాలు కలుగుతున్నాంటే ఆశ్చర్యంగా వుంది" అన్నాడు దీపక్.

"మీకు భయంగా లేదా?" ప్రశ్నించింది అనూష.

"లేదు. నాకు వీళ్ల పరిజ్ఞానం మీద చాలా గురి కుదిరింది. ఒకవేళ మన అంతరిక్ష నౌక పాడైనా, వీళ్లు దానిని బాగుచేస్తారని, బాగుచేయలేకపోతే వేరేది తయారుచేసి మనల్ని భూమికి పంపుతారని నాకు నమ్మకం కుదిరింది"



# భూమి ఎలా ఏర్పడింది?



చంద్రగ్రహం ఎప్పుడు ఏర్పడింది? భూమి ఎప్పుడు ఏర్పడింది? అనేవి పరిశోధనలో భాగం. భూగర్భ శాస్త్రవేత్తలు, రసాయన, భౌతిక శాస్త్ర వేత్తల అంచనా మేరకు, 400 కోట్ల సంవత్సరాల క్రితం ఈ భూమి ఏర్పడిందని భావిస్తున్నారు. అప్పటి నుంచి నాలుగు 'గ్లేసియేషన్స్' భూమి మీద ఏర్పడ్డాయి. గ్లేసియేషన్ అంటే భూమి మొత్తం ఐసు తోను, మంచుతోనూ కప్పబడి వుంటుంది. ఒకో గ్లేసియేషన్ కొన్ని కోట్ల సంవత్సరాలు ఉంటుంది. రెండు గ్లేసియేషన్స్‌కు మధ్య ఒక ఇంటర్ గ్లేసియేషన్ నడుస్తుంది. అంటే, ఐసు ద్రవరూపంలో వుంటుంది. ఈ స్థితి కొన్ని లక్షల సంవత్సరాలు వుంటుంది. ఈ నాలుగు గ్లేసియేషన్స్ తరువాత 'ప్లియోస్టిసిన్' పీరియడ్ ఏర్పడింది. అంటే ఐసు, మంచు కరిగిపోయి, సమవాతావరణం ఏర్పడింది. ఆ స్థితి నుంచి నదులు పుట్టి ప్రవహించాయి. అపారమైన వైవిధ్యంతో వృక్షజాతులు పుట్టాయి. విభిన్న రూపాల్లో జీవరాశులు పుట్టాయి. వీటిలో విశిష్టమైన జీవం బుద్ధిజీవుడైన మనిషి! ఇవన్నీ స్థావర, జంగమాలేన జీవరాశులు! ఇతర జీవులకు నాగరికత లేదు. మనిషికి నాగరికత వుంది. మొదట జంతుస్థాయిలో వున్న మనిషి యొక్క నాగరికత పేలియోలిథిక్ ఏజ్ (పాతరాతియుగం) స్థాయికి చేరింది. అక్కడి నుంచి నియోలిథిక్ ఏజ్ (కొత్త రాతియుగం), మైక్రోలిథిక్ ఏజ్ (సూక్ష్మ, లేదా చిన్న రాతియుగం) చావ్‌కోలిథిక్ ఏజ్‌లుగా పరిణమించింది. అప్పటి నుంచి నేటి అత్యంత ఆధునిక వైజ్ఞానిక యుగానికి మనిషి నాగరికత పరిణామం చెందింది.

అన్నాడు దీపక్ ధైర్యంగా.

కొంచెం సేపు ఇద్దరూ నిశ్శబ్దంగా వుండిపోయారు. ఎవరి ఆలోచనలో వాళ్లున్నారు.

తరువాత దీపక్, అనూషలు కాలకృత్యాలు తీర్చుకుని పళ్లు, టాబ్లెట్లు వేసుకుని కొంచెం నీళ్ల తాగారు. తెలియకుండానే గాఢనిద్రలో తేలిపోయారు.

★ ★ ★

నాసా నుంచి వచ్చిన వార్తని పదే పదే చదువుకున్నారు, భారత దేశంలో కంట్రోల్ సెంటర్ లోని శాస్త్రవేత్తలు.

'ఒక శుభవార్త. మేము ఈ వార్త తెలియపరచడానికి ఎంతో సంతోషిస్తున్నాము. చంద్రతలం మీద లూనార్ మాడ్యూల్‌తో పాటు అంతరిక్ష యాత్రికుల అడుగుజాడలు కనిపించాయి. కాని ఆ అడుగుజాడలు కొంతదూరం వరకే కనిపిస్తున్నాయి. ఆ తరువాత అంతరిక్ష యాత్రికుల ఉనికిని తెలిపే ఏ విధమైన సంకేతాలు ఇప్పటివరకు కనిపించలేదు. రెండు రోజులుగా శాస్త్రవేత్తలు పరిశోధన జరపగా, ఈ మాత్రం వివరాలు సేకరించడం వీలయింది. నాసా శాస్త్రవేత్తలు అంతరిక్ష యాత్రికుల సమాచారం కోసం నిరంతరం కృషి చేస్తూనే వున్నారు. ఏ కొత్త సమాచారం అందినా మీకు తెలియజేస్తాం.'

ఈ సమాచారం చదువుకుని సంతోషపడాలో, అదుర్దాపడాలో తెలియలేదు భారత శాస్త్రవేత్తలకు.


అంతరిక్ష యాత్రికులు చంద్రుడి మీద దిగారు అన్నది విజయ సంకేతం. కాని ఆ తరువాత వారి ఉనికి గురించి సమాచారం లేదు. పై అధికారులకు ఈ సమాచారం అందించాలనుకుని వారిని సంప్రదించారు శాస్త్రవేత్తలు.

"లూనార్ మాడ్యూల్ చంద్రుడి మీద క్షేమంగా చేరిందన్న సమాచారం పాత్రికేయులకి అందజేయండి. అంతరిక్ష యాత్రికుల గురించి ఇప్పుడిప్పుడే ఏం చెప్పవద్దు" అని సమాచారమిచ్చారు పై అధికారులు.

పాత్రికేయులు ఎన్నిరకాల ప్రశ్నలు వేస్తారో శాస్త్రజ్ఞులకి తెలిసిన విషయమే. వారి నుంచి అంతరిక్ష యాత్రికుల సమాచారం దాచటం కష్టతరమే. ఇప్పటికే దీపక్, అనూషల అయిన వాళ్లు ఫోన్లు చేసి వారి యోగక్షేమాలు అడుగుతూనే వున్నారు. ఎన్ని రోజులని ఈ నిజాన్ని దాచాలో శాస్త్రజ్ఞులకు బోధపడలేదు. ఏం చేయాలో తెలియని అయోమయంలో వున్నారు భూమి మీది శాస్త్రజ్ఞులు.

★ ★ ★

అనూష కంటే ముందే లేచాడు దీపక్.



## ఇది విన్నారా?



★ ఆస్ట్రేలియాలో భూకంపాలు సంభవించవు.



★ వెయ్యి స్తంభాల గుడిని పన్నెండో శతాబ్దంలో కట్టారు.

కొంతసేపటిదాక తనెక్కడ వున్నది బోధపడలేదు. గాఢనిద్రలో వున్న అనూషని చూశాక వాళ్లిద్దరూ చంద్ర గ్రహం మీద ఒక గుహలో వున్నట్లు, క్రమేపీ అన్ని విషయాలు గుర్తుకు రాసాగాయి. లేచి నిలుచుని కాళ్లు చేతులు సాగదీసి, ఒళ్లు విరుచుకున్నాడు దీపక్. తన కంప్యూటర్‌ని బల్లమీద నుంచి తీసి చేత్తో పట్టుకున్నాడు.

ఎంత బడలికగా వుందో, కాళ్లూ చేతులూ నొప్పులుగా వున్నాయి. నడుము కూడ పట్టేసినట్లుంది. తల బరువుగా వుంది అనుకున్నాడు దీపక్.

"అలా నొప్పులుగా వుంటే ఆ పెద్ద నల్ల కుర్చీ మీద కూర్చోండి. అది మీకు ఉపచారం చేస్తుంది" అని కంప్యూటర్ నుంచి వినిపించింది. ఆనందాశ్చర్యాలతో పాటు వెళ్లి కుర్చీలో కూర్చున్నాడు దీపక్. వెంటనే అది కాళ్లు, చేతులు, నడుముని పట్టసాగింది. తలను సున్నితంగా మర్దన చేసింది. ఎంతో హాయిగా అనిపించింది దీపక్‌కి. అయిదు నిమిషాలు ఓ క్షణంలా గడిచిపోయింది.

"ఇక లేవండి, బాత్రూంలోకి వెళ్లేముందు గోడ మీద ఫలకంలో రెండో మీట నొక్కండి" అంది కంప్యూటర్.

ఈ గదిలోకి వచ్చేముందు చంద్రవాసి కంప్యూటర్‌లలో మీటలు నొక్కి, వారి భాషను అనూష, దీపక్‌ల భాషలోకి అనువదింపబడేలా చేశాడు. అందువల్ల అన్నీ వాళ్లకి అర్థం అవుతున్నాయి. 'ఆ చంద్రవాసికి ధన్యవాదాలు చెప్పాలి' అనుకుంటూ రెండవ మీట నొక్కి బాత్రూంలోకి వెళ్లాడు దీపక్. గోడ నుంచి ఓ మరచెయ్యి పేస్ట్ పెట్టి వున్న ఓ టూత్‌బ్రష్‌తో కనిపించింది. అది తీసుకుందామని దగ్గరికి వెళ్లగానే దానంతటదే నోటిదాక వచ్చింది. అప్రయత్నంగా నోరు తెరిచాడు దీపక్. మరచెయ్యి బ్రష్‌ని దీపక్ నోటిలోకి పెట్టి, సున్నితంగా పళ్లు తోమింది. బ్రష్ నుంచి నోటిలోకి నీళ్లు చిమ్మాయి. పళ్లని నీటితో కడిగాక బ్రష్ మళ్లీ ఆ నీటిని పీల్చేసింది. మరో చెయ్యి పువ్వులా వున్న సువాసనభరితమైన తువ్వాలుతో ముఖం శుభ్రం చేసింది. ఇంకో మరచెయ్యి (ఎలక్ట్రిక్ షేవర్) లాంటి దానితో గెడ్డం గీసింది. ఓ దువ్వెనతో, తల దువ్వింది. తరువాత ఆ మరచేతులన్నీ గోడలోకి వెళ్లిపోయాయి.

దీపక్ కాలకృత్యాలు తీర్చుకుని బీరువా దగ్గర నిలుచున్నాడు. బీరువా తెరుచుకుని తన బట్టలున్న అర బయటికి వచ్చింది. దీపక్ బట్టలు మార్చుకున్నాడు.

"విప్పిన బట్టలు శుభ్రపరచడానికి మూడవ మీట నొక్కండి" అంది కంప్యూటర్. అలా చేయగానే ఓ బుట్ట లాంటిది గోడలోంచి వచ్చింది. అందులో బట్టలు వేయగానే గోడలోకి వెళ్లిపోయింది. కొద్ది క్షణాల్లో ఉతకబడి, ఇస్త్రీ అయిన బట్టలు ఓ ట్రేలో బయటికి వచ్చాయి. దీపక్ ఆ బట్టలను బీరువాలో భద్రపరిచాడు. పనులన్నీ ఎంత సులువుగా, కేవలం మీటలు నొక్కడం వలన అయిపోయాయి అని ఆశ్చర్యపడ్డాడు దీపక్.

బల్ల దగ్గరున్న కుర్చీలో కూర్చున్నాడు దీపక్. బల్లని తాకగానే ఓ చిన్న కప్పులో బాదం పప్పు లాంటి పప్పులు, ఒక పళ్లెంలో తనెప్పుడూ చూడని కొత్తరకం పళ్లూ, రెండు బిస్కెట్లు లాంటివి, ఒక కప్పులో నల్లని కాఫీ లాంటి వేడి ద్రవం వచ్చాయి.

"అవి తిని, ఆ ద్రవం తాగండి" అంది



కంప్యూటర్.

ఆ పప్పులు, బిస్కెట్ల లాంటివి దీపక్‌కి చాలా నచ్చాయి. కొత్త రకం ఫ్రూట్ లేతగు లాబీ రంగులో తియ్యగా, కొంచెం పుల్లగా నోటికి చాలా రుచిగా అనిపించింది. నల్లని ద్రవం వేడిగా కాఫీ లాగే వుంది కాని, అది కాఫీ కాదు. అవి తిన్నాక మనసు ఆహ్లాదక రంగా, శరీరం తాజాగా, ఎంతో శక్తి వచ్చిన ట్లనిపించింది దీపక్‌కి. ఏదో తెలియని ప్రశాం తత ఆవరించింది. చిరునవ్వుతో గాఢనిద్రలో వున్న అనూషని లేపడానికి కదిలాడు.

"నిద్రలోంచి లేపకూడదు. ఆమెని పడుకో నివ్వండి" అని వారించింది కంప్యూటర్.

బయటికి ఒంటరిగా వెళ్లాలంటే అనూష లేచి కంగారు పడుతుందనిపించింది దీపక్‌కి. కానీ ఏమీ తోచలేదు అతనికి.

"భూమ్మీద అయితే వార్తాపత్రిక చద వచ్చు. కాని ఇక్కడ అదేమీ లేదు" ఇంకా దీపక్ మాట పూర్తి కాకుండానే కంప్యూటర్ నుంచి వార్తలు వినిపించాయి.

'మన చంద్ర గ్రహం నుంచి 240000 మైళ్ల దూరంలో వున్న భూగ్రహం మీద శాస్త్రవే త్తలు ఓ అంతరిక్ష నౌకని మన గ్రహం పైకి పంపారు. దానిలో ఓ ఆడ, ఓ మగ వ్యక్తులను పంపారు. వారి పేర్లు అనూష, దీపక్. భూమి మీద శాస్త్రవేత్తలకు మాడ్యూల్ కనిపిస్తోంది కాని హఠాత్తుగా ఇద్దరూ కనిపించడం లేదు. ఆ జంట ఎలా మాయమయ్యారని అక్కడ ఆందోళనలు జరుగుతున్నాయి.'

ఇది విన్న దీపక్ ఉలిక్కిపడ్డాడు. వాళ్ల వివ రాలన్నీ ఇక్కడవాళ్లకి తెలుసునన్నమాట. ఇది ఎలా సంభవమని ఆలోచించసాగాడు.

"చంద్ర గ్రహంలో గుహలో జీవన ప్రాంతానికి ఓ జంట వచ్చారు. కాని భూగ్రహం మీద శాస్త్రవేత్తలకి ఈ విషయం తెలియక, వీరి ఆచూకీ కోసం కృషి చేస్తు న్నారు."

అనూష అనుమానం నిజం అయింది అనుకున్నాడు దీపక్. మళ్లీ వార్తలు వినసా గాడు.


"వచ్చిన అతిథులకు చంద్రవాసులు స్వాగతం పలికారు. మంచి ఆతిథ్యమిచ్చారు. కొద్ది సమయం క్రితం ఒక వృద్ధ చంద్రవాసి జీవనం ముగించారు. వారికి ఇంకొద్ది సేపట్లో చంద్రవాసులు ముక్తిని ప్రసాదిస్తారు."

ముక్తిని ప్రసాదించమంటే ఏం చేస్తారో చూడాలి అనుకున్నాడు దీపక్ వార్తలు వింటూ.

"వాతావరణ హెచ్చరిక... చంద్ర ఉపరిత లంలో ఉష్ణోగ్రతలు మైనస్ 200 డిగ్రీల సెంటి గ్రేడ్ కన్నా తక్కువయ్యే సూచనలున్నాయి. అందుకని చంద్రవాసులందరూ గుహలోనే వుండాలని, ఉపరితలం పైకి రావద్దని హెచ్చ రిక."

'మైనస్ 200 సెంటిగ్రేడ్ అంటే కరుడు గట్టే చలి' అనుకున్నాడు దీపక్.

"ఇంక మిగిలిన వార్తలు... ఓ గర్భిణి గర్భంలో శిశువుకి జన్యు (జెనెటిక్) లోపాలు న్నాయని, వైద్యులు తెలుసుకుని శాస్త్రవేత్తల సహాయంతో జన్యు మార్పిడి చేశారు. ఇప్పుడు ఆ శిశువు ఆరోగ్యంగా పెరుగుతోం దని సూచించారు. త్వరలో సర్వ గుణ సంప న్నమైన మరో జీవి చంద్రలోకం రాబోతున్నం దుకు చంద్రవాసులు హర్షం ప్రకటించారు."




## ఇది విన్నారా?



★ ఇదొక సూపర్ డాగ్. అది వెనక్కి నడవగలదు. ఆగకుండా గుండ్రంగా తిరగ్గలదు. వెనకాళ్ళపై చాలా బ్యాలెన్స్‌డ్‌గా నిలబడు తుంది. వెనక్కి పాకగలదు. యజమాని సంజ్ఞల ప్రకారం అన్ని ఫీట్స్ చేయగలదు. దీని యజమాని యు.కె.లోని 'స్మర్ఫ్ పారా హంఫ్రె'.



★ వికీపీడియాను రూపొందించిన వారు 'జిమ్మి వెల్స్'.

'భూమి మీద శాస్త్రవేత్తలకు తమ క్షేమ సమాచారాలు వెంటనే తెలియజేయాలి. కాని ఎలా?' అనుకున్నాడు దీపక్.

వెంటనే వార్తలు ఆగిపోయాయి.

"ఇప్పుడే సాధ్యం కాదు" అంది కంప్యూటర్. కొద్దిసేపట్లో మిణుకు మిణుకుమంటూ ఎర్ర కాంతి వెలిగి కంప్యూటర్ ఆగిపోయింది.

గోడ మీద ఫలకంలో ఒకటవ మీట మీద నొక్కాడు దీపక్. మరుక్షణంలో గది తలుపులు తెరుచుకొని ఓ చంద్రవాసి వచ్చాడు. తన కంప్యూటర్ చార్జింగ్ అయిపోయి పనిచేయడం లేదని సైగల ద్వారా దీపక్ చంద్రవాసికి సూచించాడు. అతడు దీపక్ కంప్యూటర్ని బయటికి తీసుకుని వెళ్లి కొత్తదాన్ని తీసుకొచ్చి దీపక్‌కి ఇచ్చాడు.

'భూగ్రహానికి తమ క్షేమం గురించి సమాచారం పంపాలని' చంద్రవాసికి చెప్పాడు దీపక్.

"మీ గ్రహానికి అప్పుడే సమాచారం పంపనివ్వం. మీ గురించి అంతా వివరంగా తెలుసుకునేదాకా అది కుదరదు" అన్నాడు చంద్రవాసి నిక్కచ్చిగా.

"మాకు మీ గ్రహం గురించి తెలుసుకోవాలని వుంది" అన్నాడు దీపక్.

"దేని గురించి?" అడిగాడు చంద్రవాసి.

"ప్రతిదాని గురించి" అన్నాడు దీపక్.

మా మాటల సవ్వడికి అనూష నిద్రలో కదిలింది. వెంటనే చంద్రవాసి గోడ మీద ఫలకం మీద 4వ మీట నొక్కాడు. నేలను చీల్చుకుని ఓ గాజు ఫలకం వారికి, అనూషకి మధ్య నిలిచింది.

"ఇది దేనికి?" ఆశ్చర్యంగా అడిగాడు దీపక్.

"మా గ్రహం మీద స్త్రీలను మాతృ మూర్తులుగా గౌరవిస్తారు. వారు లేకపోతే మా మనుగడే వుండదని మా నమ్మకం. అందుకని స్త్రీలని చాలా అపురూపంగా చూసుకుంటాం. వారికేవిధమైన ఇబ్బంది కలగకుండా కాపాడుకుంటాం. అనూషకి నిద్రాభంగం కలగకుండా ఆ గాజు గోడని అడ్డుపెట్టాను. ఇక ఆవిడకి మన మాటలు వినబడవు. ప్రశాంతంగా నిద్రపోతారు" అన్నాడు చంద్రవాసి, స్త్రీల పట్ల వాళ్లకున్న అపార గౌరవంతో.

"ఆ కుర్చీలో కూర్చోండి. తరువాత మీ ఇళ్ల గురించి చెప్పండి" అన్నాడు దీపక్.

"గుహలో, స్వయంచాలక కాల్పనిక పర్యావరణం (కేవ్ ఆటోమేటిక్ వర్చ్యువల్ ఎన్విరాన్‌మెంట్) మీద మా ఇళ్లు ఆధారపడి వుంటాయి. అంటే మీరు చూస్తున్నదంతా కృత్రిమ ప్రకృతి (వర్చ్యువల్ రియాలిటీ). దీన్ని సాఫ్ట్‌వేర్ ద్వారా రూపొందిస్తారు. ఇది మీలాంటి వాళ్లకి నిజమైన ప్రకృతిలా అనిపిస్తుంది. ఎప్పుడైతే మీరు అధునాతన పరికరాలను వాడతారో! మేము ఇలాంటివి మీకిచ్చిన బట్టల్లో లేపనంలా అమర్చాము. కాని ఇవి కొంతసేపే పనిచేస్తాయి. ఇప్పుడు బయటకు వెడితే, మీరు అధునాతన కళ్లజోళ్లు, హెల్మెట్లు ధరిస్తే తప్ప, ఈ కృత్రిమ ప్రకృతిని చూడలేరు. ఇవి మేము మీకు సమకూరుస్తాము" అన్నాడు చంద్రవాసి.

"కృత్రిమ ప్రకృతిలో ఇంత అధునాతనంగా తయరు చేశారంటే మిమ్మల్ని అభినందించాల్సిందే!" అన్నాడు దీపక్. "మేము కూడా మా భూగ్రహం మీద కృత్రిమ ప్రకృతి (వర్చ్యువల్ రియాలిటీ), కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) గురించి ప్రయోగాలు చేస్తున్నాం. కాని ఇంత అధునాతనంగా ఇంకా చెయ్యలేదు" అని వివరించాడు.

"ఇంతకీ మీ పేరేమిటి? పేరు తెలియక 'చంద్రవాసి' అని మేమిద్దరం సంబోధిస్తున్నాం" అన్నాడు దీపక్ నవ్వుతూ.

"మీ పేర్లు అనూష, దీపక్ అని మాకు తెలుసు. మమ్మల్ని 'చంద్రవాసి' అని పిలుచుకోండి. మా పేర్లు ప్రస్తుతానికి అప్రస్తుతం" అన్నాడు అతను నవ్వుతూ.

"మీరు పేర్లు చెప్పడానికి ఎందుకు ఇష్టపడరు?" అని ప్రశ్నించాడు దీపక్.

"ఎందుకు ఇష్టపడం అంటే, ఇదంతా కృత్రిమ ప్రకృతి కాబట్టి" అన్నాడతను చిరునవ్వుతో.

"ఆమె నిద్ర నుంచి మేల్కొన్నాక ఈ మీట నొక్కండి. గాజు ఫలకం నేలలోకి వెళ్లిపోతుంది. మీరిద్దరూ బయటకు రావడానికి తయారుగా వున్నప్పుడు ఆరవ మీట నొక్కండి" అంటూ చంద్రవాసి, తలుపు దగ్గరకి చేరగానే అది తెరుచుకుంది. అతను బయటకు వెళ్లగానే తలుపు మూసుకుంది.

దీపక్‌కి అంతా అయోమయంగా అనిపించింది. 'కృత్రిమ ప్రకృతి, కృత్రిమ మేధస్సులను చంద్ర గ్రహం మీద ఇంతలా ఉపయోగిస్తున్నారంటే...'

చాలా ఆశ్చర్యపడ్డాడు దీపక్.

'భూమ్మీద, వేరే గ్రహాల నుంచి (ఎక్స్‌ట్రా టెర్రెస్ట్రియల్) వచ్చినవాళ్లను అతి వికారంగా ఊహించేవాళ్లు. కాని చంద్రవాసులు అధునాతనంగా, పొడవుగా, తెలివిగా, స్నేహశీలురుగా, ప్రశాంత జీవనానికి ప్రతీకలుగా వున్నారు.'


ఈ ఆలోచనలో మునిగి వున్న దీపక్, అనూష నిద్ర నుంచి మేల్కోవడం గమనించలేదు.

ఆమె గాజు గోడ మీద చేతితో తట్టసాగింది. కాని ఆ శబ్దం దీపక్‌కి వినపడలేదు. కాసేపటికి అటు చూసిన దీపక్, గోడ మీద ఫలకంలో ఐదవ మీట నొక్కాడు. గాజుగోడ నేలలోకి వెళ్లిపోయింది.

అనూష పరుగున వచ్చి దీపక్‌ని కౌగిలించుకుంది.

-ఇంకా వుంది






...::: మన్నె సత్యనారాయణ & ప్రియదర్శిని చాగంటి

"నన్ను చంద్రవాసులు బంధించారనుకున్నాను" అంది అనూష భయంగా.

దీపక్ తన చేతి మీద కంప్యూటర్‌ని బల్లమీద బోర్లాపెట్టాడు.

"ప్రతీదానికి కంగారుపడితే ఎలా అనూషా? వాళ్ళు స్నేహప్రియులని, శాంతిదూతలని మనకి తెలిసిందే కదా! ఇంతవరకూ మన గురించి ఏ హాని తలపెట్టలేదు. పైగా మనల్ని గౌరవంగా చూసుకుంటున్నారు" మందలించాడు దీపక్.

"మరి ఆ గాజు గోడ ఎందుకు పెట్టారు?" అడిగింది అనూష.

"నేను, చంద్రవాసి కొంతసేపు మాట్లాడుకున్నాము. చంద్రవాసులకి స్త్రీల మీద అపారమైన గౌరవం ఉంది. నీకు మా మాటల శబ్దం వలన నిద్రాభంగం కాకూడదని ఆ గాజు గోడ పెట్టాడు" అన్నాడు దీపక్.

"అవును ఇలాంటి గాజు ఫలకాలు ధ్వనిని నివారిస్తాయి. భూమి మీద మన పరిశోధనశాల కిటికీలని ఇలాంటి గాజు ఫలకాలతోనే చేశారు" అంది అనూష.

"అన్నీ తెలిసి కూడా ప్రతీ విషయానికి అనుమానపడడం, భయపడడం తగదు" కొంచెం చికాకుగా అన్నాడు దీపక్.

"అది సరేగానీ, ఇంతకీ చంద్రవాసితో ఏం మాట్లాడారు?" అడిగింది అనూష.

"నేను నిద్ర లేచినప్పటి నుంచి జరిగిన విషయాలు అన్నీ వివరంగా చెబుతాను. శ్రద్ధగా విను" అని మొదటినుంచీ అన్ని విషయాలు వివరంగా అనూషకి చెప్పాడు దీపక్. విషయం తెలుసుకుని అనూష చాలా ఆశ్చర్యపడింది.

**జరిగిన కథ 6**

ఓ టెక్నాలజీ కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్న దీపక్ భార్య అనూష కొంతకాలం లెక్చరర్‌గా ఉద్యోగం చేసి మానేస్తుంది. అమెరికాలో నాసావారు భారత్‌లోని ఇస్రోతో కలిసి చంద్రుని మీదకు పరిశోధనలకోసం మానవసహిత అంతరిక్షనౌకను పంపించేందుకు సన్నాహాలు చేస్తుంటారు. ఈసారి ముగ్గురు సాధారణ పౌరులను ఎంపిక చేసి పంపాలనుకుంటున్న సంగతి తెలుసుకున్న దీపక్, అనూష అందుకు సిద్ధమై అప్లయ్ చేయాలనుకుంటారు. తాము అన్ని పరీక్షలకూ నిల్చి ఎంపికయ్యే వరకూ ఆ సంగతి ఎవరికీ చెప్పవద్దని అనుకుంటారిద్దరూ. అంతరిక్ష యాత్రకు దీపక్-అనూష ఎంపిక కావడం వారికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వీరితోపాటు తమిళనాడుకు చెందిన మరో వ్యక్తి కూడా ఎంపిక అవుతాడు. చంద్రునిపైకి వెళ్లేందుకు ఎంపికైన దీపక్-అనూష అమెరికా పయనమవుతారు.దీపక్-అనూష విజయవంతంగా చంద్రగ్రహం మీద అడుగు పెడతారు. చంద్రునిపై తమకి కనిపించిన గుహలోకి వెళ్ళిన అనూష-దీపక్‌లకు చంద్రవాసులు ఎదురై తమతో వారిని తీసుకెళతారు. భూమ్మీది మనుషులకంటే చంద్రవాసులు సృష్టించిన కృత్రిమ ప్రకృతి శోభను చూసి ఆశ్చర్యపోతారు దీపక్-అనూష.

**కల్పనా జగత్తులో విహరింపజేసే సైన్స్ ఫిక్షన్**

"గ్రహాంతర వాసులు (ఎక్స్‌ట్రా టెర్రెస్ట్రియల్స్) ఇంత తెలివిగా, భూమి మీద వారికంటే కొన్ని రెట్లు ముందంజగా ఉన్నారు. వీరి గురించి మనం ఎంత తక్కువగా ఊహించాం?" అంది అనూష.

"అందుకే ఇంక వీళ్ళ పరిజ్ఞానం నుంచి మనం నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి. అందుకని అవి నేర్చుకుని మన శాస్త్రజ్ఞానాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిద్దాం" అన్నాడు దీపక్.

"నిజమే! మనకు మళ్ళీ ఇలాంటి అవకాశం దొరకదు" అంది అనూష.

దీపక్ చెప్పిన ప్రకారం గోడమీద ఫలకంలో వివిధ మీటలు నొక్కి, అనూష కూడా తయారైంది.

గోడమీద ఫలకంలో ఆరవ మీట నొక్కి, వాళ్ళు తలుపు దగ్గరికి వెళ్ళారు. తలుపు తెరచుకోగానే వాళ్ళు బయటికి అడుగుపెట్టారు. ఒక చంద్రవాసి వాళ్ళకోసం వేచి ఉన్నాడు.

"ఈ హెల్మెట్లు, కళ్ళజోడులు పెట్టుకుని నా వెంటరండి" అన్నాడు చంద్రవాసి.

అవి పెట్టుకుని, చంద్రవాసి వెంట నడవసాగారు వారిద్దరూ. కళ్ళజోడులోంచి చూస్తే, బాటలకిరువైపులా విరగబూసిన పూలచెట్లు, ఎంతో అందంగా అనిపించాయి వాళ్ళకి. అక్కడక్కడ బహుళ అంతస్తుల భవనాలు కనిపించాయి. ప్రతీ భవనం చుట్టూ పచ్చనిచెట్లు, పూలు, పళ్ళు విరగకాచి ఉన్నాయి. పరిసరాలు చాలా శుభ్రంగా ఉన్నాయి. నేల నున్నగా, గతుకులు లేకుండా, బాటలు వెడల్పుగా ఉన్నాయి. బాటలకిరువైపులా దీపస్తంభాలు ఉన్నాయి. ఆ దీపాలు వెలుగులు చిమ్ముతూ ఆ ప్రదేశాన్నంతా ప్రకాశవంతం చేస్తున్నాయి. కొంత దూరంలో ఒక కొలను కనిపించింది. నీలినీళ్ళల్లో తెల్లని రాజహంసల లాంటివి ప్రశాంతంగా ఈదుతున్నాయి. కొలనులో కమలాల్లాంటి పూలు రంగురంగులవి వికసించి ఉన్నాయి. దీపక్, అనూష కొలను దగ్గర నుంచుని చూడసాగారు. తుమ్మెదల్లాంటివి ఆ పూలమీద ఎగురుతున్నాయి. చెట్లల్లో పక్షులు కిచకిచలాడుతున్నాయి. కొలనులోని నీరు స్వచ్ఛంగా, గాజుఫలకంలా మిలమిలలాడుతోంది. రంగురంగుల చేపలు నీళ్ళల్లో ఈదుతున్నాయి. ఆ దృశ్యం ఎంతో మనోహరంగా అనిపించింది వాళ్ళకి.

"ఇక వెళదామా?" అన్నాడు చంద్రవాసి నవ్వుతూ. ముగ్గురూ ముందుకి నడవసాగారు.


కొంచెం ఎత్తుమీద సౌరఫలకాలు లాంటివి కనిపించాయి దీపక్, అనూషలకి. వాటికి పైన చంద్ర ఉపరితలంలో ఒక రంధ్రం కనిపించింది.

"అవేమిటి?" వాటి వైపు చెయ్యి చూపిస్తూ అడిగింది అనూష.


"ఇక్కడ ప్రతీదీ సౌరశక్తితోనే పని చేస్తుంది. సూర్యరశ్మి, ఆ రంధ్రం ద్వారా ప్రసరించి, ఆ ఫలకాలను తాకితే సౌరశక్తి ఉత్పన్నమవుతుంది. అప్పుడు మేము అన్ని వస్తువులనూ ఆ ఫలకాలకి అనుసంధానం చేసి, వాటిని సౌరశక్తితో శక్తివంతం చేసి, మా అవసరాలకి వాడుకుంటాం" అన్నాడు చంద్రవాసి.

"ఆ రంధ్రంలోంచి వచ్చే సూర్యరశ్మి సరిపోతుందా?" అడిగాడు దీపక్.

"పగటి ఉష్ణోగ్రతలు తీక్షణంగా 273 డిగ్రీల ఫారిన్‌హీట్ లేదా 134 డిగ్రీల సెల్సియస్ ఉంటుందని మీకు తెలిసిన విషయమే. అంత తీక్షణతతో ఆ రంధ్రంలోంచి వచ్చే సూర్యరశ్మి వీటిని ఉత్తేజపరచడానికి సరిపోతుంది"



# చంద్రునికి మరోవైపు...!



భూమి మీద ఏ విధమైన భౌతిక, వాతావరణ మార్పులు జరిగాయో, అలాంటి మార్పులే చంద్రగ్రహం మీదకానీ అంగారకుని మీద గానీ ఇతర గ్రహాల్లోకానీ జరిగాయా అనేది తెలుసుకోవడానికి శాస్త్రజ్ఞులు పరిశోధిస్తున్నారు. ఇందుకోసం ముందుగా చంద్రగ్రహం, అంగారకగ్రహాలను ఎంచుకున్నారు. ఈ విషయంలో అమెరికా వారి 'నాసా', రష్యా, భారత అంతరిక్ష పరిశోధక సంస్థ ఇస్రో, కొంతమేరకు ఫ్రాన్స్, చైనాలు పరిశోధనలు చేస్తున్నాయి. నాసావారు ఇప్పటికే చాలా ప్రయోజనకరమైన ప్రయోగాలు చేశారు.

చంద్రగ్రహం మీదకు యంత్రవాహనాలను, మనుషులను పంపి పరిశోధించారు. చంద్రశిలలను, అక్కడి మట్టిని తెప్పించారు. ఇప్పుడు అంగారకుని మీద పరిశోధనలు చేస్తున్నారు. మన భారత ఇస్రో ఇటీవల కాలంలో అంతరిక్ష పరిశోధనలో అద్భుతమైన ఫలితాలను సాధించింది. చంద్రగ్రహం మీదకు మనిషిని పంపాలనే లక్ష్యాన్ని నిర్ణయించుకుంది. ఆ లక్ష్యానికి సంబంధించిన సాహసప్రయోగాలే చంద్రయాన్-1, చంద్రయాన్-2! ఇప్పటివరకూ చంద్రునిపై ఒక వైపునే అందరూ చూస్తున్నారు. అక్కడే పరిశోధనలు జరుపుతున్నారు. ఎందుకంటే భూమిమీదకు ఆ భాగం మాత్రమే ఎప్పుడూ కనిపిస్తుంది. ఇప్పుడు ఇస్రో వారు స్పేస్‌క్రాఫ్ట్‌లో పంపిన 'లాండర్' 'రోవర్' చంద్రుని ఆవలి భాగం (రియర్ సైడ్) మీద జరుగుతాయి. ఇది అత్యంత సంక్లిష్టమైన అమితప్రయోజనకరమైన ప్రయత్నం. గతంలో చైనావారు ఇలాంటి ప్రయత్నాన్నే చేశారు. అది సాధ్యపడలేదు. గతంలోని అన్ని అనుభవాలనూ పరిగణనలోకి తీసుకుని, ఇస్రో ఇప్పుడు ఈ ప్రయత్నాన్నీ పరిశోధనలను జరుపుతున్నది.

చంద్రుని ఆవలవైపు నుంచి ఇస్రో రోవర్, ఇతర సాధనాల ద్వారా సేకరించగలిగే సమాచారం భారత అంతరిక్ష పరిజ్ఞానానికే కాక, ప్రపంచ అంతరిక్ష పరిశోధనకీ ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

ఇంత మంచి నేపథ్యంలో ఈ నవలను మనం చదువుకుంటున్నాం. చదువుకుంటూ ఇస్రో డైరెక్టరు డా.శివన్‌గారికి వారి సహచర శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలియచేద్దాం.

అన్నాడు చంద్రవాసి.

"కానీ ఇప్పుడు అక్కడ ఏమీ లేవుగా?" అన్నాడు దీపక్.

"ఇప్పుడు రాత్రి కదా! అందుకని శక్తిహీనం అయిన కంప్యూటర్లని, ఇతర వస్తువులని, వేరే చోట నిలువ ఉంచుతాము. ఎండ పొడ చంద్ర ఉపరితలం నుంచి రంధ్రం ద్వారా రాగానే, వాటిని తీసుకుని వచ్చి శక్తివంతం కావడానికి ఆ సౌరఫలకాల కింద ఉంచి ఆ ఫలకాలతో అనుసంధానం చేస్తాము" అన్నాడు చంద్రవాసి. అప్పటికే చాలాదూరం నడవడం వల్ల అనూషకి అలసటగా అనిపించింది.

"మీరు ఆ పందిరి కింద కూర్చుని సేద తీర్చుకోండి" అన్నాడు అనూషని గమనించిన చంద్రవాసి.

"మీరూ రండి" అన్నాడు దీపక్.

"మేము అలసిపోము. మీ అలసట తీరేసరికి, మళ్ళీ వస్తాను" అంటూ ఎటో వెళ్ళిపోయాడు చంద్రవాసి.

అనూష, దీపక్‌లు పందిరి కింద ఉన్న గట్టుమీద కూర్చున్నారు.

పందిరి నిండా పరిమళభరితమైన పూలతీగలు అల్లుకుని ఉన్నాయి. వాళ్ళు కూర్చున్న గట్టు పాలరాతిలా చల్లగా ఉంది.

"ఇక్కడ ఎంత బావుందో కదూ" అన్నాడు దీపక్.

"చాలా బావుంది. ఏదైనా పళ్ళరసం తాగాలని ఉంది" అంది అనూష.

"ఇప్పుడే అమరుస్తాము" అని అనూష చేతిలోని కంప్యూటర్‌లో నుంచి మాటలు వినబడ్డాయి.

"ధన్యవాదాలు" అంది అనూష.

రెండు పొడవాటి గ్లాసులలో దానిమ్మ రసం లాంటి పళ్ళరసాన్ని తీసుకుని ఒక మరమనిషి (రోబో) ప్రత్యక్షమయ్యాడు.

వాళ్ళు ఆ రసం తీసుకుని రుచి చూశారు. అద్భుతంగా అనిపించింది. చల్లటి పళ్ళరసం గొంతు జారుతుంటే వాళ్ళ అలసట మాయం అయింది. ఆ రసంలో చక్కెర రుచిలేదు గానీ సహజంగా పళ్ళల్లో ఉండే తీపిదనం ఉంది. అది పూర్తిగా తాగేసరికి వాళ్ళకి శక్తివంతంగా అనిపించింది. మళ్ళీ మరమనిషి ప్రత్యక్షమై గ్లాసులు తీసుకుని వెళ్ళిపోయాడు.

"ఇంక ఆ చంద్రవాసి వస్తే మనం పక్కన ప్రదేశాలు చూడవచ్చు" అన్నాడు దీపక్.

"వెళదామా?" అన్న పిలుపు వైపు చూశారు వాళ్ళిద్దరూ.

చంద్రవాసి అక్కడ నిల్చుని వాళ్ళనే సంబోధించాడు. ఇద్దరూ గట్టుమీద నుంచి లేచి చంద్రవాసి వెనుక నడవసాగారు.

అనూష, దీపక్‌లకి చంద్రగ్రహంపై ఈ గుహలోపల చాలా నచ్చింది. కానీ స్త్రీలని, పిల్లలని వాళ్ళు చూడలేదు. జంతుజాలం

కూడా కనిపించలేదు.

"ఇంతవరకూ బహిరంగంగా కనిపిస్తున్నవి మీరు చూశారు. ఇప్పుడు చంద్రవాసుల జీవనశైలిని చూద్దురుగాని" అన్నాడు చంద్రవాసి.

కొంచెం దూరం వెళ్ళాక చంద్రవాసి, అనూష, దీపక్‌లని ఒక ఇంటిలోకి తీసుకెళ్ళాడు. ఆ ఇంటి ద్వారానికి తాళాలు లేవు. ఆ ద్వారం దగ్గర నుంచోగానే అది తెరచుకుంది.

"ఇలా అయితే ఎవ్వరైనా ఇంటిలోకి రాగలరు కదా?" సందేహం వెలిబుచ్చింది అనూష.

"ఎవరంటే వారు రాలేరు. ఈ తలుపు మా కుటుంబసభ్యులనే గుర్తుపడుతుంది. అలా ఈ తలుపుని ప్రోగ్రామ్ చేశాము. అందుకని మా కుటుంబ సభ్యులని, వారితోపాటు వచ్చిన అతిథులని గుర్తించి ఇది తెరుచుకుంటుంది. పరాయివాళ్ళు వస్తే ఇది తెరుచుకోదు" అని చెప్పాడు చంద్రవాసి.

"ఇది నా ఇల్లు. నా భార్య ఇక్కడి పాఠశాలలో పనిచేస్తుంది. నా పిల్లలు ఆ పాఠశాలలోనే చదువుకుంటున్నారు" అన్నాడు చంద్రవాసి.

ఇంటిలోపల చాలా పరిశుభ్రంగా వుంది. సామాన్లు అవసరానికి తగ్గట్టుగా ఉన్నాయి.

"మా ఇళ్ళల్లో పనులు చంద్రవాసులు చెయ్యరు. మరమనుషులుగానీ, యంత్రాలుగానీ పనులు చేస్తాయి. మాకు ఏ పని కావాలన్నా గోడమీద ఫలకంలో మీటలు నొక్కుతాము. ఇల్లు తుడవడం దగ్గర నుంచి ప్రతీపని యంత్రాలు చేస్తాయి. ఇవి పని చేసేటప్పుడు మేము దగ్గర ఉండవలసిన పనిలేదు. కంప్యూటర్ ద్వారా ప్రోగ్రామింగ్ చెయ్యడం వల్ల ఇవి వాటి పనులను నిర్థారిత సమయంలో పూర్తిచేసుకుని వాటి స్థానాలకు వెళ్ళి నిలచిపోతాయి" అన్నాడు చంద్రవాసి.

అనూష ఆశ్చర్యంగా ఇల్లంతా చూసింది. ఎక్కడా దుమ్ము ధూళి లేకుండా ఇల్లంతా అద్దంలా ఉంది.

"భూమ్మీద పనిమనుషులు దొరకడం చాలా కష్టంగా ఉంది. మాకు ఇలాంటి యంత్రాలు చాలా అవసరం" అంది అనూష.

"ఇంకొక యాభై సంవత్సరాల్లో భూమి మీద కూడా ఇలానే పనులు జరుగుతాయి. కానీ మీ జనాభా ఎక్కువ. అన్ని పనులు యంత్రాలు చేస్తే మీకు నిరుద్యోగ సమస్య ఎక్కువ అవుతుంది. అందుకని అధిక జనాభా ఉన్నప్పుడు పనులు కల్పించడమే మంచిది" అన్నాడు చంద్రవాసి.

"మరి మీ జీవనశైలి గురించి చెప్పండి" అన్నాడు దీపక్.

"మాకు వర్ణభేదాలు, కులభేదాలు లేవు. అందరికీ సమానమైన ప్రాముఖ్యత ఉంది. ఏ విషయమైనా అందరి అభిప్రాయం విని, అందరం కలిసి ఒక నిర్ణయానికి వస్తాం. ఇలా చెయ్యడం వల్ల ఎవరికీ అసంతృప్తి ఉండదు" అన్నాడు చంద్రవాసి.

"మా భూగ్రహం మీద పెద్దల మాటలకే ప్రాముఖ్యం. కానీ ఇప్పుడిప్పుడే ఈ తీరు మారుతోంది" అన్నాడు దీపక్.

"పిల్లలు పసివాళ్ళు. వాళ్ళకి మంచి చెడుల విచక్షణ ఉండదు. అందుకని పిల్లలు ఏం చేయాలి అన్నది పెద్దలమే నిశ్చయిస్తాం" అంది అనూష.

"పిల్లలు కూడా స్వతంత్రజీవులే. వాళ్ళకీ మేథస్సు ఉంది. ఆలోచనలు ఉన్నాయి. ఇష్టాయిష్టాలు ఉన్నాయి. అందుకని వాళ్ళ నిర్ణయాలని ప్రోత్సహిస్తామే కానీ అడ్డురాము" అన్నాడు చంద్రవాసి.

"అలా చెయ్యడం ఉత్తమమేనా?" అడిగాడు చంద్రవాసి.

"దీని సమాధానం, మీకు ఒకటి చూపించాక చెబుతాను" అని నవ్వాడు చంద్రవాసి.

ముగ్గురూ ఇంటి బయటికి వచ్చి నడవసాగారు. కొంతదూరంలో ఒక మనిషి పెద్ద రాళ్ళని అలవోకగా ఎత్తుతూ కనిపించాడు. అతని చేతులకి మరచేతులు తొడుగులు (ప్రోస్తటిక్ ఆర్మ్స్) ఉన్నాయి.

"అతను చేతులమీద ఆ తొడుగులు ఎందుకు ధరించాడు?" ప్రశ్నించింది అనూష.

"యంత్రాలతో సమానంగా పనిచేయాలంటే చేతులకి యంత్రాలశక్తి అవసరం. అవతల ఉన్న యంత్రం తవ్వుతోంటే యంత్రంతో సమానంగా అతను రాళ్ళను తీస్తున్నాడు. ఈ పని సులభతరం కావడానికి మరచేతులు

## ఇది విన్నారా?



★ హోదాప్రకారం గెజిటెడ్ ఆఫీసర్లు పచ్చరంగు సిరాను ఉపయోగించి రాయాలని రూల్ లేదు. కానీ అది చాలాకాలంగా ఒక సంప్రదాయంగా సాగుతోంది. ఎందుకంటే సీనియర్ ఆఫీసరు పచ్చసిరాతో రాసిన వాటిని పై అధికారి కాని, మంత్రికాని ప్రత్యేక సూచనగా భావించడానికని అలా రాస్తూ వస్తున్నారు.

★ విద్యుచ్ఛక్తికి ఉపయోగపడే వాహకం 'బ్రోమిన్'.

ధరించాడు" అన్నాడు చంద్రవాసి.

"ఆ మరచేతులకి శక్తి ఎలా వస్తుంది?" ప్రశ్నించాడు దీపక్.

"ఆ చేతుల్లో సౌరశక్తితో ఉత్తేజపరిచిన బాటరీలు ఉంటాయి. ఒకసారి ఉత్తేజితం చేస్తే ఈ బాటరీలు మీ భూమిలోని పదమూడున్నర రోజుల దాకా శక్తివంతంగా పనిచేస్తాయి. ఆ తరువాత వీటిని ఉత్తేజపరచాల్సి ఉంటుంది" అన్నాడు చంద్రవాసి.

చంద్రవాసులకి, ఇలాంటి విషయాల్లో శాస్త్ర జ్ఞానం చాలా ఎక్కువ అన్న విషయం అనూష, దీపక్‌లకి అర్థం అయింది.

ఇంకొంచెం ముందుకు నడవగానే తెల్లని దుస్తులు ధరించిన స్త్రీ పురుషులు కనిపించారు. వారు వివిధ మేని ఛాయల్లో పొడుగ్గా, పెద్ద పెద్ద కళ్ళతో అందంగా ఉన్నారు. వారి వదనాలు గంభీరంగా ఉన్నాయి.

వాళ్ళెవరని అడిగే లోపలే చంద్రవాసి వాళ్ళ గురించి చెప్పసాగాడు.

"వీళ్ళు వైద్యులు. సాధారణంగా మా చంద్రవాసులు నూట ఇరవై సంవత్సరాల కంటే ఎక్కువే జీవిస్తారు. దీనికి కారణం- స్వచ్ఛమైన వాతావరణం, పరిశుద్ధ ప్రకృతి, ఆరోగ్యంగా కాసిన కూరగాయలు, పళ్ళు, ధాన్యాలు, జన్యు మార్పిడితో వ్యాధిరహితంగా శరీరాలు ఉండడం, కనీసం మూడు గంటల వ్యాయామం, పద్ధతి ప్రకారం అనుసరించే జీవనశైలి, మాదక పదార్థాలు మరియు మదిర వాడకపోవడం, విశాలమైన ఊపిరితిత్తుల వల్ల ప్రాణవాయువుని ఎక్కువగా పీల్చుకోవడం, శాంత స్వభావం, ఈర్ష్య మరియు ద్వేషం లాంటి దుర్గుణాలు లేకపోవడం" అన్నాడు చంద్రవాసి.

"ఇలాంటి సద్గుణాలు అలవాటు చేసుకుంటే మా భూవాసులు కూడా దీర్ఘకాలం జీవించగలరు కదా" అన్నాడు దీపక్ అనూష వంక చూస్తూ.

"నూట పదిహేను సంవత్సరాల వయసు తరువాత వృద్ధాప్యం ఆవరించి, క్రమేపీ చంద్రవాసుల శరీరాలు క్షీణిస్తాయి. అప్పుడు మీరు చూసిన వైద్యులు వాళ్ళకి శుశ్రూష చేస్తారు" అన్నాడు చంద్రవాసి.

"వృద్ధాప్యంలో ఎలాంటి వ్యాధులు వస్తాయి వీళ్ళకి?" అడిగింది అనూష.


"వ్యాధులు రావు. వృద్ధాప్యం వల్ల శరీరం శక్తిహీనం అవుతుంది. క్రమేపీ శరీరం సుష్కించి నీరసంగా తయారవుతుంది. ఆ తరువాత, ఆ వృద్ధులు విరక్తులై మరణానికి తేలికగా లొంగిపోతారు" అన్నాడు చంద్రవాసి.

"ఆ మృతశరీరాన్ని ఏం చేస్తారు?" అడిగాడు దీపక్.

"కొద్ది సమయం కింద ఒక నూట ముప్పై సంవత్సరాల వృద్ధుడు చనిపోయాడు. అతని శరీరానికి ముక్తి ఎలా ప్రసాదిస్తామో చూద్దురు గానీ రండి" అని ముందుకి నడిచాడు చంద్రవాసి.

వృద్ధ చంద్రవాసి మృతదేహం ఉన్న చోటకి ముగ్గురూ చేరారు.

అక్కడ ఒక రేకుల పందిరి ఉంది. దాని కింద పల్చటి రాగి చాప పరిచి వుంది. దాని మీద మృతదేహాన్ని ఉంచారు మరమనుషులు. ఆ మృతదేహానికి కొంచెం దూరంలో నేలమీద,




## ఇది విన్నారా?




★ నిప్పునార్పే యంత్రం (ఫైర్ ఎస్టింగ్విషర్) లోని రసాయన పదార్థాలు విడుదల చేసే వాయువు కార్బన్ డై ఆక్సైడ్.

★ విశ్వంలో అతిపెద్ద ఉపగ్రహం 'గనిమెడ'.



★ భారతదేశ ప్రధాన యుద్ధట్యాంక్ 'అర్జున్'.

# అందమైన చందమామ!



అనాది నుంచి తెలుగువారినీ భారతీయులనే కాదు ప్రపంచ మానవాళిని భావోద్దీపనతో అలరిస్తున్నది అందాల చందమామ!

అమ్మ చంటిపిల్లాడిని చంకనెత్తుకుని అదే చేతిలో బుల్లి కంచం పట్టుకుని రెండవ చేయి ఆకాశం వంక చాచి, చూపుడు వ్రేలితో చందమామను చూపిస్తూ 'చందమామ రావే...జాబిల్లి రావే!' అనే పాట పాడుతూ గోరుముద్దలు తినిపిస్తుంది.

వెన్నెల రాత్రి పెరట్లో ఆరుబైట మంచం వేసుకుని, ఆకాశం వంక చూస్తూ చల్లని చంద్రకిరణాల స్పర్శతో ఆత్మీయానుభూతి పొందుతారు భార్యాభర్త! ప్రేమికులు తమలో కలిగిన మధురభావనలను చందమామ ద్వారా ఒకరికొకరు తెలుపుకుంటారు. ప్రణయ కలహమపుడు దెప్పక్కు కూడా చందమామ ద్వారానే! భారతదేశంలో ఎంతోమందికి చంద్రుని పేర్లే. చంద్రమోహన్, చంద్రకాంత్ లాంటి పేర్లు. ఇతర దేశాల్లో కూడా ఇలాంటి పేరులే వుంటాయేమో! అందంగా వున్న మగవారికైనా, ఆడవారికైనా చంద్రబింబం లాంటి ముఖం అంటారు.

కవుల వర్ణనలకి ముఖ్యవస్తువు ఈ ప్రియమైన మామ... చందమామ!

చంద్రవాసులు, మోకాళ్ళు ఆన్చి, కళ్ళు మూసుకుని, చేతులు పైకి చూపుతూ, ఏవో ప్రార్థనలు చేశారు. ప్రార్థన అవగానే ఒక చంద్రవాసి, తల వంచుకుని నిశ్శబ్దంగా రేకుల పందిరి వెనుక ఉన్న గోడ దగ్గరికి వెళ్ళాడు. ఆ గోడమీద ఉన్న ఫలకంలో నాలుగు మీటలు ఉన్నాయి. చంద్రవాసి మొదటి మీట నొక్కాడు. తరువాత ఆ ఫలకం దగ్గరే నుంచున్నాడు. మీట నొక్కగానే రేకుల పందిరి పైభాగం నుంచి అతి తీక్షణమైన కాంతి మృతదేహం మీద పడింది. క్షణంలో ఆ మృతదేహం బూడిద అయిపోయింది. ఫలకం దగ్గర నుంచున్న చంద్రవాసి రెండవ మీట నొక్కాడు. పల్చని రాగిరేకు, దాని మీద ఉన్న బూడిదని దగ్గరకి చేసుకుంటూ చాపచుట్టలా చుట్టుకుంది. మళ్ళీ ఆ చంద్రవాసి మూడవ మీట నొక్కాడు. వెంటనే ఆ రాగి చుట్ట, అటూ ఇటూ మడతపడుతూ ఆవగింజంత అయిపోయింది. చంద్రవాసి నాలుగవ మీట నొక్కగానే ఆ రేకుల పందిరిలో ఉన్న రంధ్రం ద్వారా ఆ ఆవగింజంత రాగి గుళిక చంద్రగ్రహ ఉపరితలం పైకి దూసుకుపోయింది. ఈ ప్రక్రియ అంతా క్షణంలోనే పూర్తి అయింది. వచ్చిన చంద్రవాసులందరూ నిశ్శబ్దంగా ఎవరితోవన వాళ్ళు వెళ్ళిపోయారు. దీపక్, అనూష ఇదంతా చూసి నిశ్చేష్టులై నిలబడిపోయారు.

"ఆ రాగి గుళిక, చంద్ర ఉపరితలం చేరగానే పగిలిపోయి దాని లోని బూడిద ఉపరితలం మీద వెదజల్లబడుతుంది" అన్నాడు చంద్రవాసి.

"ఇది చూశాక నా మనసు చాలా కలవరపడింది. ఇంకేమీ చూడాలని లేదు. నాకు విశ్రాంతి కావాలి. మా గదికి వెళదాం" అంది అనూష విచారంగా.

"అయితే సరే, మీ కుడివైపు వంద అడుగులు వేయండి. అక్కధ ఒక రైలు ఆగి ఉంది. మనం అందులో వెళదాం" అన్నాడు చంద్రవాసి.

ఆ ముగ్గురూ అలానే నడిచి వెళ్ళి రైలు ఎక్కారు. కొద్ది క్షణాల్లో ఆ రైలు వాళ్ళ గమ్యం చేరింది. రైలు దిగి వాళ్ళు ముగ్గురూ వాళ్ళ గది వైపు నడవసాగారు.

"ఇందాకా నేనీ రైలు పట్టాలు చూడలేదు" అంది అనూష.

"నేనూ చూడలేదు" అన్నాడు దీపక్.

"ఆ పట్టాలు అప్పుడు లేవు కాబట్టి మీరు చూడలేదు. మీ సౌకర్యం కోసం ఆ పట్టాలు కొద్ది సమయం కింద వేయబడ్డాయి" అన్నాడు చంద్రవాసి.

"కళ్ళజోడులు, హెల్మెట్లు నాకిచ్చి మీరు మీ గదిలోకి వెళ్ళండి. మీకు బయటకు రావాలనిపించినప్పుడు గోడమీద ఫలకం మీద మొదటి మీట నొక్కాలని మీకు తెలుసు కదా" అన్నాడు చంద్రవాసి. వాళ్ళిద్దరూ ఇచ్చిన కళ్ళజోళ్ళు, హెల్మెట్లు తీసుకుని చంద్రవాసి వెళ్ళిపోయాడు.

అనూష, దీపక్‌లు తమ గదిలోకి వెళ్ళారు.

"దీపక్..." అని అనూష ఏదో చెప్పబోయింది.

మాట్లాడవద్దని సైగచేసి ఇద్దరి చేతుల్లోని కంప్యూటర్లని తీసుకుని బల్లమీద బోర్లాపెట్టాడు దీపక్.


"ఇందాక చెప్పానుగా, ఆ కంప్యూటర్లు మన చేతిలో ఉన్నంతదాకా మనం ఏం మాట్లాడినా చంద్రవాసులు వినగలరు. అందుకని, వాటిని బల్లమీద బోర్లాపెట్టాకే మనం మాట్లాడుకోవాలి" అన్నాడు దీపక్ నవ్వుతూ.

"ఇప్పుడు చెప్పు" అన్నాడు దీపక్ మంచం మీద నడుం వాలుస్తూ.

"మృతదేహానికి అంత త్వరగా ముక్తి ప్రసాదించడం చూశాక నా మనసు వికలమైంది" అంది అనూష బాధగా.

"నీకు బాధగా ఎందుకుందంటే మన లాంటి వారే చంద్రవాసులు కూడా అని అనుకుంటున్నావు కాబట్టి. భూగ్రహం మీద మనకి, బంధుత్వాలు, ప్రేమానురాగాలు ఎక్కువ. అందుకని మనవాళ్ళకి శాశ్వత వీడ్కోలు పలకడం మనకి చాలా బాధాకరంగా ఉంటుంది" అన్నాడు దీపక్.

-ఇంకా వుంది




# చంద్రునితో ఒకరోజు

...::: మన్నె సత్యనారాయణ & ప్రియదర్శిని చాగంటి

"అన్ని సంవత్సరాలు సహవాసం చేసి, అంత త్వరగా వీడ్కోలు ఇవ్వడం చాలా కష్టం" అంది అనూష ఇంకా బాధపడు తూనే.

"చంద్రవాసులు మనకంటే చాలా పరిణితి చెందినవారు. ఈ పరిణితి క్రమంలో ప్రేమ, అనురాగం, బంధుత్వంలాంటి సున్నితమైన లక్షణాలని వీరు కోల్పోయారు. వీరికి ప్రతీదీ జీవనశైలిలో ఒక ఘటన. అంతకంటే మించిన ప్రాముఖ్య తమ వీక్కు ఇవ్వరు" అన్నాడు దీపక్.

"అయితే మాత్రం, ఆరడుగుల శరీరాన్ని ఒక్క క్షణంలో ఆవగింజంత చెయ్యడం సబబేనా?" ప్రశ్నించింది అనూష.

"మనం చూస్తున్నది ఇంకొక యాభై సంవత్స రాల తరువాత వచ్చే జీవనశైలి. అప్పటికి భూగ్రహం మీద జనాభా అదుపు తప్పి పెరుగు తుంది. సమాధులకి, శ్మశానాలకి చోటు ఉండదు. అప్పటిదాకా మనం బ్రతికి ఉంటే, మనని కూడా ఇలాగే సాగనంపుతారు" అన్నాడు దీపక్ గంభీరంగా.

"అలా మీరు అంటుంటే, నా గుండెభారం ఎక్కువ అవుతోంది" అంది అనూష.

"భారం దేనికి? కర్మకాండలో జరిగే ప్రక్రియలన్నీ, రోజుల తరబడి కాకుండా, క్షణాల మీద అయిపోతుంది. దీనివల్ల వాతావరణం కలుషితం కాదు. అయినవాళ్ళు, త్వరగా వాళ్ళ వాళ్ళ నిత్యజీవన శైలికి వెళ్ళిపోతారు. పైగా ఖర్చు కూడా తక్కువే" అన్నాడు దీపక్.


**జరిగిన కథ 7**

ఓ టెక్నాలజీ కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్న దీపక్ భార్య అనూష కొంతకాలం లెక్చరర్‌గా ఉద్యోగం చేసి మానేస్తుంది. అమెరికాలో నాసావారు భారత్‌లోని ఇస్రోతో కలిసి చంద్రుని మీదకు పరిశోధనలకోసం మానవసహిత అంతరిక్షనౌకను పంపించేందుకు సన్నాహాలు చేస్తుంటారు. ఈసారి ముగ్గురు సాధారణ పౌరులను ఎంపిక చేసి పంపాలనుకుంటున్న సంగతి తెలుసుకున్న దీపక్, అనూష అందుకు సిద్ధమై అప్లయ్ చేయాలనుకుంటారు. అంతరిక్ష యాత్రకు దీపక్-అనూష ఎంపిక కావడం వారికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వీరితోపాటు తమిళనాడుకు చెందిన మరో వ్యక్తి కూడా ఎంపిక అవుతాడు. చంద్రునిపైకి వెళ్లేందుకు ఎంపికైన దీపక్-అనూష అమెరికా పయనమవుతారు.దీపక్-అనూష విజయవంతంగా చంద్రగ్రహం మీద అడుగు పెడతారు. చంద్రునిపై తమకి కనిపించిన గుహలోకి వెళ్ళిన అనూష-దీపక్‌లకు చంద్రవాసులు ఎదురై తమతో వారిని తీసుకెళతారు. భూమ్మీది మనుషుల కంటే చంద్రవాసులు సృష్టించిన కృత్రిమ ప్రకృతి శోభను చూసి ఆశ్చర్యపోతారు దీపక్-అనూష. మృతదేహానికి చంద్రవాసులు ముక్తిని కలిగించే తీరు చూసి బాధపడుతుంది అనూష.

కల్పనా జగత్తులో విహరింపజేసే సైన్స్ ఫిక్షన్

"నిజమే! భూ గ్రహం మీద మన దేశంలో, అంత్యక్రియలకి, పెద్ద తతంగాలు, ఖర్చులూనూ.. శ్రద్ధ, భక్తిలతో ఆత్మీయులకి వీడ్కోలు ఇవ్వడమే. వాళ్ళకి ముక్తి ప్రసాదించడం అవుతుంది" అంది అనూష మనసు కుదుటపడ్డాక.

"మనం ఇక్కడ ఉన్నంతకాలం. వీళ్ళలాగే ఆలోచించాలి. ప్రవర్తించాలి. అప్పుడే వీళ్ళ గురించి సంపూర్ణంగా తెలుసుకోగలం" అన్నాడు దీపక్.



అర్థం అయినట్లు తల ఊపి నవ్వింది అనూష. బల్లమీద తన చేతి కంప్యూటర్‌ని తీసుకుంటూ.

"మన లాప్‌టాప్‌లు ఉండి ఉంటే, ప్రతీ విషయాన్ని అందులో భద్రపరుచుకొని భూమ్మీదకి వెళ్ళాక అన్నీ వివరించే వాళ్ళం" అంది అనూష.

"గోడమీద మీటలు ఫలకం పక్కన ఒక కంప్యూటర్ ఉంది. దాని మీద ఉన్న ఎర్రమీట నొక్కండి. ఆ తరువాత మీ మెయిల్ ఐడి చెప్పండి. ఒక ఫైలు తెరుచుకుంటుంది. దానికి ఒక పేరు పెట్టండి. తరువాత, పసుపు మీట నొక్కి, మీరు ఇక్కడ చూసిన వివరాలన్నీ చెప్పండి. అవి అందులో రికార్డు చెయ్యబడతాయి. అవి అక్కడ భద్రపరచబడాయి. మీరు చంద్రగ్రహం విడిచిన తరువాత, ఈ ఫైలులోని వివరాలన్నీ మీ మెయిల్‌కు పంపబడతాయి" అని వివరించింది అనూష చేతిలోని కంప్యూటర్.

"మా మెయిల్ ఐడితోబాటు, వేరే మెయిల్ ఐడి కూడా ఇవ్వవచ్చా?" అడిగింది అనూష.

"మీరు భూమి మీద సి.సి. చేస్తారు కదా! అలానే ఇక్కడా చెయ్యవచ్చు. కాకపోతే ఆకుపచ్చ మీట నొక్కి ఆ తరువాత ఆ ఐడిలు ఇవ్వండి" అంది కంప్యూటర్ వాణి.

"అయితే మేము ఫైలు పేరు 'చంద్రుడిమీద ఒక రోజు' అని పెడతాం" అంది అనూష.

"మీ ఇష్టం. ఏ పేరైనా పెట్టుకోవచ్చు" అంది కంప్యూటర్.

"మీరు మాకు పంపే సమాచారం, మా మెయిల్‌లో ఇక్కడ చదవవచ్చునా?" అడిగింది అనూష.

"అది ఇప్పుడు లభ్యం కాదు. మీరు మీ గ్రహం మీదకి చేరిన రోజున మీరు వీటిని చదవగలవరు" అంది కంప్యూటర్.

"ధన్యవాదాలు" అంది అనూష తన చేతి కంప్యూటర్‌ని బల్లమీద బోర్లాపెడుతూ.

"మన శాస్త్రవేత్తల మెయిల్ ఐడీలు సి.సి.చేద్దాం. వాళ్ళు ఈ విశేషాలు చదివి ఆశ్చర్యపోతారు" అంది అనూష ఉత్సాహంగా.

"అందుకే ఈ గుహలోకి వెళ్ళి చూద్దాం అన్నాను" అన్నాడు దీపక్ గొప్పగా. ఇద్దరూ నవ్వుకున్నారు.

"అనూష! ఆ పెద్ద నల్లకుర్చీలో కూర్చో. అది చేసే సపర్యలకి, నీకు చాలా హాయిగా వుంటుంది" అన్నాడు దీపక్ తన చేతి కంప్యూటర్ బల్లమీద నుంచి తీసుకుంటూ.

"నిజంగానే నాకు మర్దన చాలా అవసరం. ఒళ్ళంతా చాలా భారంగా ఉంది" అంటూ అనూష వెళ్ళి కుర్చీలో కూర్చుంది. కుర్చీ చేసే సపర్యలకి ఆనందించసాగింది అనూష.

"మనం వార్తలు విందాం" అన్నాడు దీపక్. వెంటనే అతని చేతి కంప్యూటర్‌లోంచి వార్తలు రాసాగాయి.

# చంద్రగ్రహం గురించి పరిశోధనలు



రాత్రిళ్ళు ఆకాశం వంక చూస్తే కోటానుకోట్ల నక్షత్రాల మధ్య పెద్దదిగా, గుండ్రంగా, అందంగా మెరిసిపోతూ కనిపించేది చందమామే! ఇది మనిషికి అనుభూతిపరమైన చందమామ!

అయితే వైజ్ఞానిక చందమామ వేరే విధంగా ఉంటుంది. సూర్యకుటుంబంలోని భూమి, అంగారకుడు లాంటి ఇతర గ్రహాల్లాంటి గోళాకారంలో వున్న గ్రహమే చంద్రుడు కూడా. మట్టి, రాళ్ళు, ఖనిజాలు ఇతర పదార్థాల కలయికతో ఏర్పడినదే! ఈ గ్రహాల మధ్య సారూప్యత ఏమిటి, తేడాలు ఎలాగుంటాయి, భూమిమీదున్న వాతావరణ పరిస్థితులున్నాయా, గురుత్వాకర్షణ ఎలా వుంటుంది? వాటి మీద నీరు వుందా, జీవరాశి వుందా, వుంటే ఏ స్థాయిలో వుంది? భూమి మీదున్న జీవరాశికి, బుద్ధిజీవులైన మనుషులకు ఆ గ్రహాలలో ఏదైనా నివాసయోగ్యంగా వుంటుందా? ఇటువంటి ప్రశ్నలతోనే భౌతిక శాస్త్రవేత్తలు, ఖగోళ శాస్త్రజ్ఞులు పరిశోధనలు చేస్తున్నారు. ఈ పరిశోధనలుకాని, వారు తెలుసుకోవలసినవిగానీ అంత తేలికగా తెలిసే విషయాలు కావు. ఒకరితో అయ్యే పనులూ కావు. విశిష్ట పరిజ్ఞానంతో శోధించి తెలుసుకోవలసినవి. అందుకే సైన్సులో వివిధ విభాగాల శాస్త్రజ్ఞులు ఈ విషయాల్లో పరిశోధనలు చేస్తున్నారు. కొన్ని సమాధానాలు పొందుతున్నారు. వాటిని ఆధారంగా చేసుకుని ఇతర శాస్త్రజ్ఞులు పరిశోధనలు జరపవలసి వున్నది.

“భూ గ్రహం మీది శాస్త్రవేత్తలు మంగళ గ్రహం గురించి కూడా అధ్యయనం మొదలుపెట్టారు. భారతదేశంలో కనిపించకుండా పోయిన అంతరిక్ష యాత్రికుల గురించి ఆందోళనలు జరుగుతున్నాయి. అంతరిక్ష యాత్రికులలో దీపక్ అన్న వ్యక్తి తల్లిని ఆసుపత్రిలో పెట్టారు. కొడుకు ఆచూకీ తెలియకపోవడంతో ఆవిడకు గుండెపోటు వచ్చింది. ఇప్పుడు ఆమె కోలుకుంటున్నారని ఆమెను చూస్తున్న వైద్యులు చెప్పారు.”

ఇది వినగానే దీపక్ కళ్ళు నీళ్ళతో నిండాయి.

“కంగారుపడకు దీపక్. ఇప్పుడు ఆవిడ కోలుకుంటున్నారని చెప్పారు కదా” అంది అనూష.

“రెండవ యాత్రికురాలు, అనూష ఆచూకీ తెలిసేదాకా నిరాహార దీక్ష చేస్తానని, అనూష తండ్రి పట్టుబట్టారు. ఇప్పటికి ఒక రోజు నుంచి ఆయన ఏమీ ముట్టలేదు” అంది కంప్యూటర్.

“మా నాన్నకి మధుమేహం వుంది. ఏమీ తినకపోతే ఆయన ఆరోగ్యం దిగజారుతుంది” అని కంగారుపడింది అనూష.

“ఇప్పుడే ప్రధానమంత్రి తన సందేశంలో, ఎట్టి పరిస్థితుల్లోనూ అంతరిక్ష యాత్రికుల ఆచూకీ కనుక్కుంటామని, వారి కుటుంబసభ్యులు, శాస్త్రవేత్తలతోనూ, ప్రభుత్వంతోనూ సహకరించాలని కోరారు. ఒక శాస్త్రవేత్తను పండ్లరసం తీసుకెళ్ళి అనూష తండ్రికి త్రాగించి ఆయన నిరాహార దీక్షను మాన్పించమని కోరారు”

“ఇంక వార్తలు వద్దు” అన్నాడు దీపక్. వెంటనే వార్తలు ఆగిపోయాయి.

“ప్రధానమంత్రి మాత్రం ఏం చేస్తారు? ఎవరూ ఏమీ చెయ్యలేరు మన గురించి. మనం భూగ్రహానికి వెళ్ళేదాకా ఈ గొడవలు జరుగుతూనే ఉంటాయి” అన్నాడు దీపక్ గంభీరంగా.

ఇద్దరూ చాలాసేపు నిశ్శబ్దంగా కూర్చున్నారు.

“నువ్వు కాసేపు విశ్రాంతి తీసుకో..ఇంతలో నేను గోడమీద కంప్యూటర్‌లో ఇప్పటిదాకా చూసిన విశేషాలను రికార్డు చేస్తాను” అంటూ తన చేతి కంప్యూటర్‌ని బల్లమీద బోర్లాపెట్టి గోడ దగ్గరకు వెళ్ళాడు దీపక్.

ఆ పని అయ్యాక, వాళ్ళ వాళ్ళ చేతి కంప్యూటర్‌లను తీసుకుని తలుపు దగ్గరికి వచ్చారు వాళ్ళిద్దరూ.

“ఈ కంప్యూటర్ రోజూ మోసుకెళ్ళేకంటే, మనకి వాళ్ళ భాష వచ్చి ఉంటే ఎంత బాగుండేది?” అంది అనూష.

“మీకు భాష నేర్పలేం. ఆ ఆలోచన మరిచిపోండి. ఎందుకంటే మీకు అంత తంత్రజ్ఞానం లేదు. ఇంకో విధంగా, మీకు కంప్యూటర్ బరువు తగ్గేలాగా ఏదైనా చెయ్యడానికి ప్రయత్నిస్తాం” అంది అనూష చేతిలోని కంప్యూటర్.

తలుపు తెరుచుకున్నాక, బయటకు రాగానే, ఒక చంద్రవాసి వాళ్ళ కోసం వేచి ఉన్నాడు. మెడలో వేసుకుని, కంప్యూటర్ పెట్టుకునే సంచీలు, చెవిలో పెట్టుకునే ఫోన్లు, కళ్ళజోళ్ళు, హెల్మెట్లు వాళ్ళకి అందించాడు.

“మీ చేతి కంప్యూటర్లని ఈ సంచిలో పెట్టుకుని, మెడలో వేసుకోండి. చెవిలో ఫోన్లు పెట్టుకుని, వాటి రెండవ చివర మీ కంప్యూటర్‌తో కలపండి. కళ్ళజోళ్ళు పెట్టుకుని, హెల్మెట్లు ధరించండి” అన్నాడు చంద్రవాసి.

“క్షమించండి. ఇందాకా ఆ ముక్తి ప్రక్రియను చూసి కొంచెం చలించాము” అంది అనూష.

“మీకు ఇలాంటివి అలవాటు లేవు కదా..అందుకని చలించడం సహజం. మీ గ్రహం మీద మృతదేహాల్ని మోసుకెళ్ళడం, ఏడవడం రోజుల తరబడి విధివిధానాలు చేయడం ఆనవాయితీ. కానీ చంద్రగ్రహం మీద ఇవన్నీ ఉండవు. భవిష్యత్తులో మీ భూగ్రహం మీద కూడా అన్నీ మా చంద్రగ్రహం లానే అవుతాయి” అన్నాడు చంద్రవాసి.

“మా గ్రహం విశేషాలు మీకెలా తెలుసు?” ఆశ్చర్యంగా అడిగాడు దీపక్.

## ఇది విన్నారా?



★ ఫిలిప్పీన్స్ దేశంలో బతంగాస్ అనే రాష్ట్రంలో 'లూజాన్' సరస్సు ఉంది. గతంలో దాన్ని బోంబోన్ లేక్ అనే వారు. కానీ ఇప్పుడు దాన్ని తాల్‌లేక్ అంటున్నారు. దానిలోని విశేషం ఏంటంటే- ఆ లేక్ మధ్యలోనే భూమి, ఆ భూమి మధ్యలో మరొక లేక్ వున్నాయి. దీన్ని చూడ్డానికి ఎక్కడెక్కడ నుంచో పర్యాటకులు వచ్చి ఆ మధ్య వున్న లేక్‌లోని తీయని నీళ్ళని తాగి సంబరపడిపోతుంటారు.

"మీ భూగ్రహం గురించి మాకు అన్నీ తెలుసు. మీరు ఫ్లయింగ్ సాసర్, యు.ఎఫ్.ఓ. అని ఆకాశంలో కనిపించే వాటిని ఆశ్చర్యంగా చూస్తారు కదా! ఇవి మేము పంపినవే! అవి శాంతియుతంగా భూగ్రహం వివరాలు సేకరించి, మాకు పంపిస్తున్నాయి" అన్నాడు చంద్రవాసి.

"అన్ని వివరాలు తెలిసినప్పుడు మీరు భూమి మీదకి ఎందుకు రాలేదు?" అడిగింది అనూష.

"అక్కడ మీరు మా గురించి చేసే భయంకర ఊహాగానాలు, భూవాసుల ఉద్ధృత ప్రవర్తన, కాల్పులు, చంపడాలు, మానభంగాలు.. ఇలాంటి అశాంతికర దృశ్యాలని మేము చూశాము. చంద్రవాసులందరూ స్నేహప్రియులు. శాంతిమంతులు. అందుకే మీ గ్రహానికి రావడానికి వెనకాడుతున్నాం" అన్నాడు చంద్రవాసి.

అలా మాట్లాడుకుంటూనే ఒక పాఠశాల దగ్గరికి వచ్చారు ముగ్గురూ.

పిల్లలు పరిశుభ్రమైన బట్టలు వేసుకుని, ఆరోగ్యంగా, చూడముచ్చటగా అనిపించారు అనూష, దీపక్‌లకి. ఎవరికి, ఏ విషయంలో ఆసక్తి ఉంటే, ఆ విషయాన్ని అభ్యసిస్తున్నారు విద్యార్థులు. వాళ్ళకి చదువు చెప్పే ఉపాధ్యాయులు సౌమ్యమైన స్వరంలో ప్రశాంత వదనాలతో, కంప్యూటర్‌లో చూపిస్తూ పాఠాలు చెబుతున్నారు. పిల్లలు శ్రద్ధగా నేర్చుకుంటున్నారు. ఒక్కొక్క తరగతిలో పదిమంది కన్నా విద్యార్థులు లేరు. అధునాతమైన పరికరాలతో తరగతి గదులు చూడముచ్చటగా ఉన్నాయి. సంగీతం, నాట్యం, గణితం, సామాన్యశాస్త్రం, ఖగోళ శాస్త్రం, చెక్కపని, మట్టితో కళాకృతులు చెయ్యడం, చిత్రకళ లాంటి వివిధ విషయాలు బోధించబడుతున్నాయి.

"మన భూగ్రహం మీద కూడా పిల్లలు స్వేచ్ఛగా, వాళ్ళకి ఇష్టం ఉన్న విషయాలను అభ్యసించగలిగితే ఎంత బాగుంటుంది?" అంది అనూష దీపక్‌ని ఉద్దేశించి.

"అలా అవాలంటే తల్లిదండ్రులు, వారి ఇష్టాఇష్టాలని పిల్లలమీద పెట్టకూడదు. అంటే పెద్దలు వాళ్ళ జీవితం వాళ్ళ ఇష్టానుసారం జీవించి, పిల్లలకి కూడా ఆ స్వేచ్ఛ ఇవ్వాలి" అన్నాడు చంద్రవాసి.

"అంటే..." సందేహం వెలిబుచ్చాడు దీపక్.

"అంటే తల్లిదండ్రులకి నచ్చినవే, వాళ్ళ పిల్లలకి కూడా నచ్చాలని అనుకోకూడదు. ప్రతీ జీవి, జన్యుపరమైన, అంతర్గత, విశిష్ట లక్షణాలతో, లోపాలతో జన్మిస్తాదని అర్థం చేసుకోవాలి. భూవాసులు, ఏ ఒక్కరూ మరొకరిని పోలి ఉండరని గ్రహించుకోవాలి" అన్నాడు చంద్రవాసి.

"ఇక్కడి పిల్లలు ఏది కావాలంటే అది, ఎలా కావాలంటే అలా అభ్యసించగలుగుతున్నారు. కాబట్టి, ఆనందంగా ఉన్నారు. ఈ విద్యాభ్యాస ప్రక్రియలో, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా శాయశక్తులా తోడ్పడుతున్నారు. అందుకే పిల్లలకు వీళ్ళంటే అపారమైన గౌరవం ఉంది" అన్నాడు దీపక్.

"ఇంక ముందుకు వెళదాం పదండి" అన్నాడు చంద్రవాసి.

కొంచెం దూరం నడిచేసరికి కాలేజీల్లాంటి భవనాలు కనిపించాయి. యుక్తవయసు విద్యార్థులు వాళ్ళకి ఇష్టం అయిన విషయాలు అక్కడ అభ్యసిస్తున్నారు. కొందరు వైద్యవిద్య అభ్యసిస్తే, మరికొందరు నాటక కళాకారులు కావాలని కష్టపడుతున్నారు. మరికొందరు వేరువేరు విషయాలు అభ్యసిస్తున్న ఇంజినీరింగ్ ఛాత్రులు కనిపించారు. అబ్బాయిలు, అమ్మాయిలు, స్నేహపూర్వకంగా మసలుతూ విద్య అభ్యసిస్తున్నారు. పుస్తకాలు, కాగితాలు, కలాలు ఉపయోగించకుండా, కంప్యూటర్ ద్వారానే విద్య అభ్యసిస్తున్నారు. ఎటువంటి అనుచిత, అభ్యంతరకరమైన ప్రవర్తననీ చూడలేదు అనూష, దీపక్.

"విద్యాసంస్థలలో ఇలాంటి ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటే, మానభంగాలు, ఆత్మహత్యలు ఉండవు. చదువులో ముందుకి సాగలేక, మానసిక బాధలకు కూడా విద్యార్థులు బలికారు. ఎవరితో ఎవరికీ పోటీలేదు, పోలికా లేదు" అన్నాడు దీపక్ గంభీరంగా.

"అవును మెదడు, మనసు, ఆరోగ్యంగా ప్రశాంతంగా ఉంటే వికృత బుద్ధులు పుట్టవు" అంది అనూష.

చంద్రవాసుల విద్యావిధానం వారి మనసుల్ని ఆకట్టుకుంది.

"ఇక్కడి విద్యార్థుల మీద ఎలాంటి ఒత్తిడీ లేదు. తమ పిల్లలు ఎలా ఉన్నా, వాళ్ళని సంతోషంగా స్వీకరిస్తారు తల్లిదండ్రులు. వారి అభిప్రాయాలని ఇష్టాలను గౌరవిస్తారు. అందుకే పిల్లలు కూడా తల్లిదండ్రులను గౌరవంగా, అభి

మానంగా చూస్తారు" అన్నాడు చంద్రవాసి.

ఆ విద్యాసంస్థలను తీరికగా, పరిశీలనగా చూశారు దీపక్, అనూష.

"ఇంక మీరు భోజనం చేసే వేళయింది. పదండి వెళదాం" అన్నాడు చంద్రవాసి.

"అంటే భూలోకంతో పోలిస్తే మేము నాలుగున్నర రోజులు గడిపామా ఇక్కడ?" ఆశ్చర్యంగా అడిగింది అనూష.

"అవును. మొదట మీకు భోజనం ఇచ్చినప్పుడే చెప్పాను కదా, మళ్ళీ నాలుగున్నర రోజుల తర్వాతే అని" నవ్వసాగాడు చంద్రవాసి.

"నాలుగున్నర రోజులైనా మాకు ఆకలి అనిపించలేదు" అంది అనూష.

"మేం ఇచ్చిన భోజనం మిమ్మల్ని నాలుగున్నర భూమి రోజులదాకా తాజాగా ఉంచుతుంది" అన్నాడు చంద్రవాసి.

"మా భూగ్రహం లాంటి భోజనం దొరుకుతుందా ఇక్కడ?" అడిగాడు దీపక్.

"ఇక్కడ అలాంటి పంటలు పండవు కాబట్టి, అలాంటి భోజనం దొరకదు" అన్నాడు చంద్రవాసి.

ముగ్గురూ ఒక హోటల్‌లాంటి ప్రదేశానికి వెళ్ళారు.

"మీకేం కావాలో ఆ మానిటర్‌లో చూసి ఎంచుకోండి" అన్నాడు చంద్రవాసి.

ఆ వంటకాలేమిటో అనూష, దీపక్‌కి అర్థం కాలేదు.

"మీరే ఎంచండి" అన్నాడు దీపక్.

"ఇక్కడ శాకాహారమే దొరుకుతుంది. ఈ వాతావరణ పరిస్థితుల్లో జంతువులు జీవించలేవు కనుక. ఈ వంటకాల పేర్లు మీకు తెలియకపోవడం సహజమే" అని, కంప్యూటర్ మానిటర్ దగ్గర నుంచుని కావలసిన భోజన పదార్థాలను కోరారు. కొద్దిక్షణాల్లో, ఒక మరమనిషి చంద్రవాసి ఆర్డర్ ఇచ్చిన భోజన పదార్థాలను తీసుకుని వచ్చి వాళ్ళు కూర్చున్న బల్లమీద పెట్టాడు. వంటవాళ్ళు గానీ ఇతర సిబ్బందిగానీ అనూష, దీపక్‌లకి కనిపించలేదు. ఆ వంటకాలు కనులకింపుగా కమ్మని వాసనలతో కొత్త రుచుల్లో చాలా రుచికరంగా అనిపించాయి దీపక్, అనూషలకి. ముగ్గురూ భోజనం ముగించారు.

"మళ్ళీ భూమి ప్రకారం నాలుగున్నర రోజులకి భోజనం ఇస్తాం మీకు. మధ్యలో కావాలంటే వేడి లేదా చల్లని పానీయాలను తాగవచ్చు... ఇప్పటి భోజనంలో శరీరానికి కావల్సిన పోషకాహారాలు అధికంగా ఉంటాయి. ఇవి జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది. అందుకని మీకు చాలా సమయం దాకా ఆకలి, నిద్ర అనిపించవు. పైగా వేళపట్టున తింటే ఎన్నిరోజులైనా అలసట ఉండదు" అని వివరంగా చెప్పాడు చంద్రవాసి.

మళ్ళీ వాళ్ళు నడక ప్రారంభించారు.

వనాలు చూశారు. మరికొంత దూరంలో ఆ గుహ అంతరించింది. దీపక్, అనూషలు అయోమయంగా చంద్రవాసి కేసి చూశారు.

"భయపడకండి. ఈ నేల మీద ఒక గుండ్రని ఫలకం కనిపిస్తోంది చూశారా?" ప్రశ్నించాడు చంద్రవాసి.

నేలవంక చూశారు దీపక్, అనూష.




## ఇది విన్నారా?




★ చెరకు రసానికి లాక్సేటివ్ గుణాలుంటాయి. కనుక ఇది తాగితే మలబద్ధకం వదలిపోతుంది.

★ ద్రవ్యం, సైజు, సాంద్రతలోనూ భూమిలాగే ఉండే గ్రహం 'శుక్రుడు'.



★ 'ఫాదర్ ఆఫ్ ఇండియన్ న్యూక్లియర్' ప్రోగ్రాం అని 'హోమీ జె.బాబా'ని పిలుస్తారు.

# కాలము-దూరము-భ్రమణము



'చంద్రునితో ఒకరోజు' అని ఈ నవలలో చెప్పుకుంటున్నాం. అయితే చంద్రగ్రహం మీద ఒకరోజు, భూమి మీద 29.5 రోజులతో సమానం! ఒకరాత్రి ఒక పగలు కలసి ఒక రోజు అని మనం అంటాం.

ఈ రోజు యొక్క కాలం నిడివి గ్రహానికి, గ్రహానికీ మారుతూ ఉంటుంది. ఎందుకంటే కొన్ని గ్రహాల కూటమికి ఒక 'స్టార్' వుంటుంది. భూమి, చంద్రుడు మొదలైన గ్రహాలకూటమికి సూర్యుడు స్టార్! అందుకే, ఈ గ్రహకూటమిని సూర్యకుటుంబం అంటాం. సూర్యుని నుంచి ఈ గ్రహాలు వివిధ దూరాల్లో వుంటాయి. వాటి పరిమాణాల్లోనూ తేడాలుంటాయి. ఇవి తమ స్టార్ అయిన సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తూ వుంటాయి. వాటి దూరం, పరిభ్రమణ వేగాల్లోనూ తేడాలుంటాయి. ఆ తేడాల వల్లనే ఆయా గ్రహాల్లో పగలు రాత్రుల వేళల నిడివిలో ఎక్కువ తక్కువ తేడాలుంటాయి. భూమి నుంచి చూసే సాధారణ పరిశీలకులకు ఈ వేళల్లోని తేడాలు అర్థం కావడానికి అవకాశం వుండదు. శాస్త్రపరిశీలకులు మాత్రమే వీటిని గ్రహించగలరు. ఈ అవగాహనతోనే సైంటిస్టులు తమ ప్రక్రియలను కొనసాగిస్తారు.

ఒకరోజు, నెల, సంవత్సరం అనే కాలం విభజన భూమిమీదున్న కాలప్రమాణానికి చెందినది. వివిధ గ్రహాలమీదున్న కాలప్రమాణంతో పోల్చినప్పుడు సాపేక్షంగా వుంటుంది. అయితే, ఎంతో దూరంలో వున్న గ్రహం గురించి చెప్పవలసి వచ్చినప్పుడు ఇన్ని కాంతి సంవత్సరాల దూరంలో వుందని చెబుతారు. ఈ సంవత్సరమనేది భూమి మీదున్న కాలప్రమాణానికి చెందినది. కాంతి సంవత్సర దూరమంటే- కాంతి సెకనుకు 3 లక్షల కి.మీ.దూరం ప్రయాణిస్తుంది. అంటే నిమిషానికి ఎంత దూరం, గంటకి ఎంత, రోజుకి ఎంత, సంవత్సరానికి ఎంత దూరం ప్రయాణిస్తుంది? ఈ లెక్క కట్టి చెప్పుకోవడం కష్టం. కాబట్టి కాంతి సంవత్సరాన్ని దూరపు కొలతగా చెబుతారు. భూమి సూర్యకుకుంబంలోనిదే కనుక, భూమి నుంచి ఈ కూటమిలోని ఇతర గ్రహాలకూ సూర్యునికీ దూరం తక్కువే. కొన్ని కోట్ల మైళ్ళుంటుంది. శాస్త్రపరిజ్ఞానం అంతగాలేనప్పుడు కూడా ఈ దూరాలను అంచనా వేసి చెప్పారు. అయితే ఆ అంచనాలంత కచ్చితంగా లేకపోయినప్పటికీ ఇంచుమించుగా శాస్త్రీయంగా తరువాత చేసిన అంచనాలకు సరిపోతున్నవి. విశ్వంలో అతి సుదూర ప్రాంతాల్లో వున్న గ్రహాల (ప్లానెట్స్) దూరాన్ని అంచనా వేయడం తేలిక కాదు. కాంతి సంవత్సరాల దూరంలో మాత్రమే వాటిని చెబుతారు.

అసలు 'కాలం' అంటే ఏమిటి? ఒక క్షణం నుంచి వేరొక క్షణంకు మధ్య వున్నది కాలం! ఒక బిందువు నుంచి మరొక బిందువుకు మధ్యనున్నది 'దూరం'. కాలము-దూరము గురించిన అధ్యయనం ఆసక్తికరంగా వుంటుంది. అయితే అది అత్యంత శాస్త్రీయమైన విషయం. ఈ సందర్భంలో దాన్ని గురించి మనం అంతగా చెప్పకోనక్కర్లేదు.

"ఇది దేనికి?" అడిగాడు దీపక్.

చంద్రవాసి దాన్ని కాలితో తట్టాడు. అది పక్కకి జరిగింది. దాని కింద నుంచి, ఇంకొక గుహలోకి దారి ఉంది. ఆ దారిలో నడుస్తూ ఆ ముగ్గురూ ఇంకో గుహలోకి ప్రవేశించారు.

"మీరు ఇంతదాకా చూసిన గుహ కేవలం 150 అడుగులు లేదా 46 మీటర్ల వెడల్పు మరియు 30 మైళ్ళు లేదా 48 కిలోమీటర్ల పొడవు మాత్రమే ఉంది. అందుకని అన్ని వ్యవహారాలు ఒకే గుహలో జరగడానికి స్థలం సరిపోదు. అందుకని మేము వేరువేరు గుహలని, ఒకదానిలో ఒకటి కలిపి మా జీవన స్రవంతిని లాగుతున్నాం" అన్నాడు చంద్రవాసి.

"మనం వెళ్ళే రెండో గుహ, అన్నిటికన్నా పెద్దది. ఇది 100 మీటర్లు వెడల్పు, 150 కిలో మీటర్లు పొడవు ఉంటుంది" అన్నాడు చంద్రవాసి.

చంద్రవాసి వెనకాల దీపక్, అనూష నడవసాగారు.


కొంచెం దూరం నడవగానే, అలమారుల్లోని అరలలాగా ఒక దాని మీద ఒకటి పేర్చిన పొలాలు కనిపించాయి. వాటిలో వరిలాంటి నాట్లు పెరుగుతున్నాయి. ఒక్కొక్క అరకి మధ్యలో 10 అడుగుల దూరం ఉంది. దాదాపు పది కిలోమీటర్ల దాకా రెండు వైపులా వరి, పప్పుధాన్యాలు, కూరగాయల మొక్కలు పెరుగుతున్నాయి.

"ఇలా అరల్లో ఎందుకు పెంచుతున్నారు?" అడిగింది అనూష.

"మా గుహంలో స్థలం తక్కువ. విపరీత వాతావరణ పరిణామాలు, నీటిలేమి వల్ల చంద్రగ్రహం ఉపరితలం మీద ఏమీ పండించలేము. కానీ మాకూ ఆహారం అవసరం కదా. అందుకని ఒకదాని మీద ఒక అర, పది అంగుళాల తేడాతో అమర్చి అలా పండిస్తున్నాం" అన్నాడు చంద్రవాసి.

"దున్నడం, త్రవ్వడం, కొయ్యడం లాంటి ప్రక్రియలు ఎలా చేస్తారు? కలుపుమొక్కల్ని ఎలా దూరం చేస్తారు?" అడిగాడు దీపక్.

**-ఇంకా వుంది**




...::: మన్నె సత్యనారాయణ & ప్రియదర్శిని చాగంటి

"ఇక్కడి వ్యవసాయానికి ఇలాంటి ప్రక్రియలు అవసరం లేదు. విత్తనాలలో కల్తీ ఉండదు. ఈ మట్టిలో కలుపుమొక్కలు మొలకెత్తవు. తక్కిన ప్రక్రియలన్నీ కంప్యూటర్ సహాయంతో చేస్తాం" అన్నాడు చంద్రవాసి.

"అది ఎలా సాధ్యం?" అంది అనూష ఆశ్చర్యంగా.

"సరికొత్త శాస్త్రజ్ఞానంతో విత్తనాలను నాటుతాం కనుక దున్నడం, త్రవ్వడం అవసరం ఉండవు. ఇంక పంట పక్వానికి వచ్చినప్పుడు, ఒక జత యంత్ర చేతుల్ని కంప్యూటర్ ఆధీనంలో వాడుతూ, పంట కోస్తాం. పంట ఎప్పుడు కొయ్యడానికి సిద్ధంగా ఉందో కూడా కంప్యూటర్ చెబుతుంది" అన్నాడు చంద్రవాసి.

దీపక్, అనూష ఇది విని చాలా ఆశ్చర్యపోయారు.

ఒక్క అంగుళం స్థలం కూడా వృథాపోకుండా శాస్త్రజ్ఞానంతో చంద్రవాసులు ఎంత బాగా, ఉన్న స్థలాన్ని వాడుకుంటున్నారో చూసి చాలా సంతోషించారు అనూష, దీపక్‌లు. వాళ్ళిద్దరూ చంద్రవాసిని మనసారా అభినందించారు.

"అభినందనలకి ధన్యవాదాలు. కానీ ఒక విషయం అర్థం చేసుకోండి. మీ భూగ్రహం మీద జనసంఖ్య ఇలాగే మితిమీరి పెరుగుతూ ఉంటే, ముున్ముందు మీరు కూడా ఇలానే వ్యవసాయం చేయవలసి రావచ్చు" అన్నాడు చంద్రవాసి గంభీరంగా.

"అవును. మీరన్నది ముమ్మాటికీ నిజం. కానీ మీ జనాభా పెరిగితే మీరేం చేస్తారు?" అడిగాడు దీపక్.

**జరిగిన కథ 8**

ఓ టెక్నాలజీ కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్న దీపక్ భార్య అనూష కొంత కాలం లెక్చరర్‌గా ఉద్యోగం చేసి మానేస్తుంది. అమెరికాలో నాసావారు భారత్‌లోని ఇస్రోతో కలిసి చంద్రుని మీదకు పరిశోధనలకోసం మానవసహిత అంతరిక్షనౌకను పంపించేందుకు సన్నాహాలు చేస్తుంటారు. ఈసారి ముగ్గురు సాధారణ పౌరులను ఎంపిక చేసి పంపాలనుకుంటున్న సంగతి తెలుసుకున్న దీపక్, అనూష అందుకు సిద్ధమై అప్లయ్ చేయాలనుకుంటారు. అంతరిక్ష యాత్రకు దీపక్-అనూష ఎంపిక కావడం వారికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వీరితోపాటు తమిళనాడుకు చెందిన మరో వ్యక్తి కూడా ఎంపిక అవుతాడు. దీపక్-అనూష విజయవంతంగా చంద్రగ్రహం మీద అడుగు పెడతారు. చంద్రునిపై తమకి కనిపించిన గుహలోకి వెళ్ళిన అనూష-దీపక్‌లకు చంద్రవాసులు ఎదురై తమతో వారిని తీసుకెళతారు. భూమ్మీది మనుషులకంటే చంద్రవాసులు సృష్టించిన కృత్రిమ ప్రకృతి శోభను చూసి ఆశ్చర్యపోతారు దీపక్-అనూష. మృతదేహానికి చంద్రవాసులు ముక్తిని కలిగించే తీరు చూసి బాధపడుతుంది అనూష. చంద్రుడిపై ఉన్న గుహల్లోని పంటవిధానాలను పరిశీలిస్తారు దీపక్, అనూష.

**కల్పనా జగత్తులో విహరింపజేసే సైన్స్ ఫిక్షన్**

"మా జనాభా పెరగదు. ఎందుకంటే మా జీవనకాలం ఎక్కువ కనుక ముప్పయ్యేళ్ళ వయసు దాటాక మాకు ప్రౌఢత్వం వస్తుంది. పైగా మా శరీరాలు ఉత్తేజపడడానికి కూడా చాలా ఎక్కువ కాలం పడుతుంది. ఈ కారణాల వల్ల మాకు యాభై నుంచి ఎనభై ఏళ్ళ వయసులో సంతానం కలుగుతుంది" అన్నాడు చంద్రవాసి.

"అంత ముసలి వయసులోనా?" ఆశ్చర్యంగా అడిగింది అనూష.

"మాకు ఆ వయసు యవ్వనం. ఎందుకంటే మేము కనీసం నూట ఇరవై సంవత్సరాలు జీవిస్తాం" అన్నాడు చంద్రవాసి నవ్వుతూ.

"మీ జనాభాలో అనారోగ్యవంతులు, అవంగులు ఒక్కళ్ళు కూడా కనిపించలేదు" అన్నాడు దీపక్.

"మా స్త్రీలు గర్భం దాల్చిన కొన్ని రోజులకే ఇక్కడి వైద్యులు జన్యుపరీక్షలు చేస్తారు. పుట్టబోయే బిడ్డ జన్యు లక్షణాలని పరీక్షిస్తారు. ఏవైనా అవలక్షణాలు కనిపిస్తే జన్యుమార్పిడి ద్వారా అవలక్షణాలు సరిచేస్తారు. లోపాలు చాలా ఎక్కువగా ఉంటే, ఆ బిడ్డని పుట్టనీయరు" అన్నాడు చంద్రవాసి.

"అందుకే మీ జనాభా లోపరహితంగా ఆరోగ్యంగా ఉన్నారన్నమాట" అంది అనూష.

"అవును. రాబోయే కాలం మనుగడకి చాలా కఠిన పరిస్థితులని తెస్తుంది. అందుకని శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నవారే ఈ పరీక్షలని ఎదుర్కో గలరు. అందుకనే ఇక ముందు కాలంలో, మీ భూగ్రహం మీద కూడా ఈ జన్యుమార్పిడులు జరుపబడతాయి" అన్నాడు చంద్రవాసి.

ఇలా మాట్లాడుకుంటూ చాలా దూరమే నడిచారు వాళ్ళు. ఒక చోట యంత్రాలు తయారు చేసే కర్మాగారంలాంటిది కనిపించింది. దాని లోపలికి దారితీశాడు చంద్రవాసి.

అక్కడ రకరకాల అంతరిక్ష నౌకలు, వాటిలో అమర్చవలసిన వివిధ యంత్రభాగాలు ఉన్నాయి. నీలం రంగు బట్టలు వేసుకున్న స్త్రీ పురుషులు ఆ పనిలో నిమగ్నమై ఉన్నారు.


"ఇది మా అంతరిక్ష నౌకలు తయారుచేసే కర్మాగారం. ఆ గుండ్రటి అంతరిక్ష నౌకని మీరు ఫ్లయింగ్ సాసర్ అంటారు. ఆ చతురస్రాకారంలో ఉన్నదాన్ని మీరు యు.ఎఫ్.ఓ. అంటారు. వీటిలాంటి చాలా వాటిని మేము వివిధ గ్రహాల మీదికి పంపించాము. ఇవి మాకు ఫొటోల ద్వారా ఆ గ్రహాల గురించి వివరాలు అందిస్తున్నాయి" అన్నాడు చంద్రవాసి.

"మరి ఇన్ని వివరాలు సేకరించాక కూడా మీరు భూమి మీదకు ఎందుకు రాలేదు?" మళ్ళీ అడిగింది అనూష.


"ఇందాకా చెప్పాను కదా కారణాలు. అంతేకాకుండా మా శరీరాలు చాలా పెద్దవి. మేం రావాలంటే పెద్ద అంతరిక్ష నౌకలు కావాలి. వాటికి ఎక్కువ ఇంధనం కావాలి. మా చంద్రగ్రహం మీద అంత ఎక్కువ ఇంధనం నిలువలు లేవు. ఇంధన నిలువ ఎక్కువ చేయడానికి, మా శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేస్తున్నారు.

వారి ప్రయోగాలు ఫలించాక మేము రావడానికి ప్రయత్నిస్తాము. అంతలోపల మీ గ్రహం నుంచి రాబోయే వాళ్ళు మా గురించి తెలుసుకుని, మా వివరాలు భూగ్రహం మీద ప్రచారం చేస్తారు. మేం అంటే భూవాసులకి సదభిప్రాయం ఏర్పడ్డాక, మేము వస్తాము" అన్నాడు చంద్రవాసి.

దీపక్, అనూష వాళ్ళ కళ్ళని నమ్మలేకపోతున్నారు. ఒకటి తరువాత మరొక అద్భుతం కనిపిస్తోంది వాళ్ళకి ఈ చంద్రవాసంలో. "భూమి కూడా ఇలా ఉంటే చాలా బాగుం



# భూమి-చంద్రుడు మధ్య దూరం!




ఒక స్టార్ (తార) యొక్క గ్రహకూటమిలోని అన్ని గ్రహాల వాతావరణమూ ఒకేలా వుండదు. ఒకదానిలో అత్యంత ఉష్ణము, ఒకదానిలో అత్యంత శీతలము, కొన్నింటిలో ఎక్కువ ఉష్ణము, శీతలమూ వుండవచ్చును. కొన్నింటిలో తగుమాత్రం ఉష్ణము, శీతలము ఉండవచ్చును. ఈ తేడాలకు ఒక కారణం- తారకూ గ్రహానికీ మధ్య వున్న దూరం కావచ్చును.

ఒక గ్రహం తారకు (స్టార్) బాగా తక్కువ దూరంలో ఉంటే దాని మీద ఎక్కువ శీతలమం వుండవచ్చును. తారకు దగ్గరగా వున్న గ్రహంలో ఉష్ణం ఎక్కువగా వుంటుంది. అలాకాక, సమదూరంలో ఉన్న గ్రహంలో సమశీతోష్ణస్థితి వుంటుంది.

ఇలా సమశీతోష్ణస్థితి వున్న గ్రహాలు ఒక తారకూటమిలో తక్కువగానే వుండవచ్చును. వీటిని అధ్యయనం చేయడం వలనే శాస్త్రవేత్తలకు ఎక్కువ సమాచారం, సానుకూలత లభిస్తాయి. ఇదివరకటి అధ్యయనాల్లో కూడా ఇటువంటి గ్రహాల అధ్యయనానికే ప్రాధాన్యమిచ్చారు. ఇప్పటి శాస్త్రవేత్తలు కూడా అటువంటి వాటిని గుర్తించడానికే ప్రయత్నిస్తున్నారు. శీతోష్ణస్థితుల్లోని తేడాలకు మరొక కారణం, గ్రహాల పరిభ్రమణంలోని వ్యత్యాసాలు. గ్రహకూటమిలోని గ్రహాలు తమ స్టార్ చుట్టూ పరిభ్రమిస్తూ వుంటాయి. ఆ పరిభ్రమణంలో ఒక వృత్తం ఏర్పడుతుంది. అన్ని గ్రహాల వృత్తం ఒకేలా వుండదు. కొన్నింటి పరిభ్రమణ వృత్తంలో అనుచితమైన తేడా వుంటుంది. ఇటువంటి తేడాను 'ఎక్సెన్ట్రిసిటీ' అని పరిభాషలో అంటారు. పరిభ్రమణ వృత్తంలో ఎక్కువ ఎక్సెన్ట్రిసిటీ వున్న గ్రహంలో ఉష్ణ, శీతలాలు ఎక్కువగా వుంటాయి. వృత్తంలో తక్కువ ఎక్సెన్ట్రిసిటీ వున్న గ్రహంలో ఇవి తక్కువ తేడాతో వుండి సమశీతల వాతావరణం వుంటుంది. ఉదాహరణకు- సూర్యకుటుంబంలోని భూమి యొక్క పరిభ్రమణ వృత్తంలో ఈ ఎక్సెన్ట్రిసిటీ 0.1 మాత్రమే వుంటుంది. అందువల్లనే భూమి మీద సమవాతావరణం నెలకొంది.

సమవాతావరణం వున్న ఇటువంటి గ్రహాల్లో నీరు ద్రవ రూపంలో వుండడానికి అవకాశం వుంటుంది. సమవాతావరణం, నీరూ వున్న గ్రహాల్లో జీవరాశి ఉద్భవించి, మనుగడ సాగించడానికి అవకాశం వుంటుంది. దాన్నిబట్టే మిగిలిన అన్ని అంశాలూ కూడా అనుకూలంగా మారివుంటాయి. అక్కడి నేల యొక్క లోపలి పొరలు శిలామయంగా వుంటాయి. ఈ విధమైన అనుకూల అంశాలు- సమవాతావరణం, ద్రవరూపమైన నీరు, గాలి, అనుకూలమైన నేల భూగ్రహం మీదున్నాయి. అందువల్లనే భూమి జీవరాశి ఉద్భవించడానికీ మనుగడకూ అవాసయోగ్యమైంది. ఒక స్టార్ యొక్క కూటమిలో వున్న ఇటువంటి ఆవాసయోగ్యమైన గ్రహాలను 'గోల్డీలాక్స్ జోన్' అని అంటారు. ఈ విధంగా సూర్యకుటుంబంలో భూమి అనే గ్రహం 'గోల్డీలాక్స్ జోన్'కు చెందినది.

ఇటీవల ఖగోళ శాస్త్రజ్ఞులు, (చిలీ, నాసా సహా) విశ్వంలోని అక్వేరియస్ అనే తారామండలంలో ఒక చిన్న స్టార్ చుట్టూ 7 గ్రహాలు పరిభ్రమిస్తున్నాయని గ్రహించారు. ఈ 7 గ్రహాలూ భూమి సైజులోనే వున్నాయి. వీటిలో కనీసం 3 గ్రహాల్లో ద్రవరూపంలో నీరుండవచ్చని, భూమి మీదున్న సమవాతావరణ పరిస్థితులే వుండివచ్చని అభిప్రాయపడుతున్నారు. అక్కడ జీవమూ వుండవచ్చని భావిస్తున్నారు. ఈ గ్రహాలను ఆ చిన్న స్టార్ యొక్క గోల్డీలాక్స్ జోన్‌గా పరిగణిస్తున్నారు. ఈ స్టార్ యొక్క గ్రహకూటమి భూమి నుంచి 40 కాంతి సంవత్సరాల కాలంలో వుందని అంచనా వేస్తున్నారు. ఈ గ్రహకూటమి వ్యవస్థకు 'ట్రాపిస్ట్-1' అని పేరు పెట్టారు. వారి పరిశీలన ప్రకారం ఈ గ్రహాలు ఆ స్టార్‌కు దూరంగా వుండేవని, ఆ తరువాత (అంటే కొన్ని కోట్ల సంవత్సరాలకు) స్టార్‌కు దగ్గరగా జరిగివుంటాయని అంటున్నారు. అంటే ఇలా దగ్గరకు జరగడం వాటి అనుకూలత కోసం జరిగిందని వారి అభిప్రాయం. గ్రహాలు స్టార్ నుంచి తమ దూరాలను అనుకూలత కోసం మార్చుకోవచ్చని అర్థమవుతున్నది.

భూమి నుంచి చంద్రగ్రహం యొక్క దూరం ఇప్పుడు 3,84,400 కి.మీటర్లుగా లెక్క కట్టారు. అయితే, కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం చంద్రగ్రహం భూమికి ఇంతకంటే తక్కువ దూరంలో వుండేదని భావిస్తున్నారు. అప్పుడు భూమి నుంచి చూస్తే, చంద్రబింబం ఇప్పటికంటే పెద్దదిగా కనిపించి వుంటుంది.

టుంది" అన్నాడు దీపక్.

"భూగ్రహం కూడా ఇలా ఉండాలంటే, తక్కువ జనాభాతోపాటు ద్వేషాలు కోపాలతో పర్యావరణం కలుషితం చెయ్యడం మానాలి. 'నా-పరాయి' అన్న భేదం లేకుండా ఆలోచించి మానవ కల్యాణానికి దోహదపడాలి. ఉన్న వనరులని అపురూపంగా వాడుకోవడం రావాలి" అన్నాడు చంద్రవాసి. అనూష, దీపక్‌లు చంద్రవాసితో పూర్తిగా అంగీకరించారు.

ముగ్గురూ కలిసి ఆ కర్మాగారాన్ని వివరంగా చూశారు. అపారమైన శాస్త్రజ్ఞానం, మంచిపనితనంతో వాళ్ళు పని చురుకుగా చేస్తున్నారు.

"వీళ్ళు మంచి అంతరిక్ష నౌకని, వారికి అనుకూలంగా తయారుచేసుకుని, త్వరలో మన భూగ్రహానికి వస్తారని నాకు గట్టి నమ్మకం కలుగుతోంది" అన్నాడు దీపక్.

"నాకు కూడా కలుగుతోంది" అంది అనూష.

"ముందుకి వెళదాం పదండి" అన్నాడు చంద్రవాసి.

ఎవరిపాటికి వాళ్ళు ఆలోచనల్లో మునిగి

## ఇది విన్నారా?



★ నార్వేజియన్ స్పోర్ట్స్ స్కూల్ పరిశోధకులు- ఎవరైనా రోజులో ఎక్కువ సమయం కూర్చుని 9 గంటల పాటు కదలకపోతే అతిత్వరలోనే మరణిస్తారని హెచ్చరిస్తున్నారు. అంటే మధ్యమధ్య అంటూ ఇటూ కదులుతూ మరో పని చేసుకుంటూ వుంటే మంచిది.

★ గుండె సంబంధమైన అనారోగ్యంతో జన్మించిన బిడ్డను 'బ్లూబేబి' అని పిలుస్తారు.

చంద్రవాసి వెనుక నడిచారు అనూష, దీపక్.

"ఇక్కడి నుంచి మేము అంతరిక్ష నౌకని వేరే గ్రహాలకి పంపుతాం" అని ఒక అధునాతనంగా తయారుచేసిన స్థలం చూపించాడు చంద్రవాసి.

అది చూశాక, చంద్రవాసులు తప్పకుండా భూగ్రహానికి వస్తారని నమ్మకం కుదిరింది దీపక్, అనూషలకి.

"మీ శాస్త్రవేత్తల శాస్త్రజ్ఞానం అపారం. అభినందనీయం" అన్నాడు దీపక్ ఆనందంగా.

"ధన్యవాదాలు. మా చంద్రగ్రహం మీద ప్రతీ పని సులభతరం చెయ్యడానికి మా శాస్త్రవేత్తలు నిరంతరం కృషి చేస్తున్నారు. వారు చాలా ప్రతిభావంతులు" అన్నాడు చంద్రవాసి.

"ఇప్పటిదాకా ఎంతసేపటి నుంచి నడుస్తున్నాం?" అడిగింది అనూష.

"మూడు గంటల నుంచీ నడుస్తున్నాం. నేను వేళ చెప్పినప్పుడల్లా భూగ్రహంతో పోల్చి చెబుతున్నానని గుర్తుంచుకోండి" అన్నాడు చంద్రవాసి.

"ఇంకొక గంటన్నరలో మీరు చూడాలనుకున్నవి చూసి, మీరు విశ్రాంతి తీసుకోవచ్చు" అన్న చంద్రవాసి కాలుజారిపడ్డాడు. అతని కాలుకి దెబ్బ తగిలింది. కాలు బాగా గీరుకుపోయింది.

"అయ్యో! మీకు దెబ్బ తగిలింది. దగ్గరలో ఆసుపత్రి ఉంటే వెళ్ళి మందు వేయించుకుందాం" అన్నాడు దీపక్.

"కంగారుపడకండి. దెబ్బ తగిలినప్పుడు, మా శరీరంలోని కణాలు వాటంతట అవే బాగుచేసుకుంటాయి. దెబ్బ త్వరగా మాని చర్మం తాజాగా అయిపోతుంది. దెబ్బ నయం అవడానికి సుమారు అయిదు క్షణాలు పడుతుంది మీరే చూడండి" అన్నాడు చంద్రవాసి.

వారు చూస్తూ ఉండగానే క్రమేపీ కాలుమీద దెబ్బ మానిపోయింది. అనూష, దీపక్ ఆశ్చర్యానికి అంతులేకపోయింది. ఇంకా ముందుకి నడవడం మొదలుపెట్టారు.

అనూష, దీపక్‌లకి అలసట అనిపించింది. శ్వాస తీసుకోడానికి కొంచెం కష్టంగా అనిపించింది. కానీ చంద్రవాసి మాత్రం తాజాగా, ఏ బాధా లేనట్లు అనిపించాడు.

"మీకు అలసటగా లేదా?" అడిగింది అనూష.

"మా శరీరంలో పెద్ద ఊపిరితిత్తులు, కండరాలు ఉండడం వల్ల మేము ఎక్కువ ప్రాణవాయువు పీల్చుకోగలుగుతాము. అందువల్ల శరీర కణాలకి తగినంత ప్రాణవాయువు లభించి, మాకు అలసట అనిపించదు. మీరు కూడా దీర్ఘంగా ఊపిరి పీల్చుకోండి అలసట తగ్గుతుంది" అన్నాడు చంద్రవాసి.


"అంతేకాదు, మేము ఏ పని చేయాలన్నా ఆలోచించి, తాపీగా చేస్తాము. అందువల్ల శక్తిని త్వరగా కోల్పోము" అన్నాడు చంద్రవాసి.

"ఇంకా మీరు ఏమేమి చెయ్యగలరు?" అడిగాడు దీపక్.

"మేము మా జీవన గడియారాన్ని ఆపగలం" అన్నాడు చంద్రవాసి.

"అదెలా సాధ్యం?" ఆశ్చర్యంగా అడిగాడు దీపక్.

"ఎవరికైనా పెళ్ళికాకపోయినా, పిల్లలు పుట్టకపోయినా ఇంకే ఇతర కారణాలవల్లనైనా



అనుకున్నది సాధించలేనప్పుడు జన్యుమార్పిడి ద్వారా వాళ్ళ జీవన గడియారాన్ని ఆపగలము. అంటే జీవనగడియారాన్ని ఆపడం వల్ల వయసు పెరగకుండా ఆగిపోతుంది" అన్నాడు చంద్రవాసి.

అనూష, దీపక్‌లు ఈ విషయాన్ని నమ్మలేక పోయారు.

"మీకు అలాంటి వ్యక్తిని చూపిస్తాను రండి" అన్నాడు చంద్రవాసి.

కొంత దూరం నడిచాక ఒక పరిశోధనా శాల కనిపించింది. అందులో శాస్త్రవేత్తలు తమ పరిశోధనలు చేస్తున్నారు. చంద్రవాసి- అనూష, దీపక్‌లకి ఆ పరిశోధనశాలలో ఒక శాస్త్రవేత్తని చూపించాడు.

"ఇతను చాలా పెద్ద శాస్త్రవేత్త. ఇతడు, చని పోయిన వారికి తిరిగి ప్రాణం పోయడానికి గత యాభై సంవత్సరాలుగా పరిశోధనలు చేస్తు న్నాడు" అన్నాడు చంద్రవాసి.

"కానీ ఆయన చిన్నవాడిలా అనిపిస్తు న్నాడే? అంత వయసున్నట్టు కనిపించడం లేదు" అన్నాడు దీపక్.

"అవును. అతని నలభయ్యవ ఏట అతని జీవన గడియారాన్ని ఆపడం జరిగింది. ఇంకొక ఇరవై సంవత్సరాలకి గానీ అతని పరిశోధన పూర్తికాదు. అందుకని, ఆ పరిశోధన పూర్తయ్యే దాకా ఆయన వృద్ధాప్యం పాలవకుండా, అతని జీవనగడియారాన్ని నలభై వయసు దగ్గర ఆపే శాము" అన్నాడు చంద్రవాసి.

"పరిశోధన అయ్యాక ఆయన నిజవయసు ఆయనకి వస్తుందా?" అడిగింది అనూష.

"అది ఆయన ఇష్టం. నలభై సంవత్సరాల నుంచి ప్రతీ సంవత్సరం పెరగాలనుకుంటే అలా ఉంటాడు. అలా కాకుండా వృద్ధాప్యం కావాలనుకుంటే అతని నిజవయసుకి మారిపో గలడు" అన్నాడు చంద్రవాసి.

"ఈ పరిశోధనాశాలలో ఇంకా ఏమేమి చేస్తున్నారు?" అడిగాడు దీపక్.

"ఇక్కడ జన్యుపర్యవేక్షణ ద్వారా శక్తివంత మైన జీవులని తయారుచేయడం, వాళ్ళకి వేగం, తెలివి, వ్యాధినిరోధక శక్తి, అగ్నిప్రమా దాల నుంచి, చంద్రకంపనాల నుంచి వాతావ రణం పరివర్తనాల నుంచి, ఉల్కాపాతాల నుంచి రక్షించుకునే శక్తి ప్రసాదించడానికి ప్రయోగాలు జరుగుతున్నాయి. ఈ ప్రయో గాలు విజయవంతం అయితే ఈ శాస్త్రవేత్తలు అతివిశిష్ట మానవులను (సూపర్ హ్యూమన్స్) తయారుచెయ్యగలుగుతారు" అన్నాడు చంద్ర వాసి.

"మా భూగ్రహ జీవుల కంటే మీరు చాలా విషయాల్లో పరిణితి చెందారు. దీనికి మిమ్మల్ని ఎంతలా అభినందించినా సరిపోదు" అంది అనూష.


"ధన్యవాదాలు" అన్నాడు చంద్రవాసి.

"పదండి. ఇంకా చూడవలసినవి చాలా ఉన్నాయి" అన్నాడు చంద్రవాసి బయటికి దారి తీస్తూ.

బయటికి వచ్చాక దీపక్ అన్నాడు-

"అనుకున్న కాలం జరిగిపోయినట్లు ఉంది. మనం కాసేపు విశ్రాంతి తీసుకుందాం"

"సరే పదండి. ఎదురుగా ఉన్న తోటలో కూర్చుందాం" అన్నాడు చంద్రవాసి.




## ఇది విన్నారా?



★ మనిషి శరీరంలో ఉన్న బ్యాక్టీరి యాసంతతిని తీసి తక్కెడలో వేస్తే దాదాపుగా మూడు నుంచి నాలుగు కిలోల బరువవుతాయి.

★ గ్లాస్ ఊలు అంటే 'అతి సన్నటి గాజు తంతువులు (తీగలు)'.



★ ట్రాన్స్‌ఫార్మర్‌ను కనుగొన్న శాస్త్ర వేత్త 'మైకేల్ ఫారడే'.

"పళ్ళరసం తాగుతారా?" అడిగాడు చంద్రవాసి.

"తాగుతాము" అంది అనూష.

తన చేతి కంప్యూటర్ మీద ఏవో మీటలు నొక్కాడు చంద్రవాసి.

క్షణాల్లో ఎదురుగా ఉన్న హోటలు లోంచి, పళ్ళరసాల గ్లాసులు తీసుకుని వచ్చాడు ఒక మరమనిషి. వాళ్ళు ఆ రసాలు, తాగాక, గ్లాసులు తీసుకుని వెళ్ళిపోయాడు మరమనిషి.

"మీరు ఇంతలా కంప్యూటర్లు, యంత్రాల మీద ఆధారపడి జీవిస్తున్నారు. మరి నిరుద్యోగ సమస్య రాదా?" అడిగాడు దీపక్.

"నిజమే! సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువైన కొద్దీ ఇలాంటి సమస్యలు తప్పవు. కానీ ఏమీ చెయ్యలేము. ఈ జీవన ప్రయాణంలో ముందడుగు వేయడం తప్పనిసరి. ఈ పరుగులో ఉద్యోగాలు, వ్యక్తిగత గోప్యత, సంఘజీవనం లాంటివి బలి అవక తప్పదు" అన్నాడు చంద్రవాసి. మళ్ళీ చంద్రవాసుల గురించి చెప్పసాగాడు.

"అసలు మేము ఏ పనులూ చేసుకోము. మా ఇళ్ళను శుభ్రపరచుకోడానికి అందంగా అలంకరించుకోడానికి కూడా మేము మరమనుషులను వాడతాము. వాటిని ప్రోగ్రాము చేసి వెళతాము. మేము బయటికి వెళ్ళి వచ్చేసరికి అవి మా పనులు సక్రమంగా పూర్తిచేసి పెడతాయి. కాలం మా స్వవిషయాల కోసం మిగుల్చుకుని వీలైనంత తక్కువ పని చెయ్యడం మా జీవన లక్ష్యం. మేము ప్రశాంత జీవనశైలిని ఇష్టపడతాము" అన్నాడు చంద్రవాసి.

"ఈ గుహలో ఇంతదాకే వెళ్ళగలం. ఇంకో గుహ చూద్దాం పదండి" అన్నాడు చంద్రవాసి.

"వార్తలు విని బయలుదేరుదామా?" అంది అనూష. వెంటనే ఆమె కంప్యూటర్‌లోంచి వార్తలు రాసాగాయి.

"వివిధ గ్రహాలనుంచి ఏవో శబ్దాలను రికార్డు చేసి మన అంతరిక్ష నౌకలు పంపించాయి. ఆ శబ్దాల గురించి మన శాస్త్రవేత్తలు పరిశోధిస్తున్నారు.

మన చంద్రగ్రహం మీద ఉన్న అంతరిక్ష యాత్రికుడు, దీపక్ తల్లి ఇప్పుడు ప్రమాదావస్థ దాటి, ఆరోగ్యం పుంజుకుంటున్నట్లు ఆమెకి చికిత్స చేస్తున్న వైద్యులు తెలియజేశారు. ప్రముఖ రాజకీయవేత్తలు, పాత్రికేయులు ఆమెని ఆసుపత్రిలో పరామర్శించారు.

రెండవ అంతరిక్ష యాత్రిణి, అనూష తండ్రి చేత నిరాహార దీక్ష మార్పించి, ఆయనను క్షేమంగా ఇంటికి పంపారని, అక్కడి పోలీసు అధికారులు చెప్పారు.

ఇప్పటికి, భూగ్రహం మీద శాస్త్రీయమైన పద్ధతిలో అంతరిక్ష యాత్రికుల ఉనికి కోసం పరిశోధనలు చేస్తూనే వున్నారు.

త్వరలో వారి ఉనికిని తెలియచేస్తాం అని భారతదేశపు ప్రధానమంత్రి, పాత్రికేయులకు చెప్పారు.

ఇంక, భూగ్రహం మీద వాతావరణ కాలుష్యం ఎక్కువ అవటం వల్ల..."

"ఇంక వార్తలు చాలు" అంది అనూష. వెంటనే వార్తాప్రసారం ఆగిపోయింది.

వాళ్ళు ముగ్గురూ మళ్ళీ నడవసాగారు.

"సౌరశక్తి మీద నడుస్తున్న కార్లు, రైళ్ళు కనిపిస్తున్నాయి. మరి మనం వాటిని ఉపయోగించుకోకుండా ఎందుకిలా కాలినడకన వెళుతున్నాం?" ప్రశ్నించింది అనూష.

"వాటిలో ప్రయాణిస్తే క్షణాల్లో గమ్యం చేరతాము. మీరు ఇంత వివరంగా అన్నీ చూడలేరు. అందుకని మనం కాలినడకన వెళుతున్నాం. పైగా నడక ఆరోగ్యానికి చాలా మంచిది" నవ్వుతూ అన్నాడు చంద్రవాసి.

గతంలోలాగానే నేలమీది ఫలకాన్ని కాలుతో తట్టి-

"ఇది చిన్న గుహ. కేవలం ముప్పయ్ కిలోమీటర్ల పొడవు, నూటయాభై అడుగుల వెడల్పు ఉంటుంది ఇది" అన్నాడు చంద్రవాసి.

అనూష, దీపక్‌లు చంద్రవాసి వెనుక ఆ గుహలోకి అడుగు పెట్టారు. ఆ గుహ మిగతా రెండింటికన్నా వేరుగా ఉంది. అక్కడ అందమైన చెట్లుగానీ పూలతోటలుగానీ లేవు. నునుపుదేరిన బాటలూ లేవు. ఒక రాతి కట్టడం లాంటి గది కనిపించింది అనూష, దీపక్‌లకి.

"ఇది శిక్షాగృహం. మీ భూగ్రహం మీది కారాగారం లాంటిది"

"కారాగారమా?" ఒక్కసారి అన్నారు అనూష, దీపక్ ఆశ్చర్యంతో.


"ఇక్కడ సమయానుసారం పనులు చెయ్యకపోవడం తప్పు. ఎక్కువ ఆహారం తినడం, నీరు తాగడం కూడా తప్పు. ఎనభై సంవత్సరాల జీవన వ్యవధిలో సంతానం కలగకపోవడం తప్పు. సాంఘిక మర్యాదలని ఉల్లంఘించడం తప్పు. పరాయి ఆస్తిమీద కన్నువెయ్యడం చాలా తప్పు. ఏ ఒక్క తప్పు చేసినా కారాగారంలో ఉంచుతారు" అని చెప్పాడు చంద్రవాసి.


"కొంతమందికి సహజంగానే సంతానం లేకపోవచ్చు, అది తప్పెలా అవుతుంది?" అంది అనూష.

"మీకు ఇదివరకు చెప్పాను కదా, బిడ్డ పుట్టడానికి ముందే జన్యుపర్యవేక్షణ ద్వారా లోపాలన్నిటినీ సరిదిద్దుతాం అని. అందుకని చంద్రవాసుల్లో నపుంసకులు, గొడ్రాళ్ళు ఉండరు. పైగా వంశపారంపర్యంగా సంతతి పెరగకపోతే రాబోయే కాలంలో చంద్రవాసుల సంఖ్య క్షీణిస్తుంది. క్రమేపీ వాళ్ళ ఉనికి లేకుండా పోతుంది. అందుకని ఈ తప్పు జరగనీయం" అన్నాడు చంద్రవాసి.

"ఈ తప్పులను పర్యవేక్షించి ఎవరు శిక్ష విధిస్తారు? ఆ అధికారం ఎవరికి ఉంది?" అడిగాడు దీపక్.

-ఇంకా వుంది






...::: మన్నె సత్యనారాయణ & ప్రియదర్శిని చాగంటి

"మాకు రాజులు, నాయకులు లేరు. మేం అందరం ఒకే స్థాయి వాళ్ళం. మేం అందరం కలిసి నిర్ణయించుకున్న నిబంధనలు ఇవి. అందుకని శిక్ష విధించడం గురించి కూడా అందరం చర్చించి నిర్ణయిస్తాము. ఈ మధ్య ఇంకొక ముఖ్య నిర్ణయం తీసుకున్నాము. ఏ పనీ చెయ్యనివాళ్ళు జీవించడానికి అర్హులు కారని కూడా నిశ్చయించాము. అందుకే చంద్రవాసులందరూ, శాయశక్తులా పనిచేస్తూ ఉంటారు" అన్నాడు చంద్రవాసి.

"మీరు తక్కువ పని చేస్తాం అన్నారుగా!" అంది అనూష.

"మేం చెయ్యవలసిన పనులేమిటంటే, పిల్లలకి విద్యాబోధన చెయ్యడం, వృద్ధులని జాగ్రత్తగా చూడడం, కంప్యూటర్లు, ఇతర యంత్రాలను సౌరశక్తితో శక్తివంతం చెయ్యడం, మీలాంటి అతిథులను అన్నివిధాలుగా మంచిగా, జాగ్రత్తగా చూడడం, ఇలాంటి అనేకమైన పనులు ఉన్నాయి."

"ఈ కారాగృహం ఖాళీగా ఉందే!" అన్నాడు దీపక్ ఆ గదిలోకి తొంగి చూస్తూ.

"శిక్ష మీద భయం ఉంటే ఎవరూ తప్పులు చెయ్యరు. చంద్రవాసులూ అంతే! అందుకే ఆ గది ఖాళీగా ఉంది" అన్నాడు చంద్రవాసి.

అలా నడుస్తూ వెళ్ళగా మరొక గది కనిపించింది.


అక్కడ పెద్ద దీర్ఘచతురస్రాకార డబ్బాలు కనిపించాయి. అవి సౌరవిద్యుత్ ఫలకానికి, ప్లగ్గులు ద్వారా కలపబడి ఉన్నాయి. అవి ఏమిటని అడిగాడు దీపక్.

జరిగిన కథ

9

ఓ టెక్నాలజీ కంపెనీలో ఇంజనీరుగా పని చేస్తున్న దీపక్ భార్య అనూష కొంతకాలం లెక్చరర్‌గా ఉద్యోగం చేసి మానేస్తుంది. అమెరికాలో నాసావారు భారత్‌లోని ఇస్రోతో కలిసి చంద్రుని మీదకు పరిశోధనలకోసం మానవసహిత అంతరిక్షనౌకను పంపించేందుకు సన్నాహాలు చేస్తుంటారు. ఈసారి ముగ్గురు సాధారణ పౌరులను ఎంపిక చేసి పంపాలనుకుంటున్న సంగతి తెలుసుకున్న దీపక్, అనూష అందుకు సిద్ధమై అప్లయ్ చేయాలనుకుంటారు. అంతరిక్ష యాత్రకు దీపక్-అనూష ఎంపిక కావడం వారికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వీరితోపాటు తమిళనాడుకు చెందిన మరో వ్యక్తి కూడా ఎంపిక అవుతాడు. దీపక్-అనూష విజయవంతంగా చంద్రగ్రహం మీద అడుగు పెడతారు. చంద్రునిపై తమకి కనిపించిన గుహలోకి వెళ్ళిన అనూష-దీపక్‌లకు చంద్రవాసులు ఎదురై తమతో వారిని తీసుకెళతారు. భూమ్మీది మనుషులకంటే చంద్రవాసులు సృష్టించిన కృత్రిమ ప్రకృతి శోభను చూసి ఆశ్చర్యపోతారు దీపక్-అనూష. మృతదేహానికి చంద్రవాసులు ముక్తిని కలిగించే తీరు చూసి బాధపడుతుంది అనూష. చంద్రుడిపై ఉన్న గుహల్లోని పంటవిధానాలను పరిశీలిస్తారు దీపక్, అనూష. చంద్రవాసులు చేసే తప్పులకు శిక్ష ఎవరు వేస్తారనే సందేహం కలుగుతుంది దీపక్‌కి.

కల్పనా జగత్తులో విహరింపజేసే సైన్స్ ఫిక్షన్



"అవి మంచు పెట్టెలు. వాటిలోపల -100 అంత చల్లగా ఉంటుంది" అన్నాడు చంద్రవాసి.

"అవి దేనికి?" ప్రశ్నించింది అనూష.

"మా చంద్రవాసులు మరణిస్తే ముక్తిని ఎలా ప్రసాదిస్తామో మీరు చూసారు. కాని వేరే గ్రహాల నుంచి వచ్చిన అతిథులు, ఏ కారణం వల్లనైనా అనారోగ్యం పాలుపడి, మరణిస్తే వాళ్ళ మృతదేహాలని ఆ డబ్బాల్లో భద్రపరుస్తాం. మున్ముందు వాళ్ళు వచ్చిన గ్రహం నుంచి ఎవరైనా వాళ్ళని వెతుకుతూ మా గ్రహానికి వస్తే, వాళ్ళకి, మృతదేహాలు అప్పజెప్పాలని అలా భద్రపరుస్తాం" అన్నాడు చంద్రవాసి.

"ఎవరూ రాకపోతే?" ప్రశ్నించాడు దీపక్.

"ఇలా వంద సంవత్సరాలు వేచి చూసి, ఎవరూ రాకపోతే ఆ మృతదేహాలకి, మా పద్ధతిలో ముక్తిని ప్రసాదిస్తాం" అన్నాడు చంద్రవాసి గంభీరంగా.

"ఆ డబ్బాల్లో మృతదేహాలు ఉన్నాయా?" అడిగింది అనూష.

"లేవు. ఇంతవరకూ పరాయిగ్రహాల నుంచి ఎవరూ ఈ గుహల్లోకి రాలేదు. మీరే మొదటి వారు. ఎవరూ చంద్రగ్రహం మీద మరణించలేదు కూడా" అన్నాడు చంద్రవాసి.

## రచయితల పరిచయం



### మన్నె సత్యనారాయణ

సెల్: 9989076150

**స్వగ్రామం**- పశ్చిమ గోదావరి జిల్లా తిరుపతిపురం.

**ప్రస్తుతం**- తణుకులో నివాసం.

**ఉన్నత విద్య**- పూనా యూనివర్సిటీ, పూనా డెక్కన్ కాలేజీ.

**వృత్తి**- కొంతకాలం వ్యవసాయం, పరిశ్రమల స్థాపన, నిర్వహణ.

**ప్రవృత్తి**- ఎక్కువగా చదవడం, తక్కువగా రాయడం.

**ప్రచురణ అయిన నవలలు**- కన్యాశుల్కము- తరువాయి భాగం, ఆనందరావు అంగారక యాత్ర (హాస్యనవల), తెలుగు జనపథం, కాలంలో ప్రయాణం (సైన్స్‌ఫిక్షన్), తూరుపువలస (200 సంవత్సరాల నాటి వ్యవసాయ వలస కథనం), మధురవాణి మధురిమలు-గిరీశం లెక్చర్లు (వివిధ పత్రికలలో ప్రచురింపబడిన కొన్ని కథలు, వ్యాసాల సంపుటి), తారాపథం (ఒక హీరోయిన్ ప్రస్థానం), అన్నదాత ఆర్థర్‌కాటన్ (బయోగ్రఫీ), రాజకీయ, ఆర్థిక విశ్లేషణతో కొన్ని వ్యాసాలు, ఆమెప్రస్థానం (అముద్రిత నవల)



### ప్రియదర్శిని చాగంటి

మచిలీపట్నంలో పుట్టినా, విద్యాభ్యాసం, పెరిగినదీ హైదరాబాదులో.

**ఉన్నతవిద్య**- ఉస్మానియా, పూనా యూనివర్సిటీ., ఎం.ఎ, ఎం.బి.ఎ, ఎం.ఫిల్.

పూనాలో మేనేజ్‌మెంట్ స్టడీస్ కాలేజీలో లెక్చరర్‌గా చేసి వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు.

**ప్రవృత్తి**- పుస్తకాలు, జర్నల్సూ బాగా చదవడం.

రామరక్ష, గుప్పెట్లో స్వర్గం, నేను వంటి చాలా కథలను వివిధ పత్రికల్లో రాశారు. కొన్ని వ్యాసాలు ప్రచురించారు.

భర్త పూనాలో సీనియర్ మెకానికల్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేయడం వల్ల సుమారు 30 సంవత్సరాలుగా పూనాలోనే నివాసం.

“మీకు ఇంకేమైనా చూడాలని ఉందా?” వాళ్ళని ప్రశ్నించాడు చంద్రవాసి.

“మాకు భూగ్రహం మీది కాశ్మీరు చూడాలని ఉంది. ఆటంకవాదుల వల్ల మేము కాశ్మీరు చూడడానికి వెళ్ళలేదు” అంది అనూష నవ్వుతూ.

“దానికంటే ముందు ఒక విషయం చెప్పండి. మీరు డబ్బు ఎలా సంపాదిస్తారు? ఎలా వాడుతారు? ఎక్కడ దాచుతారు?” అడిగాడు దీపక్.

“మేం ధనం సంపాదించం. మాకు అవసరం లేదు” అన్నాడు చంద్రవాసి.

“ధనం అవసరం లేనివాళ్ళు ఎవరుంటారు?” ఆశ్చర్యంగా అడిగింది అనూష.

“తినుబండారాలు, బట్టలు, ధాన్యం ఇలా ఎవరు చెయ్యగలిగినవి వాళ్ళు తెచ్చి, నిర్ధారిత స్థలంలో ఉంచుతారు. ఎవరికి ఎంత అవసరమో, అంతమాత్రమే చంద్రవాసులు తీసుకుంటారు. తీసుకున్న వస్తువుల వివరాలు కంప్యూటర్‌లో ప్రవేశపెడతారు. ఇలా చెయ్యడంవల్ల ఎవరు ఏవి, ఎంత తీసుకున్నారో లెక్క తెలుస్తుంది. మేము ధనం సంపాదించం కనుక దాచుకునే ప్రసక్తే లేదు” అన్నాడు చంద్రవాసి.

“ఈ పద్ధతి చాలాబావుంది” అన్నాడు దీపక్.

“ఇప్పుడు అనూషకి కాశ్మీరు చూపిద్దాం” నవ్వుతూ అన్నాడు చంద్రవాసి.

“కొంచెం దూరంలో ఒక గది కనిపిస్తోంది చూశారా? అక్కడికి వెడదాం” అన్నాడు చంద్రవాసి.

ముగ్గురు నడుస్తూ వెళ్ళి ఆ గది దగ్గరకి వెళ్ళారు.

“ఆ గదిలోకి వెళ్ళి కూర్చోండి. మీ కళ్ళజోళ్ళు పెట్టుకోండి. హెడ్‌ఫోన్స్ పెట్టుకుని, అవతల చివర, కంప్యూటర్‌కి అనుసంధానం చేసుకోండి” అన్నాడు చంద్రవాసి.

అనూష, దీపక్‌లు అలానే చేసారు.

మరుక్షణం వారు కాశ్మీరులో ఉన్న అనుభూతి పొందారు. చలి భరించలేకపోయారు.

మెత్తగా ఉన్న మంచుని బంతిలా చేసి అనూష మీదికి విసిరాడు దీపక్. అది తప్పించుకోడానికి అనూష పరుగెత్తింది. చెట్లనిండా మంచు పడి, ప్రకృతి తెల్లని దుప్పటి కప్పుకున్నట్లు ఉంది. అనూష గజగజా వణికింది.

“కాశ్మీరు ఎంతో అందంగా ఉంది కదా! ఇది భూమి మీద స్వర్గం” అన్నాడు దీపక్ పరవశంగా.

“అవును గాని నాకు భరించలేనంత చలిగా ఉంది” అంది అనూష, చలికి వణుకుతూ.

“దూరంగా ఒక ఇల్లు కనిపిస్తోంది. అక్కడికి వెడదాం. వేడిగా త్రాగటానికి ఏమైనా దొరుకుతుందేమో!” అన్నాడు దీపక్.

దట్టంగా కురిసిన మంచులో కష్టంగా నడుస్తూ, ఇద్దరూ ఆ ఇంటివైపు బయలుదేరారు. ఆ ఇల్లు చేరి తలుపుతట్టారు. ఆ ఇంటివారు వారిని ఆప్యాయంగా ఇంటిలోకి ఆహ్వానించారు.

“దారి తప్పి యాత్రికులు ఇలా రావడం మాకు అలవాటే” నవ్వుతూ అన్నాడు ఆ ఇంటి

యజమాని హిందీ భాషలో.

"మేం దారి తప్పలేదు. నా పేరు దీపక్. ఈమె అనూష. ఈమె చలికి తట్టుకోలేకపోతోంది" అన్నాడు దీపక్ వాళ్ళ భాషలో.

"ఈ షాల్ కప్పుకోమ్మా" అని షాల్ అందించింది ఇంటావిడ.

"ఆ మూల కట్టెలు మంటపెట్టాము. వెచ్చదనం కోసం మీరక్కడ కూర్చుని చలికాచుకోండి. నా భార్య మీకు వేడిగా టీ చేసి ఇస్తుంది" అన్నాడు యజమాని.

అనూష, దీపక్‌లు ఆ మంట దగ్గర కూర్చుని చలి కాచుకోసాగారు. వెచ్చదనం శరీరానికి తాకడంతో అనూష కొంచెం కుదుటపడింది. అంతలో ఆ ఇంటావిడ వాళ్ళకి వేడి టీ అందించింది.

"త్వరగా మీ హోటలు గదికి వెళ్ళిపోండి. ఇవాళ రోజూకన్నా చాలా అధికంగా మంచు కురుస్తుందని, ఎవరి ఇళ్ళల్లో వాళ్ళు భద్రంగా ఉండాలని, బయటకు రావద్దని, ఇప్పుడే రేడియోలో హెచ్చరిక ఇచ్చారు" అందావిడ.

"ధన్యవాదాలు. టీ చాలాబావుంది" అని ఖాళీ కప్పులని ఆమెకి అందించింది అనూష.

"దీపక్! ఇక వెడదామా?" అంది అనూష, దీపక్‌ని చూస్తూ.

ఇంతలో ఆ గది తలుపు తెరచుకుని, నవ్వుతూ లోపలికి వచ్చాడు చంద్రవాసి.

అతనిని చూసి, దీపక్, అనూషలు ఆశ్చర్యపోయారు.

వాళ్ళిద్దరూ ఎక్కడ కూర్చున్నారో అక్కడే కూర్చుని ఉన్నారు.

"ఏమిటిది? మేమింకా మీ గ్రహం మీదే ఉన్నామా? మేము కాశ్మీరు వెళ్ళనే లేదా?" ఆశ్చర్యంతో అడిగింది అనూష.

"అవును. మీరెక్కడకీ వెళ్ళలేదు. ఇదంతా కృత్రిమ ప్రకృతి విధానంలో మీకు చూపించబడింది" అన్నాడు చంద్రవాసి నవ్వుతూ.

అయోమయంగా అతనిని చూసారు దీపక్, అనూషలు.

"ఇందాక అనూష కాశ్మీరు చూస్తాననగానే నా చేతి కంప్యూటర్ సహాయంతో, కృత్రిమ ప్రకృతిలో కాశ్మీరు తయరుచేసాను. మాకు కాశ్మీరు గురించి అన్ని విషయాలు తెలియడం వల్ల ఇది సాధ్యమైంది" అన్నాడు చంద్రవాసి.

"మేం ఇంకా నమ్మలేకపోతున్నాం" అంది అనూష.

"మా చంద్రవాసులు ఈ విధానంలోనే విహారయాత్రలకు వెళ్ళిన అనుభూతులు పొందుతారు. ఎవరింట్లో వాళ్ళుండి, గుమ్మం దాటకుండానే, ప్రపంచమంతా చూడడం, ఈ పద్ధతి వలన సాధ్యమవుతుంది" అన్నాడు చంద్రవాసి.

కాశ్మీరు చూడడం కేవలం ఒక అనుభూతే కాని వాస్తవం కాదని దీపక్, అనూషలు తెలుసుకున్నారు.

"ఇక పదండి. మా చంద్రలోక దర్శనం పూర్తి అయింది. మీ గదికి వెడదాం. కొంచెం విశ్రాంతి తీసుకున్నాక, మీ అనుభూతులను కంప్యూటర్‌లో రికార్డు చెయ్యండి. ఆ తరువాత మీకు భోజనం వస్తుంది. అవి తిని, తయారై బయటకు రండి" అన్నాడు చంద్రవాసి.

"తయారై బయటకు వచ్చాక ఎక్కడికి వెడదాం?" ప్రశ్నించాడు దీపక్.

"బయటకు వచ్చి, మా చంద్రవాసులందరినీ కలుద్దురు గాని. మీ గ్రహం గురించి చెబుదురు గాని, ఆ తరువాత మీరు మీ భూగ్రహానికి వెళ్ళవచ్చు" అన్నాడు చంద్రవాసి. భూగ్రహానికి వెళ్ళవచ్చని వినగానే దీపక్, అనూషలకి చాలా సంతోషంగా అనిపించింది.

"ఈ కారు ఎక్కండి. మనం మీ గది దగ్గరికి వెడదాం" అన్నాడు చంద్రవాసి.

ముగ్గురూ కారు ఎక్కారు. డ్రైవరు లేదు. చంద్రవాసి తన చేతి కంప్యూటర్‌లో మీటలు నొక్కాడు. కారు అతివేగంగా ప్రయాణించి క్షణాల్లో వాళ్ళ గది ముందర ఆగింది. వాళ్ళ కళ్ళజోడులు, ఫోన్లు చంద్రవాసికి ఇచ్చారు దీపక్, అనూష. అవి తీసుకుని చంద్రవాసి వెళ్ళిపోయాడు.

దీపక్, అనూషలు కారుదిగి వాళ్ళ గదిలోకి ప్రవేశించారు. తమ కంప్యూటర్లని బల్లమీద బోర్లాపెట్టారు.

"వీరి అపార శాస్త్రజ్ఞానంతో, ఎన్ని ఆశ్చర్యజనకమైన విషయాలు చూపించారో కదా!" అంది అనూష.

"అవును. ఇవన్నీ మన దేశంలో నలభై, యాభై సంవత్సరాల తరువాత వస్తాయి. ఎంత పరిణితి చెందారు వీరు! నేను చంద్రగ్రహానికి బయలుదేరినప్పుడు, ఇంత విశిష్టమైనవి చూస్తానని అనుకోనే లేదు" అన్నాడు దీపక్.

"నిజమే! ఆ రోజు గుహలోకి రాకపోతే, ఇవన్నీ మనం చూడలేకపోయేవాళ్ళం" అంది అనూష.

"నేను కాలకృత్యాలు తీర్చుకుని, పడుకుంటాను. అలసటగా వుంది" అన్నాడు దీపక్.

"సరే, నిద్రలేచాక భోజనం చేద్దాం" అంది అనూష.

దీపక్ బాత్‌రూమ్‌లోకి వెళ్ళగానే గోడమీద కంప్యూటర్ దగ్గరికి వెళ్ళింది అనూష. తన పని పూర్తిచెయ్యడానికి ఎంత సమయమైందో అనూషకి తెలియలేదు.

"నువ్వు కూడా తయారవు" అన్న దీపక్ మాటలతో ఉలిక్కిపడింది అనూష.

దీపక్ బల్ల దగ్గర కూర్చున్నాడు. ఒక మరమనిషి ఆహారం తెచ్చి బల్లమీద పెట్టి వెళ్లిపోయాడు.

అనూష తయారై వచ్చింది. ఇద్దరూ భోజనం చేసి కాసేపు కబుర్లు చెప్పుకున్నారు.

తరువాత కమ్మని నిద్రలోకి జారిపోయారు.

మెలుకువ వచ్చాక, బీరువా దగ్గర నుంచుని, అది తెరుచుకున్నాక; వాళ్లు వేసుకుని వచ్చిన బట్టలు తొడుక్కున్నారు. బూట్లు, హెల్మెట్లు కూడా పెట్టుకున్నారు. తాము విప్పిన బట్టలని, గోడమీద ఫలకంలో మీట నొక్కి ఉతకడానికి బుట్టలో వేసారు.



తరువాత చేతి కంప్యూటర్లని తీసుకుని గది బయటకి వెళ్ళారు. అప్పటికే తాము చూసిన నలుగురు శాస్త్రవేత్తలు, వారి వెనుక మిగిలిన చంద్రవాసులు వారి రాకకోసం ఎదురుచూస్తు న్నారు.

"మీరు మమ్మల్ని చాలా ఆదరంగా చూసారు. మాకు కాలం ఎలా గడిచిపోయిందో అర్థం కాలేదు. మాకు ఎక్కడా ఇబ్బంది రాకుండా, మమ్మల్ని ఆప్యాయంగా చూసుకు న్నారు. ధన్యవాదాలు" అన్నాడు దీపక్.

అనూష, దీపక్‌లు వాళ్ళకి నమస్కరించారు.

"ఇంతకాలం మీతో ఉండబట్టి మీ మీ అను బంధం పెరిగింది. మిమ్మల్ని విడిచివెళ్ళాలంటే ఒకరకమైన బెంగ అనిపిస్తోంది. కానీ మా గ్రహానికి మేము వెళ్ళాలి కదా! మళ్ళీ మా జీవి తకాలంలో మిమ్మల్ని కలవమేమో! కాని మీ జ్ఞాపకాలు మా గుండెల్లో చిరకాలం ఉంటాయి" అంది అనూష కొంచెం ఉద్వేగప డుతూ.

చంద్రవాసులందరూ వాళ్ళ కంప్యూటర్ల ద్వారా, వీరు మాట్లాడినదంతా అర్థంచేసుకు న్నారు.

"మా భూగ్రహం గురించి విశేషాలన్నీ మీ కంప్యూటర్‌లో రికార్డు చేసాను" అంది అనూష.

"ఇదెప్పుడు చేసావు?" అన్నాడు దీపక్ ఆశ్చ ర్యంగా.

"మీరు బాత్‌రూమ్‌లో ఉన్నప్పుడు" అంది అనూష నవ్వుతూ.

"అవును. అనూష చెప్పిందంతా నిజం. మేము ఆ రికార్డింగ్ విన్నాం" అన్నారు ఒక శాస్త్రవేత్త.

"అనూష, దీపక్! చంద్రవాసులకి మీలాంటి సున్నిత అనుభూతులు వుండవు. వారికి బెంగ, ఆనందం అంటే తెలియదు. అందుకని వాళ్ళని మీలా ఊహించవద్దు. మీరు బెంగపడకుండా ఆనందంగా మీ గ్రహానికి వెళ్ళండి" అన్నాడు మరో శాస్త్రవేత్త.

"ఒక వినతి. మా కెమెరాతో, మీ అందరి ఫోటో తీసుకోవచ్చా?" అడిగాడు దీపక్.

"తీసుకోండి" అన్నాడు మరో శాస్త్రవేత్త.

అనూష, దీపక్‌లు వాళ్ళ కెమెరాలతో ఫోటోలు తీసుకున్నారు.

"మాతో మీరు కూడా తీసుకుందురు గాని రండి" అన్నాడు మరో శాస్త్రవేత్త.

దీపక్, అనూషలు శాస్త్రవేత్తల చెరో పక్కా నిలుచున్నారు. వాళ్ళు ఒక సెల్ఫీ తీసుకున్నారు.

"మేము రికార్డు చేసినవి, మా ఐడిలకి పంపుతారుగా" అన్నాడు దీపక్.

"తప్పకుండా పంపుతాము. మీరు తీసిన పోలరాయిడ్ ఫోటోలు, చంద్ర ఉపరితలం మీదకి వెళ్ళాక చూసుకోండి. అంతదాకా వద్దు" అన్నాడు మొదటి శాస్త్రవేత్త.

"కొన్ని గంటల క్రితమే, చంద్రతలం మీద ఉన్న మీ మాడ్యూల్‌ను, భూగ్రహానికి వెళ్ళడా నికి తయారుచేసాం. మీరు ఏ ఇక్కట్లు లేకుండా తిరుగు ప్రయాణం చెయ్యవచ్చు" అన్నాడొక శాస్త్రవేత్త.

"మీరు కొన్ని గంటల్లో తిరుగు ప్రయాణం అవుతున్నారని మీ శాస్త్రవేత్తలకి కూడా తెలియ పరిచాం" అన్నాడు మరోశాస్త్రవేత్త నవ్వుతూ.

"ధన్యవాదాలు. ఇంతకీ మీ నలుగురూ ఏ గ్రహం నుంచి వచ్చారు? లేక మీరు చంద్రవా సులేనా?" అడిగాడు దీపక్.

"మేం చంద్రవాసులము కాము. భూవాసు లము కాము. ఏ గ్రహము నుంచి వచ్చామో ఇప్పుడు చెప్పము. ఎందుకంటే అది ఇంకా చాలా ఏళ్ళు గుప్తంగా ఉంచవలసిన సమా చారం" అన్నాడు ఇంకొక శాస్త్రవేత్త.

ఇంక అనూష, దీపక్‌లు వాళ్ళ దగ్గర శెలవు తీసుకుని చంద్ర ఉపరితలానికి నడవడానికి సిద్ధం అయ్యారు.

"నడవక్కరలేదు. మీరు ఆ పలకలమీద బోర్లా పడుకోండి. మేము మీట నొక్కగానే క్షణాల్లో చంద్ర ఉపరితలానికి చేరుకుంటారు" అన్నాడు మొదటి శాస్త్రవేత్త.

అనూష, దీపక్‌లు చంద్రవాసులు తమకి ఇచ్చిన పలకల మీద బోర్లాపడుకున్నారు.

శాస్త్రవేత్త తన కంప్యూటర్‌లో మీట నొక్కాడు. ఒక్క క్షణంలో వారిద్దరూ చంద్ర ఉప రితలానికి చేరారు.

## భూమికి తిరుగు ప్రయాణం

చంద్ర ఉపరితలం మీద లేత వెలుగు సంత రించుకుంటోంది.

"వీళ్ళకి పగటివేళ మొదలవుతున్నట్లుంది" అంది అనూష.

వారు గుహ నుండి చంద్ర ఉపరితలం మీద కొచ్చాకా, ఇస్రో, నాసా శాస్త్రవేత్తలకు అందుబా టులోకొచ్చారు.

"ఇప్పటివరకు మీరెక్కడున్నారు?" శాస్త్రవే త్తలు వారినడిగారు.

"మేం తిరిగి వచ్చాక వివరించి చెబుతాం" అన్నారు వారు.

"సరే, మీరు లూనార్ మాడ్యూల్‌లోకి వెళ్ళండి" అని ఆదేశించారు శాస్త్రవేత్తలు.

ఇద్దరూ చంద్రగ్రహం నలువైపులా, చివరి సారిగా చూసారు. మెల్లిగా గెంతులాంటి నడ కతో తమ మాడ్యూల్‌ను చేరారు.

"ఆ ఫోటోలు ఒకసారి చూశాక బయలుదే రుదాం" అంది అనూష.


ఫోటోలని చూసి ఇద్దరూ నిశ్చేష్టులయ్యారు. ఆ ఫోటోల్లో శాస్త్రవేత్తలు, అనూష్, దీపక్‌లు తప్ప ఇంకెవరూ లేరు. పూలచెట్లు, రహదా రులు ఏమీ లేవు.

"ఆశ్చర్యంగా వుందే" అంది అనూష.

"కృత్రిమ ప్రకృతి మరి!" అని నవ్వాడు దీపక్.

తమ దేశంలోని శాస్త్రవేత్తలతోటి, నాసా శాస్త్రవేత్తలతోటి మాట్లాడారు.

లూనార్‌ను చంద్రకక్ష్యలోవున్న అంతరిక్ష



నౌకవైపు నడపమని శాస్త్రవేత్తలు ఆదేశించారు. నిచ్చెన పైకి లేచింది. మాడ్యూల్‌లోనికి వెళ్ళి తలుపులు మూసివేసారు. అనూష, దీపక్‌లు మాడ్యూల్‌లో కూర్చున్నారు. మాడ్యూల్ వేగంగా అంతరిక్ష నౌక వైపు ప్రయాణించింది. దగ్గరకు చేరగానే, స్వామినాథన్ అంతరిక్షనౌక తలుపులు తెరిచాడు. మాడ్యూల్ అంతరిక్ష నౌక లోకి ప్రవేశించే ప్రక్రియను ముగ్గురు వ్యోమగా ములు కలిసి పూర్తిచేసారు. లూనార్ మాడ్యూల్ మాతృనౌకతో అనుసంధానమయింది.

ఒక్కసారి బయట చంద్రతలాన్ని చూసి, తిరుగు ప్రయాణం మొదలుపెట్టారు అనూష, దీపక్.

* * *

శాస్త్రవేత్తల ఆదేశం మేరకు వారు అంతరిక్ష నౌకను భూమివైపు వేగంగా నడిపారు.

“ఇదిచూడండి! అద్భుతం! చంద్రగ్రహం నుంచి, నాసా నుంచి మెయిల్ వచ్చింది” అన్నాడు ఒక శాస్త్రవేత్త ఉత్సాహంగా.

“మన అంతరిక్ష యాత్రికులు తిరుగు ప్రయాణం మొదలుపెట్టారు. చంద్రగ్రహ విశేషాల వివరాలని కూడా జతపరిచారు” అన్నాడు శాస్త్రవేత్త ఆనందంగా.

ఆ మెయిల్ చూస్తున్న పక్క శాస్త్రవేత్త కూడా చాలా ఆనందపడ్డాడు.

“అంతేకాదు, చంద్రగ్రహంపై ఉన్న ఒక శాస్త్రవేత్త కూడా మెయిల్ చేసాడు” అన్నాడు.

“ఒక పనిచేద్దాం. ఉన్నతాధికారులని, ప్రధానమంత్రిని వీడియోకాన్ఫరెన్స్‌కి ఆహ్వానించి, ఆ మెయిల్ చదువుదాం” అన్నాడు శాస్త్రవేత్త. అలాగే చేసారు అక్కడ ఉన్న శాస్త్రవేత్తలు.

అందరూ వీడియో కాన్ఫరెన్స్‌కు రాగానే ఆ మెయిలు చదవసాగారు.

“మీ భూగ్రహం మీద జపాను శాస్త్రవేత్తలు కనుగొన్న ఒక గుహలో, మేం నలుగురు శాస్త్రవేత్తలం, పరిణితి చెందిన శాస్త్రజ్ఞానంతో పరిశోధనలు చేస్తున్నాము. మా పరిశోధనాంశం ఏమిటంటే, కృత్రిమ ప్రకృతి, కృత్రిమ మేధస్సులతో రూపొందించిన పర్యావరణంలో భూవాసులు ఎలా ఉంటారా అని. ఎన్నో రోజులుగా ఎవరైనా భూ వాసులు చంద్రగ్రహానికి వస్తారేమో అని చాలా ఎదురుచూసాం. చివరికి మీరు పంపిన అనూష, దీపక్‌లు వచ్చారు. వారిని కృత్రిమ ప్రకృతి, కృత్రిమ మేధస్సులతో రూపొందించిన పర్యావరణంలో ఇన్ని రోజులు ఉంచాము. వారి ప్రవర్తనని మేము గమనించి మా ప్రయోగాలని ఒక అంతిమ స్థానానికి తేగలిగాము.

వారు వచ్చినప్పటినుంచీ, మా గుహలో ఒకేచోట ఉన్నారు. కాని గుహల్లో పర్యటించి అనేక అద్భుతాలని చూసిన అనుభూతి వాళ్ళకి కలిగింది.

వాళ్ళు చెప్పే విశేషాలన్నీ కృత్రిమ ప్రకృతిలో వాస్తవికాలు. కాని సహజ ప్రకృతిలో ఇవేమీ లేవు.

మా ప్రయోగాలు సాకారం కావడానికి అనూష, దీపక్‌లు రావడం చాలా ముఖ్యమైన అంశం. వారిని పంపినందుకు మీకు ధన్యవాదాలు.

మేము ఏ గ్రహం నుంచి చంద్రగ్రహంలోని గుహల్లోకి వచ్చామో ఇప్పుడే చెప్పము. ఇది కొన్ని దశాబ్దాల దాకా గోప్యంగా ఉంచవలసిన విషయం.

మీ భూవాసులందరూ స్నేహపూర్వకంగా, శాంతియుతంగా కలకాలం జీవించాలని కోరుకుంటున్నాము. శెలవు తీసుకుంటున్నాము” అని ఉంది ఆ మెయిల్‌లో.

అది విన్న ప్రధానమంత్రి, ఉన్నత అధికారులు, శాస్త్రవేత్తలు నోట మాటరాక, ఆశ్చర్యంలో అలానే ఉండిపోయారు చాలాసేపు.

“ఇంతకీ దీపక్, అనూషలు భారతదేశం ఎప్పుడు చేరుతారు?” అని అడిగారు ప్రధాన మంత్రి.

“ఇంకొక రెండురోజుల్లో అమెరికాలోని నాసాకు చేరుతారు. ఆ తరువాత కొన్ని సపర్యల నందుకొని, మరో నాలుగురోజుల్లో మన భారతదేశానికి వస్తారు” అన్నారు శాస్త్రవేత్తలు.

“అయితే వెంటనే మీడియాను పిలిచి, అంతరిక్ష యాత్రికుల ఉనికి తెలిసిందని, మరో వారం లోపు భారతదేశం చేరుకుంటారని చెప్పండి. అక్కడి శాస్త్రజ్ఞుల మెయిల్ గురించి చెప్పొద్దు. కొన్ని అద్భుతాలు, దీపక్, అనూషలని కూడా చెప్పనియ్యండి. పాపం ఇన్ని రోజులుగా ఒంటరిగా, ధైర్యంగా గడిపారు” అన్నారు ప్రధాన మంత్రి.

“అలాగే చేస్తాం సార్” అన్నారు శాస్త్రవేత్తలు.

“మరోమాట! వాళ్ళ ఘన స్వాగతానికి ఏర్పాట్లు చెయ్యండి” అన్నారు ప్రధానమంత్రి.

వీడియోకాన్ఫరెన్సు ముగిసింది.

శాస్త్రవేత్తలు ఒకరినొకరు కౌగిలించుకుని, తరువాత కరచాలనం చేసుకుని, శుభాకాంక్షలు చెప్పుకున్నారు ఆనందంగా.

**(అయిపోయింది)**

# కృతజ్ఞతలు

‘చంద్రునితో ఒక రోజు’ సీరియల్‌ను మాకు తెలిసిన మేరకు, తోచినంత వరకూ రాశాము. దీనిని ప్రచురించి పాఠకులకు చేర్చే బాధ్యతను ‘ఆంధ్రభూమి’ సచిత్ర వారపత్రిక సంపాదకవర్గం వారు స్వీకరించారు. వారం వారం మంచి విభాగాలుగా, మంచి చిత్రాలతో ప్రచురించి పాఠకులకు అందించారు. వారి చిత్రకారులు సందర్భానుసారంగా అందమైన చిత్రాలను వేసి అలంకరించారు. రచనలోని లోపాలను ఎంచకుండా, పాఠకులంతా చదివి ఆదరించారు. అందరికీ మా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం. శాస్త్ర సాంకేతిక విషయాలలో మా పరిజ్ఞానం చాలా పరిమితమైనది. మేము పరిమిత పరిజ్ఞానంతో రాసినా, భారత శాస్త్రవేత్తలు (ఇస్రో) అద్భుతమైన ఖగోళ పరిశోధన (చంద్రయాన్-2) చేస్తున్న సమయంలో ఇది ప్రచురణ కావడం మనకందరికీ సంతోషకరం.

-రచయితలు